ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 05.10.2026 | సంపుటి :13 సంచిక :76 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



# కరువొచ్చింది మహాప్రభో..!

## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలి

## తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలి

తెలంగాణను మరోసారి ప్రకృతి విపత్తు వెంటాడుతోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదై కరువు ఛాయలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలోని 235 మండలాల్లో తీవ్ర వర్షాభావం, కరువు తరహా పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం వెల్లడిస్తోంది. దీంతో అన్నదాతకు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిస్థితిని తీవ్రంగా పరిగణించి రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

హైదరాబాద్(జనంసాక్షి): గతంలో భారీ వరదల సమయంలోనూ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో ఆర్థిక సాయం అందలేదని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించిన నేపథ్యంలో.. తాజా వర్షాభావ పరిస్థితుల్లోనైనా కేంద్రం తెలంగాణను ఆదుకుంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతాంగంపై పడే ప్రభావాన్ని అంచనా వేసి ప్రత్యేక ఆర్థిక సాయం, ఉపశమన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరుతోంది. ఈసారైనా కేంద్రం స్పందించి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది.

### లోటు వర్షపాతం జిల్లాలు ఇవే...

ఆదిలాబాద్,నిర్మల్,భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్,హనుమకొండ,జనగామ,యాదాద్రి భువనగిరి,మేడ్చల్-మల్కాజిగిరి,హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్ నగర్,జోగులాంబ గద్వాల,వనపర్తి,నాగర్‌కర్నూల్,నల్గొండ, సూర్యాపేట,ఖమ్మం,నారాయణపేట)

- అప్పుడు వరదల్లోనూ మొండిచేయి.. ఇప్పుడైనా కనికరించేనా..?
- ఇప్పటికే 18 జిల్లాల్లో లోటు వర్షపాతం
- తెలంగాణలోని 235 మండలాల్లో నెలకొన్న కరువు ఛాయలు

దక్షిణ తెలంగాణపై అధిక ప్రభావం

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల పరిస్థితి రాష్ట్ర సగటు లెక్కల్లో 'సాధారణం'గా కనిపించినా.. జిల్లాల వారీగా మిగతా 2లో..

---

## జంతర్ మంతర్ వద్ద మహిళా జర్నలిస్టులపై



# లైంగిక వేధింపులు

## విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపైనే పోలీసుల దౌర్జన్యమా..?

దేశ రాజధాని నడిబొడ్డున, ప్రజాస్వామ్య నిరసనలకు ప్రతీకగా నిలిచిన జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రజల హక్కులను, నిరసనలను, ప్రభుత్వ వ్యవహారాలను ప్రపంచానికి తెలియజేయాల్సిన పాత్రికేయులపైనే రక్షణ కల్పించాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలు ఇప్పుడు ఢిల్లీ పోలీసు వ్యవస్థపైనే తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

- ముగ్గురు మహిళా జర్నలిస్టుల ఫిర్యాదులు
- క్రైమ్ బ్రాంచ్‌కు కేసు బదిలీ.. దర్యాప్తుకు ఆదేశాలు
- పత్రికా స్వేచ్ఛను, మహిళల భద్రతను కాపాడాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగ్రహం
- దేశవ్యాప్తంగా నిరసించండి..
- మహిళా జర్నలిస్టుల పిలుపు

న్యూఢిల్లీ(జనంసాక్షి): అక్టోబర్ 3న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలను కవర్ చేసేందుకు వెళ్లిన ముగ్గురు మహిళా జర్నలిస్టులు మిగతా 2లో..



## అమిత్ షా సమాధానం చెప్పాలి

- జంతర్ మంతర్ వద్ద పోలీసుల అసభ్య ప్రవర్తనపై రాహుల్ ఆగ్రహం
- మహిళలను రక్షించాల్సిన పోలీసులే వారికి వ్యతిరేకంగా దౌర్జన్యాలు చేస్తున్నారని మండిపాటు

2లో..

---

అయోధ్య విరాళాల చోరీ కేసు..

## విచారణ ముగించేందుకు మోదీ సర్కార్

# తొందరపడుతోంది

- దర్యాప్తు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది : కాంగ్రెస్
- విపక్ష నాయకులపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికీ వెనుకాడదని ఎద్దేవా



న్యూఢిల్లీ(జనంసాక్షి):అయోధ్య రామమందిర విరాళాల చోరీ కేసు దర్యాప్తును ముగించడానికి బీజేపీ ప్రభుత్వం తొందరపడుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతోందని మండిపడింది. దర్యాప్తు విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉదాసీనంగా మిగతా 2లో..



## అన్ని వేళలా భారత్‌కు అండగా రష్యా

అమెరికా కావాలనే ఒంటరి శక్తిగా మారింది

చైనా ఎదుగుదలతో ప్రపంచంలో కొత్త పోటీ : జైశంకర్

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌కు రష్యా పలు సందర్భాల్లో అండగా నిలిచిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ గుర్తు చేశారు. చరిత్ర మంచిదైనా.. చెడుదైనా.. ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. ఢిల్లీలో జరిగిన 62వ మ్యూనిక్ భద్రతా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 1950వ దశకంలో ప్రపంచంలోని మిగతా 2లో..

---

# ఎస్ఎల్‌బీసీ ఇక శరవేగం

## షియర్‌జోన్‌ను దాటాం.. గండం గట్టెక్కింది : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- ప్రాజెక్టు పనుల్లో అత్యంత క్లిష్ట దశను దాటాం
- ఐదారు నెలల్లో సుమారు 700 మీటర్ల పురోగతి
- అదనపు యంత్రాలు, జర్మనీ నుంచి లోకోమోటివ్ రాకతో పెరగనున్న పనుల వేగం
- 2028 జూన్ నాటికి నీటి సరఫరా లక్ష్యం..
- కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమని వెల్లడి






హైదరాబాద్(జనంసాక్షి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనుల్లో అత్యంత క్లిష్టమైన భూగర్భ పరిస్థితులను అధిగమించి కీలక ముందడుగు వేశామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని బలహీన శిలల మండలాన్ని (షియర్ జోన్) జాగ్రత్తగా దాటడంతో పనుల వేగం పెంచేందుకు మార్గం సుగమమైందన్నారు. అదనపు యంత్రాలను రంగంలోకి దించి, తవ్విన రాళ్లు, మట్టిని బయటకు తరలించే వ్యవస్థను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగంతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అమలుపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో మంత్రి ఆదివారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, అదనపు యంత్రాల వినియోగంపై చర్చించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతంలోని మెట్ట ప్రాంతాలకు 30 టీఎంసీలకు పైగా నీటిని అందించి, ఏళ్ల తరబడి వేధిస్తున్న నీటి కొరతను తీర్చాలన్నదే లక్ష్యమని తెలిపారు. 2028 జూన్ నాటికి నీటిని అందించేందుకు పక్కా కార్యా చరణ రూపొందించి, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ఐదారు నెలల్లో 700 మీటర్లుగడిచిన ఐదారు నెలల్లో సొరంగం తవ్వకాలు సుమారు 700 మీటర్లు ముందుకు సాగినట్లు ప్రాజెక్టు బృందం మంత్రికి వివరించింది. అవుట్‌లెట్ వైపు సుమారు 450 మీటర్లు, ఇన్‌లెట్ వైపు 250 మీటర్ల మేర పురోగతి నమోదైందని తెలిపింది. తీవ్రమైన భూగర్భ, సాంకేతిక సమస్యలతోపాటు యంత్రాలు, తవ్విన పదార్థాల రవాణాలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఈ పురోగతి సాధించినట్లు పేర్కొంది. మొత్తం 43. 968 కిలోమీటర్ల ప్రధాన సొరంగం పనులు సుమారు 79 శాతం పూర్తయ్యాయని, మరో 9.1 కిలోమీటర్ల మేర తవ్వకాలు మిగిలి ఉన్నాయని వివరించింది.అత్యంత ప్రమాదకరమైన షియర్ జోన్‌ను దాటడం ప్రాజెక్టులో ముఖ్యమైన ముందడుగని ఉత్తమ్ పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిన అధికారులు, కార్మికుల కృషిని అభినందించారు. ఈ పురోగతిని కొనసాగిస్తూ సొరంగంలో 20 కిలోమీటర్లకు పైగా లోపల పని చేస్తున్న సిబ్బంది భద్రతను కాపాడేందుకు మిగతా 2లో..

---

# సింగీతానికి కన్నీటి వీడ్కోలు

## పలువురు చిత్రపరిశ్రమ ప్రముఖుల ఘన నివాళి



చెన్నై(జనంసాక్షి):ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూయడం పట్ల సినీలోకం తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఆయన మృతి భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటని సినీ ప్రముఖులు కొనియాడు తున్నారు. అగ్ర నటులు కమల్ హాసన్, నందమూరి బాలకృష్ణ ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని ఘనంగా నివాళులు అర్పించారు. "సింగీతం గారు కోరుకున్నట్లే తనలోని యవ్వనంతో పాటే తుదిశ్వాస విడిచారు. ఆయనలోని ఆ యువతత్వం అందరికీ లేదు. ఆ లక్షణం అందరికీ అబ్బాలని ఆయన చేయి పట్టుకుని నడిచిన స్నేహితులు, శిష్యుల్లో నేనూ ఒకడిని. ఆయన్ని కలిసినప్పటి నుంచి ఎంతో ఆరాధిస్తున్నా. ఇప్పుడు ఆయన లా జీవించాలని ఆశిస్తున్నా" అని కమల్ హాసన్ అన్నారు. "మా నాన్నగారు తొలిసారి శ్రీకృష్ణుడిగా నటించిన 'మాయాబజార్' చిత్రానికి దర్శకుడు కె.వి.రెడ్డి దగ్గర సింగీతం గారు సహాయకుడిగా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత నాన్నగారి ఎన్నో చిత్రాలకు ఆయన పనిచేశారు. అలా మా కుటుంబంతో ఆయనకు సినిమా రంగానికి మిగతా 2లో..

---

# అవును.. విమానాన్ని కూల్చేయాలనుకున్నా..



## నేరాన్ని అంగీకరించిన ఫ్లైదుబాయ్ కోపైలట్




అబుదాబి(జనంసాక్షి): ఫ్లైదుబాయ్ విమానాన్ని హైజాక్ చేయడానికి యత్నించాడని అనుమానిస్తున్న కో పైలట్ హమామ్ అల్-హమ్మామి తన నేరాన్ని అంగీకరించాడు. విమానాన్ని కూల్చివేయాలని అనుకున్నానని.. పథకం ప్రకారమే కెప్టెన్ స్మిత్ మచ్చర్ దృష్టి మళ్లించి, దాడి చేశానని విచారణలో పేర్కొన్నాడు. తనకు మరణమంటే భయం లేదంటూ వ్యాఖ్యానించాడు. అయితే ఈ కుట్ర వెనుక ఎవరున్నారనే విషయం మాత్రం వెల్లడించలేదు. అతడికి అంతర్జాతీయ ఉగ్ర ముఠాలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే విషయంపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి. హమ్మామి యూఏఈలోనే జన్మించాడు. తండ్రి ఒమన్ జాతీయుడు. తల్లి సిరియా జాతీయురాలు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతడు ఒమన్, సిరియా, మొరాకోల్లోనూ గడిపాడు. సిరియాలో సుదీర్ఘకాలం జరిగిన మిగతా 2లో..

### ప్రేయర్ చేసుకుంటానని వెళ్లి.. వెనుక నుంచి గొడ్డలితో నరికాడు

ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్ ఘటనను వివరించిన స్మిత్ మచ్చర్

2లో..

---

## కృత్రిమ మేధలో అధిపత్యం కోసం

# సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్

## ప్రకటించిన ట్రంప్.. పలువురు ప్రముఖులకు బాధ్యతలు



వాషింగ్టన్(జనంసాక్షి):కృత్రిమ మేధ రంగంలో తమ దేశ ఆధిపత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్'ను ప్రకటించారు. నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జే క్లేటన్‌తోపాటు మరికొందరు ప్రముఖులకు ఎస్ఐఎఫ్ బాధ్యతలు అప్పగించినట్లు 'ట్రూత్ సోషల్' వేదికగా వెల్లడించారు. దేశాధ్యక్షుడు, చీఫ్ ఆఫ్ స్టాఫ్‌కు ఈ ఫోర్స్ నేరుగా రిపోర్ట్ చేస్తుందన్నారు. "సూపర్ ఇంటెలిజెన్స్ రంగంలో అమెరికా అగ్రగామిగా కొనసాగేలా ప్రభుత్వ ప్రయత్నాలకు ఈ ఫోర్స్ దిశానిర్దేశం చేస్తుంది. అదేవిధంగా వినియోగదారులు, మత సంస్థలు, క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్లు, సూపర్ ఇంటెలిజెన్స్ కంపెనీలతో ప్రభుత్వం జరిపే సంప్రదింపులను సమన్వయం చేస్తుంది. అమెరికా ప్రజల ప్రయోజనాలను కాపాడి.. వారి జీవితాలను మెరుగుపరుస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు.వైట్‌హౌస్‌లో ప్రముఖ టెక్ కంపెనీల ప్రతినిధులతో కలిసి ట్రంప్ ఇటీవల 'ఏఐ అకార్డ్'ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే. దీంతో ఏఐని అదుపులో పెట్టే నైతిక బాధ్యతను అగ్రశ్రేణి టెక్ కంపెనీలు స్వచ్ఛందంగా మిగతా 2లో..

---




## సీఈసీ జ్ఞానేశ్‌పై విజిలెన్స్ విచారణ

తిరువనంతపురం(జనంసాక్షి): ఓట్ల చోరీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించిన ఓ పాత కేసులో కేరళం హోంమంత్రి రమేశ్ చెన్నితాల విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు 2006లో స్టేట్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా జ్ఞానేశ్ మిగతా 2లో..

# ఎస్ఎల్బీసీ ఇక శరవేగం

అధికారులు, గుత్తేదారు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జాగ్రత్తగా సాగిన తవ్వకాలుసొరంగం పనులకు నేతృత్వం వహిస్తున్న భారత సైన్యానికి చెందిన సొరంగ నిర్మాణ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఇన్లెట్ వద్ద ఎదురైన పరిస్థితులను వివరించారు. బలహీనమైన నేల, రాళ్లు ఒక్కసారిగా విరిగిపడే రాక్ బర్స్ట్ వంటి ప్రమాదకర పరిస్థితుల కారణంగా మరో ప్రమాదం జరగకుండా తొలి నెలల్లో తవ్వకాల వేగాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించినట్లు తెలిపారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిన ప్రాంతాన్ని చుట్టి వెళ్లేలా చేపట్టిన మళ్లింపు తవ్వకాల్లో మరింత బలహీనమైన శిలల మండలం ఎదురైందని వివరించారు. 2028 మే జూన్లో ప్రధాన సొరంగం అనుసంధానం లక్ష్యంటన్నెల్-1లో రెండు వైపుల నుంచి సాగుతున్న తవ్వకాలు 2028 మే-జూన్ నాటికి కలిసే దశకు చేరుకుంటాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తవ్వకాలతోపాటే సొరంగం లోపలి గోడలను బలపరిచే స్ప్రే లైనింగ్ పనులు చేపడుతున్నారని, దీంతో సొరంగం అనుసంధానం పూర్తయ్యేలోపే లైనింగ్లో అధిక భాగాన్ని పూర్తి చేసే అవకాశం ఉందని సమీక్షలో వివరించారు. ప్రధాన సొరంగంతోపాటు టన్నెల్-2, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఇతర అనుబంధ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. వీటిలో ఏ పని అసంపూర్తిగా ఉన్నా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 7.1 కిలోమీటర్ల పొడవున్న టన్నెల్?2లో సుదీర్ఘ విరామం తర్వాత లైనింగ్ పనులు తిరిగి ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.సమీక్షలో ఎంపీలు కె. రఘువీర్రెడ్డి, చామల కిరణ్కుమార్రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, కె. జైవీర్రెడ్డి, వేముల వీరేశం, అనిల్ కుమార్రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్; నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్; ఇంజినీర్ ఇన్ చీఫ్ ఓ.వి. రమేష్బాబు, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్పై విజిలెన్స్ విచారణ

## కేరళం హోంమంత్రి ఆదేశం

కుమార్ పనిచేసిన సమయంలో జరిగిన అవకతవకలపై ఈ దర్యాప్తు జరగనుంది. కేరళ స్టేట్ ట్రాన్స్పోర్ట్ ప్రాజెక్ట్ కింద ఎంసీ రోడ్డు అభివృద్ధి పనుల్లో పాల్గొన్న ప్యాటీ- బెల్ కన్సార్టియానికి చెందిన మలేసియా సివిల్ ఇంజనీర్ లీ సీ బీన్ ఆత్మహత్యకు సంబంధించిన వ్యవహారంలో ఈ విచారణ చేస్తారు.లీ రాసిన సూసైడ్ నోట్లో జ్ఞానేశ్ కుమార్ పేరు ఉన్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో బాహ్య ఒత్తిళ్ల కారణంగా ఈ కేసును తప్పుదోవ పట్టించారనే ఆరోపణల నేపథ్యంలో తాజాగా విజిలెన్స్ దర్యాప్తునకు కేరళం హోంమంత్రి ఆదేశాలు ఇచ్చారు. జ్ఞానేశ్ కుమార్ ప్రమేయం ఉన్న ఈ కేసులో బయటి వ్యక్తుల ప్రభావం, తదితర ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని రమేశ్ చెన్నితాల నేరుగా విజిలెన్స్ డైరెక్టర్ను ఆదేశించినట్లు హోంమంత్రి కార్యాలయం వెల్లడించింది.

**పాత విచారణ ఫైళ్లను కోరిన హోంశాఖ**

2006లో జ్ఞానేశ్ కుమార్ పీడబ్ల్యూడీ కార్యదర్శిగా ఉన్న సమయంలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై విజిలెన్స్, అవినీతి నిరోధక బ్యూరో (వీఏసీబీ) ద్వారా విచారణ జరిపించాలని హోంమంత్రి ఆదేశించారు. గతంలో వీఏసీబీ నిర్వహించిన ప్రాథమిక విచారణకు సంబంధించిన అన్ని ఫైళ్లను హోంశాఖ కోరినట్లు సమాచారం. అప్పటి విచారణ బాహ్య ఒత్తిడి కారణంగా దారి తప్పిందన్న ఆరోపణలను పరిశీలించాలని హోంమంత్రి ఆదేశించారు. ఈ కేసులో బాహ్య ప్రభావం ఉందన్న ఆరోపణ తీవ్రమైనదని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. విచారణ పూర్తయిన తర్వాత ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ డైరెక్టర్కు సూచించారు.

# లష్కరే ఉగ్రవాది.. తూటా గాయాలకు తేనె చికిత్స!

**జనంసాక్షి:** లష్కరే తయ్యిబా ఉగ్రవాది, పాకిస్థాన్ సైన్యానికి చెందిన 'స్పెషల్ సర్వీసెస్ గ్రూప్' మాజీ కమాండోగా భావిస్తున్న మహమ్మద్ ఆసిఫ్ అలియాస్ హషీం మూసాను భద్రతాబలగాలు కశ్మీర్లోని బడ్గామ్ జిల్లాలో హతమార్చాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రధాన సూత్రధారుల్లో ఇతను ఒకడు. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. గతంలో 'ఆపరేషన్ షేరువాలీ'లో భాగంగా రాజౌరీలో జరిగిన ఓ ఎన్కౌంటర్లో మూసాకు తూటా గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇద్దరు ఉగ్రవాదుల కోసం 45 రోజులకుపైగా ఆపరేషన్ కొనసాగగా.. వారు మూసా, అతని సహచరుడు యాసిర్ అని ఆ తర్వాత వెల్లడైంది.పూంచ్, రాజౌరీ అడవుల్లో తలదాచుకున్న సమయంలో తన తూటా గాయాలకు మూసా తేనెను పూసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్ఫెక్షన్ సోకకుండా ఉండేందుకు, త్వరగా కోలుకునేందుకు తేనెలోని ఆయుర్వేద గుణాలను వినియోగించుకున్నట్లు చెప్పారు.

# కరువొచ్చింది మహాప్రభో..

చూస్తే వర్షాభావ తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రానికి సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఐఎండీ ప్రమాణాల ప్రకారం -19 నుంచి +19 శాతం మధ్య ఉంటే సాధారణ వర్షపాతంగా పరిగణిస్తారు. రాష్ట్ర సగటు సాధారణంగా కనిపిస్తున్నప్పటికీ.. 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతం కేటగిరీలో ఉండటం పరిస్థితి తీవ్రతను వెల్లడిస్తోంది. లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఆదిలాబాద్, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, వికారాబాద్, మహబూబ్నగర్, జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, నారాయణపేట ఉన్నాయి. ఆయా జిల్లాల్లో సాధారణంతో పోలిస్తే 20 నుంచి 59 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జోగులాంబ గద్వాలలో 41 శాతం, నారాయణపేట, హనుమకొండ జిల్లాల్లో 35 శాతం చొప్పున, నల్గొండలో 34 శాతం లోటు నమోదైంది. హైదరాబాద్లోనూ సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. మేడ్చల్-మల్కాజిగి రిలో 33 శాతం లోటు నమోదైంది.

**ఆగస్టులోనే తీవ్ర ప్రభావం**

జూన్లో 12 శాతం లోటు ఉండగా.. జూలైలో పరిస్థితి కొంత మెరుగుపడి కేవలం ఒక శాతం లోటు నమోదైంది. అయితే ఆగస్టులో పరిస్థితి ఒక్కసారిగా దిగజారింది. ఆ నెలలో సాధారణం కంటే సుమారు 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్లోనూ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. తెలంగాణ వార్షిక వర్షపాతంలో దాదాపు 80 శాతం నైరుతి రుతుపవనాల కాలంలోనే నమోదవుతుంది. ఈ కాలంలో లోటు ఏర్పడటం వ్యవసాయంతో పాటు భూగర్భజలాలు, చెరువులు, సాగునీటి వనరులపై ప్రభావం చూపే అవకాశముంది.ఎల్నినో కారణంగా భారత్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే పరిస్థితి ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు ముందుగానే అంచనా వేశారు. అయితే పశ్చిమ పసిఫిక్, బంగాళాఖాతం, ఇతర వాతావరణ వ్యవస్థల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో రాష్ట్ర సగటు లోటు కొంత మేర తగ్గింది. అయినప్పటికీ పలు జిల్లాల్లో తగినంత వర్షాలు లేక వ్యవసాయ రంగం ఒత్తిడిని ఎదుర్కొంటోంది.

**235 మండలాల్లో కరువు పరిస్థితులు**

జిల్లాల కంటే మండల స్థాయిలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంటోంది. నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసే నాటికి సుమారు 235 మండలాలు తీవ్ర వర్షాభావం, కరువు తరహా పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కేవలం రాష్ట్ర సగటు వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మండలం, గ్రామం, పంటల వారీగా పరిస్థితిని పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం 27 మంది సభ్యులతో బహుళ రంగాల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో ఐఎండీ, ఇక్రిశాట్, ఐసీఏఆర్-క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలతో పాటు విత్తన, మార్కెటింగ్ తదితర సంస్థల నిపుణులు ఉన్నారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేసి వ్యవసాయం, అనుబంధ రంగాలకు రాష్ట్ర స్థాయి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం కమిటీ ప్రధాన ఉద్దేశం.

**కేంద్ర సాయంపై రాష్ట్రం ఆశలు**

వర్షాభావం, ఎల్నినో ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. కరువు ప్రభావిత మండలాలను గుర్తించి కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించింది. నష్టాన్ని అంచనా వేసేందుకు కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగా కేంద్రానికి సమగ్ర ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.అనంతరం మంత్రుల బృందం కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణ పరిస్థితిని వివరించి ఆర్థిక సాయం కోరనుంది. ఇప్పటికే జూలైలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్సింగ్ చౌహాన్ను కలిసి ఎల్నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధి కార్యక్రమాల్లో అదనపు పనులను చేర్చాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడితేనే వర్షాభావ ప్రభావాన్ని కొంతమేర నియంత్రించి రైతాంగాన్ని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కాపాడే అవకాశం ఉంటుంది.

**కరువు ప్రాంతాలుగా ప్రకటించి సహాయ చర్యలు చేపట్టాలి.**

వర్షాభావ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని లోటు వర్షపాతం నమోదైన ప్రాంతాలను శాస్త్రీయంగా గుర్తించి కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి. పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలి. సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి అన్నదాతకు అండగా నిలవాలి.

**అన్నదాతను ఆదుకోవాలి.**

వర్షాల కోసం ఎదురు చూసి పంటలు సాగు చేసిన రైతులు వర్షాభావంతో నష్టపోతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడులు పెట్టిన రైతులకు పంట నష్టం, రుణభారం, సాగునీటి కొరత వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతాంగానికి ఆర్థిక, వ్యవసాయ, ఉపాధి సహాయ చర్యలు చేపట్టాలి. కరువు ఛాయలు మరింత ముదరకముందే అన్నదాతను ఆదుకోవాలి.

# అవును.. విమానాన్ని కూల్చేయాలనుకున్నా

అంతర్యుద్ధ సమయంలో అతడు అక్కడే ఉన్నాడని..అప్పుడే అతడు ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై ఉంటాడని అధికా రులు అనుమానిస్తున్నారు. అతడి సోషల్ మీడియా లో వేల సంఖ్యలోఉగ్రవాద పోస్టులు, సందేశాలు ఉన్న ట్లు గుర్తించారు. విచారణ కొనసాగుతోందన్నారు.

# ప్రేయర్ చేసుకుంటానని వెళ్లి.. వెనుక నుంచి గొడ్డలితో నరికాడు

## ఫ్లైదుబాయ్ విమానం కాక్పిట్ ఘటనను వివరించిన స్మిత్ మచ్చర్

అబుదాబి(జనంసాక్షి):ఫ్లైదుబాయ్ విమానం కాక్పిట్లో భారత పైలట్ స్మిత్ మచ్చర్పై కో-పైలట్ దాడి చేసిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దాడికి సంబంధించి కెప్టెన్ మచ్చర్ కీలక విషయాలు వెల్లడించారు. విమానం నడుపుతున్న సమయంలో కో-పైలట్ ప్రార్థన చేసుకుంటానని చెప్పి తన వెనక్కి వెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత పైలట్లు ఇలా ప్రార్థనలు చేసుకోవడం సర్వసాధారణ విషయం కావడంతో తాను అడ్డు చెప్పలేదన్నారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే కాక్పిట్లో ఉండే గొడ్డలితో తనపై వెనక నుంచి దాడి జరిగినట్లు గుర్తు చేసుకొన్నారు. దీంతో వెంటనే తాను అప్రమత్తమై కాక్పిట్ తలుపులు తెరిచినట్లు వెల్లడించారు. కానీ, అతడు తనను అడ్డుకొని తలుపులు తిరిగి మూసివేశాడన్నారు. ఎలాగైనా ప్రయాణికులను కాపాడాలనే ఆలోచనతో బలం కూడదీసుకొని మరోసారి తలుపులు తెరిచి.. సాయం కోరడంతో ప్రయాణికులు లోపలికి వచ్చి అతడిని బంధించారన్నారు.

**విద్యార్థిగా రెండేళ్లు ఆస్ట్రేలియాలో..**

ఈ దాడిలో నిందితుడిగా భావిస్తున్న ఒమన్కు చెందిన హమామ్ అల్-హమ్మామీ (29)కు ఉగ్రవాద భావజాలం ఉన్నట్లు ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. ఫ్లైదుబాయ్లో చేరడానికి ముందు అతడు ఒమన్, సిరియా, మొరాకోల్లోనే కాకుండా ఆస్ట్రేలియా (ఒబీబబితీజీశ్రీతిజీ)లోనూ రెండేళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లి..2017వరకు అక్కడే ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో అతడు ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే విషయంపై ఆస్ట్రేలియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ సహా పలు ఏజెన్సీలు దర్యాప్తు చేపట్టాయి.

**హమామ్కు అల్ఖైదా మద్దతు**

మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్-ఖైదా కోపైలట్ హమామ్ అల్-హమ్మామీకి మద్దతుగా పలు పోస్టులు చేస్తోంది. 9/11 దాడులను ప్రస్తావిస్తూ అమెరికా, ఇజ్రాయెల్లకు చెందిన విమానాల్లో ఇటువంటి దాడులు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు దాని వారపత్రికలో కథనం ప్రచురించింది. అంతేకాకుండా ట్విన్ టవర్స్పై దాడి, ఫ్లైదుబాయ్ విమానానికి సంబంధించిన దృశ్యాలను సైతం దీనిలో ప్రచురించడం గమనార్హం.

# సింగీతానికి కన్నీటి వీడ్కోలు

అతీతమైన ప్రత్యేక బంధం ఏర్పడింది. మేమిద్దరం కలిసి మూడు అద్భుతమైన క్లాసిక్ చిత్రాలు చేశాం. భారతీయ సినిమాకే కొత్త ముద్ర వేసిన 'ఆదిత్య 369', తెలుగులో తొలి కంప్యూటర్ గ్రాఫిక్స్ చిత్రంగా చరిత్ర సృష్టించిన జానపద చిత్రం 'భైరవ ద్వీపం', పౌరాణిక చిత్రం 'శ్రీ కృష్ణార్జున విజయం'.. ఈ మూడూ ఎంతో ప్రత్యేకం. ఒకే దర్శకుడి సారథ్యంలో నేను చారిత్రక, జానపద, పౌరాణిక పాత్రలు పోషించాను. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను. తుదిశ్వాస విడిచే వరకూ ఆయన వివిధ భారతీయ భాషల్లో ప్రయోగాలు చేస్తూనే ఉన్నారు. చిత్ర పరిశ్రమకు ఆయన మరణం తీరని నష్టం. నందమూరి కుటుంబం తరపున ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని నందమూరి బాలకృష్ణ అన్నారు." సింగీతం శ్రీనివాసరావు మృతి పట్ల తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాను. ఆయన ఒక గొప్ప దార్శనికుడు. కొత్త ఆలోచనలను అన్వేషించడంలో ఆయనకున్న ధైర్యం, అద్భుతమైన ఊహాశక్తి.. భారతీయ సినిమాకు ఎన్నో చిరస్మరణీయమైన చిత్రాలను అందించాయి. సినీ రంగానికి ఆయన చేసిన విశేష కృషిని ఎప్పటికీ ఎంతో గౌరవంతో, ఆప్యాయతతో గుర్తుంచుకుంటాం. ఇటీవల ఆయన తెరకెక్కించిన 'సింగ్ గీతం' చిత్రం.. కథల పట్ల ఆయనకున్న అంతులేని తపనకు అద్భుతమైన నిదర్శనం. వయసు పైబడినా ఆయన మనసులో ఎప్పటికీ యువకుడే. కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఉత్సుకత, ఏదైనా సృష్టించాలనే ఉత్సాహం ఆయనలో ఎప్పుడూ ఉండేవి అని అన్నారు.

# కృత్రిమ మేధలో అధిపత్యం కోసం సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్

కృత్రిమ మేధలో అధిపత్యం కోసం 'సూపర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్' తీసుకున్నట్లయింది. ఈ ఒప్పందం కింద టెక్ కంపెనీలు తమంతట తామే ఐటీ భద్రతను సమీక్షించుకుంటాయి. ఈ రంగాన్ని 'సూపర్ ఇంటెలిజెన్స్' అని పిలవాలని ట్రంప్ పేర్కొన్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం..

## మహబూబాబాద్ జిల్లా వాసి మృతి

మరిపెడ(జనంసాక్షి):అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా వాసి మృతి చెందారు. మరిపెడ మండల కేంద్రానికి చెందిన వివాహిత దారం సుప్రియ(31) అమెరికాలోని మిస్సోరిలో ఉద్యోగ రీత్యా నివాసం ఉంటున్నారు. భారత కాలమానం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆమె ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి ట్రక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుప్రియ అక్కడికక్కడే మృతి చెందగా.. భారత్కు చెందిన మరో యువతికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. మృతురాలి భర్త కొదుమూరి రంజిత్, అత్తమామలు కొదుమూరి వెంకటేశ్వర్లు, రాధిక మహబూబాబాద్ పట్టణంలోని వీరభద్ర అపార్ట్మెంట్లో నివాసం ఉంటున్నారు.

# జంతర్ మంతర్ వద్ద మహిళా జర్నలిస్టులపై లైంగిక వేధింపులు

పోలీసులపై లైంగిక వేధిం పులు, దురుసు ప్రవర్తనకు సంబంధించి ఫిర్యాదులు చేశారు. పోలీసుల చర్యలను చిత్రీకరిస్తున్న సమయం లోనే తమపై అనుచితంగా ప్రవర్తించారని వారు ఆరో పించారు.ఒక జర్నలిస్టు ఫిర్యాదు ప్రకారం.. మహిళా ఆందోళనకారులను పురుష పోలీసు సిబ్బంది అదుపు లోకి తీసుకుంటున్న సమయంలో అక్కడ మహిళా పోలీసులు లేకపోవడాన్ని ఆమె ప్రశ్నించారు. ఈ విష యాన్ని ప్రశ్నించినందుకు ఓ సహాయ పోలీసు కమి షనర్ తనను నెట్టడంతో పాటు అనుచితంగా తాకా రని ఆమె ఆరోపించారు. మరో వీడియో జర్నలిస్టు తాను నిరసనను చిత్రీకరిస్తున్న సమయంలో వెనుక నుంచి ఓ పోలీసు అధికారి తనను అనుచితంగా తాకినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరోపణలు మరింత తీవ్ర రూపం దాల్చిన నేపథ్యంలో బాధిత జర్నలిస్టులు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జర్నలిస్టులు, కార్యకర్తలు అక్కడ నిరసనకు దిగారు. తొలుత కేసు నమోదుపై జాప్యం జరిగిందన్న ఆరోపణలు కూడా వచ్చాయి.తాజాగా ఢిల్లీ పోలీసులు ము గ్గు రు మహిళా జర్నలిస్టుల ఫిర్యాదులను స్వీకరించి నట్లు తెలిపారు. వారి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్కు అప్పగించారు. నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి ఫిర్యాదుదారులు, ప్రత్యక్ష సాక్షులు తదితరుల వాంగ్మూలాలను నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ వ్యవహారంపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు ఎలాంటి భయం, బెదిరింపులు లేకుండా పనిచేసే పరిస్థితిని పోలీసులు కల్పించాలని స్పష్టం చేసింది. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, వేధింపులు చోటుచేసుకుంటే అది కేవలం వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన మాత్రమే కాకుండా పత్రికా స్వేచ్ఛపైనే దెబ్బగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది.ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే. ప్రజలకు భద్రత కల్పించాల్సిన పోలీసులే మహిళా జర్నలిస్టులపై వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటే, బాధితులు న్యాయం కోసం ఎవరిని ఆశ్రయించాలి? నిరసనలను కవర్ చేస్తున్న పాత్రికేయురాలిపై చేయి చేసుకోవడం, అనుచితంగా తాకడం లేదా విధులను అడ్డుకోవడం ఏ రూపంలో జరిగినా ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమే.పోలీసులపై వచ్చిన ఆరోపణలపై పోలీసులే విచారణ జరిపితే నిష్పాక్షికతపై అనుమానాలు తలెత్తే అవకాశం ఉన్నందున క్రైమ్ బ్రాంచ్కు బదిలీ చేయడం సరైన చర్యే అయినా, దర్యాప్తు వేగంగా, పారదర్శకంగా సాగాలి. ఆరోపణలు నిజమైతే నిందితులు ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు నిలబెట్టాలి. ఆరోపణలు నిరాధారమైతే అదే విషయాన్ని ఆధారాలతో స్పష్టంగా వెల్లడించాలి. అదే న్యాయానికి, ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం.జర్నలిస్టుల కెమెరాలను ఆపవచ్చు.. కానీ నిజాన్ని ఆపలేరు. నిరసనలను అణచివేయవచ్చు.. కానీ ప్రజల ప్రశ్నలను శాశ్వతంగా మూయలేరు. విధులు నిర్వహిస్తున్న మహిళా జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించడం ఢిల్లీ పోలీసుల బాధ్యత. ఈ ఘటనపై నిజానిజాలను వెలికితీసి, బాధితులకు న్యాయం చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఢిల్లీ పోలీసులపైనే ఉంది.

## అమిత్ షా సమాధానం చెప్పాలి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శనివారం జరిగిన నిరసనల్లో మహిళా జర్నలిస్టుల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ విషయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.మహిళలను రక్షించాల్సిన పోలీసులే వారికి వ్యతిరేకంగా చేతులు ఎత్తుతున్నారని రాహుల్ ఆరోపించారు. కేవలం శనివారం ఒక్కరోజే వందలాది మంది నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అన్నారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు నమోదు చేయలేదని, అసలు ఈ ప్రభుత్వం ఎవరికి రక్షణ కల్పిస్తోందని రాహుల్ మండిపడ్డారు. ఈ విషయంపై అమిత్ షా సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మరోవైపు, లెఫ్ట్ వింగ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ కూడా ఇదే విధమైన ఫిర్యాదు చేసింది. "మహిళా నిరసనకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. పోలీసు సిబ్బంది తమను అసభ్యంగా తాకారని పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. మహిళలకు న్యాయం చేకూరుస్తామని చెప్పుకునే పోలీసు యంత్రాంగం, కనీసం జనసందోహాన్ని నియంత్రించే ప్రాథమిక విధానాలను కూడా పాటించలేకపోయింది. నిరసనలో పాల్గొన్న మహిళలను బహిరంగంగా దూషించడమే కాకుండా, వారి పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించారు" అని ఏఐఎస్ఏ ఒక

# అయోధ్య విరాళాల చోరీ కేసు..

వ్యవహరిస్తోందని విమర్శించింది. రామయ్య విరాళాల చోరీ కేసులో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ వంటి వారిని కాపాడుతోందని పేర్కొంది. జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ చేరిన తర్వాత, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో 21 రోజుల జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్లో పోస్ట్ పెట్టారు."ప్రతిపక్ష నాయకులపై ఈడీ, సీబీఐలను దుర్వినియోగం చేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం వెనుకాడదు. కానీ అయోధ్య రామమందిరంలో 105 సార్లు జరిగిన చోరీ ఘటనలు సీసీటీవీలో రికార్డైన తర్వాత కూడా దొంగలకు ఆశ్రయం కల్పించారని అనుమానిస్తున్న వారి వరకు దర్యాప్తు ఎందుకు వెళ్లలేదు?. 105సార్లు జరిగిన విరాళాల చోరీ నుంచి కేవలం రూ. 79.85 లక్షలు మాత్రమే స్వాధీనం చేసుకున్న తర్వాత కేసును మూసివేయడానికి ఎందుకంత తొందర?. శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, మాజీ ట్రస్టీ అనిల్ మిశ్రాలను ఎందుకు నిందితులుగా చేర్చలేదు. అందుకు బదులుగా వారిని సాక్షులుగా ఎలా చేర్చారు?. రామమందిర విరాళాల చోరీ విచారణ అసలు లక్ష్యం కేవలం చిన్న దొంగలను పట్టుకోవడమేనా? లేక ఎవరి పర్యవేక్షణ, అండతో ఈ చోరీలు జరిగాయో వారిని జవాబుదారీగా నిలబెట్టడమా?. అయోధ్య రామాలయ విరాళాల చోరీ దొంగల పట్ల మోదీ ప్రభుత్వం ఎందుకంత ఉదాసీనంగా ఉంది?. గుర్తుంచుకోండి, అధికార అహంకారం స్వయం వినాశనానికి దారితీస్తుంది"

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరపాలి : జైరాం రమేశ్**

రామమందిర విరాళాల చోరీ కేసును సుప్రీంకోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర, నిష్పక్షపాత, విశ్వసనీయమైన విచారణ జరపాలని కాంగ్రెస్ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోందని జైరాం రమేశ్ అన్నారు. "జూన్ 4న దొంగిలించిన సొమ్ముకు సంబంధించిన వీడియో చంపత్ రాయ్ దృష్టికి చేరింది. జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ 21 రోజుల జాప్యం వెనుక ఉన్న పూర్తి నిజాన్ని దేశం ముందు ఎందుకు బయటపెట్టలేదు?. 105సార్లు చోరీలు జరిగితే కేవలం 8 మంది నిందితులు మాత్రమే ఎలా ఉన్నారు? ఈ విచారణ అసలు లక్ష్యం కేవలం చిల్లర దొంగలను పట్టుకోవడమేనా?. కానుకల చోరీకి ఎవరు బాధ్యులో ఎప్పుడు నిర్ధరిస్తారు? కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంపై చిక్కుముడి వీడేది ఎప్పుడు?" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాగా, ఈ ఏడాది జూన్ నెలలో రామాలయంలో కానుకల చోరీ ఘటన బయటపడింది. అయితే, ఈ చోరీకి సంబంధించి సిట్ జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు బయటపడ్డాయి. ఒకట్రెండు సార్లు కాదు, ఏకంగా 105 సార్లు విరాళాల చోరీ జరిగినట్లు సిట్ తేల్చింది. అందుకు సంబంధించిన చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డైనట్లు గుర్తించింది. ఈ నేపథ్యంలో అయోధ్య రామమందిర విరాళాల చోరీ దర్యాప్తుపై మోదీ సర్కార్పై జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

ప్రాజెక్టులకు రెట్రోస్పెక్టివ్ (పాత తేదీల ఆధారంగా) పర్యావరణ అనుమతుల అంశంపై మోదీ ప్రభుత్వంపై జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. ఇది పర్యావరణాన్ని దెబ్బతీసే చర్య అని తెలిపారు. చట్టానికి అనుగుణంగా పెండింగ్లో ఉన్న, తిరస్కరించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనలను తార్కిక ముగింపునకు తీసుకువెళ్లడానికి సుప్రీంకోర్టు అనుమతించిన రెండు నెలల తర్వాత జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన నిబంధనలను పాలనా ఉత్తర్వులతో మార్చలేరని ఇటీవలే సుప్రీంకోర్టు తెలిపింది. పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రారంభించి, భారీ మొత్తాలను వెచ్చించిన ప్రాజెక్టులకు వెనుకటి తేదీలతో ఆ అనుమతులిచ్చేలా 2021లో కేంద్రం జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వు(ఆఫీస్ మెమోరాండం)ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ తీర్పు భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులు, నిర్మాణాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో జైరాం రమేశ్ స్పందించారు.

# అన్ని వేళలా భారత్కు అండగా రష్యా

పలు దేశాలు పాకిస్థాన్కు మద్దతు ఇచ్చినప్పుడు సోవియట్ రష్యా మాత్రం భారత్ వెన్నంటే నిలిచిందన్నారు. 1971లో దాయాదితో యుద్ధ సమయంలోనూ భారత్కు మాస్కో సాయం చేసిందన్నారు. అప్పట్లో పాక్కు మద్దతుగా అమెరికా నిలిచిన విషయాన్ని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా భారత్-రష్యా మధ్య సత్సంబంధాలు కొనసాగుతుండడాన్ని ఆయన ప్రస్తావించారు. మాస్కోతో దిల్లీ సంబంధాలపై పాశ్చాత్య దేశాలు ప్రశ్నలు లేవనెత్తుతున్న వేళ విదేశాంగ మంత్రి ఈ విధంగా స్పందించారు. అమెరికా తన విదేశాంగ విధానాలను క్రమంగా మార్చుకుంటోందని.. తన దేశీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యవహరిస్తోందని జైశంకర్ పేర్కొన్నారు. దానికి ప్రతిగా చైనా ఎదుగుతోందన్నారు. అమెరికా-చైనాల మధ్య తీవ్ర పోటీ ఉందన్న విషయం యావత్ ప్రపంచానికి తెలిసిందేనన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వర్ధమాన దేశాలు కూడా సొంత ప్రయోజనాలను గుర్తించి, తమ వ్యూహాత్మక భాగస్వాములను పెంచుకుంటున్నాయన్నారు. ప్రస్తుత ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా మారుతున్న తీరు, చైనా ఎదుగుదలే అంతర్జాతీయ స్థితిగతులను ప్రభావితం చేస్తున్న రెండు ప్రధాన అంశాలు అని స్పష్టం చేశారు. ఈ మేరకు జర్మనీలో జరిగిన మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్లో విదేశాంగ మంత్రి విశ్లేషించారు. ప్రస్తుత అంతర్జాతీయ వ్యవస్థలో స్పష్టంగా కనిపిస్తున్న మొదటి మార్పు అమెరికా తన స్థానాన్ని, వ్యూహాన్ని మార్చుకోవడమే. ఆ దేశం ఇటీవల తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అది స్వచ్ఛందంగా, కావాలనే ఒక ఒంటరి శక్తిగా మారుతోందని వ్యాఖ్యానించారు. ఇక్కడ అమెరికా విషయంలో రాడికల్ రీపొజిషనింగ్ అనే పదం ఉపయోగించారు. రాడికల్ రీపొజిషనింగ్ అంటే ఏదైనా



సంస్థ లేదా దేశం తన పాత ఇమేజ్, వ్యూహాలను పూర్తిగా మార్చేసి కొత్త విధానాన్ని ఎంచుకోవడం. ఇక్కడ అమెరికా విషయంలో తన పాత విదేశాంగ విధానాలను, వ్యూహాల్ని పూర్తిగా మార్చుకుంటోందని జైశంకర్ స్పష్టం చేశారు. ఇది పరిస్థితుల వల్లే వచ్చిన మార్పు కాదని, విధానపరంగా తీసుకున్న నిర్ణయం అని చెప్పుకొచ్చారు. ప్రతి విషయంలోనూ తానే ప్రపంచానికి పెద్దన్నలా ఉంటూ అందరికీ సాయం చేసే పాత పద్ధతిని పక్కనబెట్టి తన ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణివైపు అమెరికా మారిందనే అర్థం వచ్చేలా జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.ఇక రెండో అంశం చైనా గురించి. చైనా తనను తాను అంతర్జాతీయంగా ఒక ప్రత్యేకమైన, విశిష్టమైన శక్తిగా భావిస్తోందని జైశంకర్ వ్యాఖ్యానించారు. చైనా ఎదుగుదల అంతర్జాతీయ వ్యవస్థను మరింత ప్రభావితం చేస్తోందన్నారు. చైనా ఆర్థిక, రాజకీయ సామర్థ్యాలు కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని అన్నారు. ఈ క్రమంలోనే అమెరికా- చైనా మధ్య ప్రస్తుతం తీవ్రమైన పోటీ నెలకొందని జైశంకర్ పేర్కొన్నారు. అయితే ప్రపంచంలో పోటీ కేవలం రెండు అగ్రదేశాలకే పరిమితం కాలేదని, ఈ కారణంగానే ప్రతి దేశం తమ వద్ద ఉన్న శక్తులు లేదా అవకాశాల్ని ఆయుధంగా మలుచుకునే ప్రమాదకర పరిస్థితులకు దారితీసిందని హెచ్చరించారు. ఇలా దీనిని ఇతరులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు దేశాల మధ్య పరస్పర ప్రయోజనాల కోసం సంబంధాలు కొనసాగుతున్నా, మరోవైపు అవసరమైన చోట తమ బలాలనే అస్త్రాలు ప్రయోగిస్తున్నాయని జైశంకర్ తెలిపారు.

# చిరుత దాడిలో గెదే దూడ మృత్యువాత



**కామారెడ్డి (జనంసాక్షి) :** పిట్లం మండలం చిల్లర్గి గ్రామ శివారులో శనివారం రాత్రి చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు పాశం సుధాకర్‌కు చెందిన గేదె దూడపై చిరుత దాడి చేయడంతో అది మృతి చెందింది. దీంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చిల్లర్గి అటవీ బీట్ అధికారి (ఎఫ్‌బీఓ) ప్రభు ప్రసన్న కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనను పరిశీలించారు. మృతి చెందిన గేదె దూడను పరిశీలించి పంచనామా నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ హైమద్ కూడా సంఘటనా స్థలానికి చేరుకుని దూడ మృతికి గల కారణాలను పరిశీలించారు. చిరుత సంచారం నేపథ్యంలో గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌బీఓ ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పశువులను రాత్రివేళల్లో బయట ఉంచకుండా సురక్షిత ప్రదేశాల్లో కట్టివేయాలని సూచించారు. చిరుత కనిపించినప్పుడు దాని దగ్గరకు వెళ్లడం, దాన్ని తరిమే ప్రయత్నం చేయడం వంటివి చేయకూడదని అటవీశాఖ అధికారులు సూచించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. చిరుత కదలికలను గుర్తించేందుకు పరిసర ప్రాంతాల్లో నిఘా పెంచుతున్నామని తెలిపారు. గ్రామస్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చిరుత సంచారానికి సంబంధించిన సమాచారం అందిన వెంటనే అటవీశాఖకు తెలియజేయాలని ప్రభు ప్రసన్న కుమార్ సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# ములుగులోని రోడ్డు రవాణా సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్



**ఏటూరునాగారం, అక్టోబరు 04(జనంసాక్షి) :** ములుగు జిల్లాలోని సుదూర ఏజెన్సీ గ్రామాలు,మారుమూల ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందిని పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు.. ఆదివారం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ హైదరాబాద్ లో రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లాలో దీర్ఘకాలంగా నెలకొన్న రోడ్డు రవాణా శాఖ సమస్యలను వివరిస్తూ ఒక ప్రత్యేక వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పలు ఏజెన్సీ మండలాల్లో రవాణా సౌకర్యం లేక ప్రజలు పడుతున్న పాట్లను, నిలిచిపోయిన పాత బస్సు సర్వీసులు పునరుద్ధరణ అవసరాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి శ్రీనివాస్ యాదవ్ తీసుకెళ్లారు. వినతిపత్రం పరిశీలించిన మంత్రి ప్రభాకర్ అత్యంత సానుకూలంగా స్పందించారు. జిల్లాలోని ప్రతి రవాణా సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# అండర్‌పాస్ కోసం గ్రామస్తుల నిరసన



**శంకరపట్నం (జనంసాక్షి) :** జాతీయ రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తి కావడంతో ఓవైపు ట్రయల్ రన్ కొనసాగుతుండగా మరోవైపు కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామప్రజలు అండర్ పాస్ కోసం రోడ్డు ఎక్కారు. జాతీయ రహదారి విస్తరణతో తమ గ్రామం రెండుగా చీలిపోయిందని గ్రామానికి ఒకవైపు నుంచి మరొకవైపునకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ క్రమంలో ఆదివారం శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలోని టోల్ గేటు వద్ద పెద్ద సంఖ్యలో ఆ గ్రామస్తులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జాతీయ రహదారి 563 విస్తరణ పనుల వల్ల తమ గ్రామానికి అనేక ఇబ్బందులు ఏర్పడ్డాయని అన్నారు. ముఖ్యంగా అండర్ పాస్ లేకపోవడంతో రైతులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రోడ్డు దాటే క్రమంలో ఇప్పటికే పలువురు గ్రామస్తులు మృత్యువాత పడినట్లు తెలిపారు. మరోవైపు మురుగునీటి కాలువలు దిగువన ఉండడం, రోడ్డు పైకి ఉండడంతో గ్రామంలోని మురుగు నీరు బయటికి వెళ్ళక ఇండ్లలోకి చేరుతుందన్నారు. ఈ సమస్యల పై పలుమార్లు జాతీయ రహదారి విస్తరణ అధికారులకు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదని అన్నారు. గత్యంతరం లేక రోడ్డెక్కి నిరసన చేపట్టాల్సిన పరిస్థితికి ఏర్పడిందన్నారు. నిరసన ప్రాంతానికి చేరుకున్న,హుజురాబాద్ రూరల్ సీఐ వీరభత్తిని శ్రీనివాస్, ఎస్సై శేఖర్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం అనడంతో నిరసనను విరమించారు.

# ఎమ్మెల్సీగా పోటీకి అవకాశమివ్వండి

- హరీష్‌ను కలిసిన బచ్చు శ్రీనివాస్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ నాయకులు బచ్చు శ్రీనివాస్ మహబూబ్‌నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం పార్టీ నాయకులు మాజీ మంత్రివర్యులు శాసనసభ ఉప నాయకులు తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. తాను తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం నుండి మండల స్థాయిలో తొలి మండల ప్రధానకార్యదర్శిగా, జిల్లా స్థాయిలో యువజన ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షునిగా మరియు తెలంగాణ జాగృతి తొలి రాష్ట్ర కార్యదర్శిగా పని చేశాను. తెలంగాణ ఏర్పడిన తర్వాత వివిధ మాధ్యమాలలో పార్టీ పక్షాన ప్రత్యక్ష చర్చ కార్యక్రమంలో వివిధ ఛానళ్లలో దశాబ్ద కాలం పైగా పాల్గొనడమే కాకుండా, పార్టీ పక్షాన పార్టీ అభివృద్ధికి సంక్షేమానికి సంబంధించి అనేక వ్యాసాలు వివిధ పత్రికల్లో కూడా రాసినటువంటి సందర్భాన్ని గుర్తు చేశారు. తన నిబద్ధత అంకితభావము పార్టీ పట్ల ఉన్నటువంటి విధేయతను గుర్తించి తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. తను స్వతహాగా రంగారెడ్డి జిల్లా వాసిని, హైదరాబాదులో ఉంటున్నాని, మహబూబ్‌నగర్ అత్తగారు, మూడు జిల్లాల్లో మంచి పట్టు పరిచయాలు ఉన్నాయని, కావున పార్టీ అవకాశం ఇస్తే గ్రాడ్యుయేట్లను అందరిని కలుపుకొని పోయి గెలిచి వాళ్ళ గొంతుక అవుతానని తెలియజేశారు. దీని పట్ల హరీష్ రావు సానుకూలంగా స్పందించారు.

# పది లక్షల విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం కరువు

- బీసీ కోటాలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఇవ్వాలి
- వృత్తుల విభజనతో జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారు
- ప్రెస్‌క్లబ్ రౌండ్‌టేబుల్ సమావేశంలో విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో పది లక్షలకు పైగా జనాభా కలిగిన విశ్వకర్మ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం అన్యాయమని విశ్వకర్మ జేఏసీ చైర్మన్ దేవరకొండ కాళిదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయ వృత్తుల ఆధారంగా విశ్వకర్మలను విభజించి చూపడం వల్ల వారి వాస్తవ జనాభా తక్కువగా కనిపిస్తోందని అన్నారు. బీసీ కోటాలో గవర్నర్ కోటా కింద విశ్వకర్మలకు ఎమ్మెల్సీ పదవి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విశ్వకర్మ జేఏసీ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశ్వకర్మలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదని కాళిదాసు పేర్కొన్నారు. కులవృత్తుల ఆధారంగా విశ్వకర్మలను వేర్వేరు వర్గాలుగా పరిగణించడం వల్ల సమష్టి జనాభా, సామాజిక బలం తెరమరుగవుతున్నాయని అన్నారు. విశ్వకర్మలందరినీ ఒకే సామాజిక సమూహంగా గుర్తించి వారి జనాభా, సమస్యలు, హక్కులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. పది లక్షలకు పైగా జనాభా ఉన్న సామాజిక వర్గానికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచించాల్సిన అంశమని పేర్కొన్నారు. జనాభా ఉన్నప్పటికీ రాజకీయ నిర్ణయాల్లో భాగస్వామ్యం కల్పించకపోతే ఆ వర్గ సమస్యలు ప్రభుత్వాల దృష్టికి ఎలా వస్తాయని ప్రశ్నించారు. బీసీ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల్లో విశ్వకర్మలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యంగా గవర్నర్ కోటా కింద బీసీ సామాజిక వర్గానికి కేటాయించే ఎమ్మెల్సీ పదవుల్లో విశ్వకర్మలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతి కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందని కాళిదాస్ పిలుపునిచ్చారు. వృత్తుల ఆధారంగా విడిపోయిన వారంతా సంఘటితమై తమ హక్కుల సాధనకు ముందుకు రావాలని సూచించారు. అందులో భాగంగా నవంబర్ 14న జేఏసీ ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించారు. ఎన్నికల్లో విశ్వకర్మ కులానికి చెందిన ఐటీ, డాక్టర్స్, జర్నలిస్ట్,వివిధ రంగాల పెద్దలు, అధికారులను భాగస్వామ్యం చేస్తామని ఆయన పేర్కొన్నారు. విశ్వకర్మలకు రాజకీయ ప్రాతినిధ్యం, బీసీ కోటాలో సముచిత వాటా సంప్రదాయ వృత్తుల పరిరక్షణ తదితర అంశాలపై తమ అభిప్రాయాలను పలువురు వెల్లడించారు. విశ్వకర్మల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యంగా కృషి చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. కార్యక్రమం లో విశ్వకర్మ జేఏసీ నాయకులు రవీంద్రాచారి, డాక్టర్ శ్యాం సుందర్ విరశేఖర చారీ లతో పాటు పెద్ద సంఖ్యలో విశ్వకర్మ లు పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్ట్‌పై ఏసీపీ లైంగిక వేధింపులు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** జంతర్‌మంతర్‌లో సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామాకు సంబంధించిన నిరసనను కవర్ చేస్తుండగా ఎసిపి వివేక్ బాఘట్ తనను లైంగికంగా వేధించారని ఒక మహిళా జర్నలిస్ట్ వెల్లడించారు. శనివారం జరిగిన ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ.. కేసు నమోదు చేయలేదని అన్నారు. 'ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్ఎ)' అధ్యక్షురాలు నేహాబోరాను అదుపులోకి తీసుకోవడాన్ని కవర్ చేస్తుండగా ఈ ఘటన జరిగిందని అన్నారు. ఎసిపి వివేక్ భగత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి తాను పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన ఒక వీడియోలో ఆమె పేర్కొన్నారు. సుమారు మూడు గంటల పాటు పోలీస్ స్టేషన్ బయట వేచిఉన్నానని తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరించారని, దానికి బదులుగా కేసు నమోదు చేసే ముందు ప్రాథమిక విచారణ జరిపి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాలని కోరుకుంటున్నారని మహిళా జర్నలిస్ట్ తెలిపారు ఆ వీడియోలో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌ల నమోదుకు సంబంధించి లలితా కుమారి తీర్పులో సుప్రీంకోర్టు నిర్దేశించిన నిబంధనలకు ఈ విధానం అనుగుణంగా ఉందా అని ఆమె ప్రశ్నించారు. ఫిర్యాదు నమోదు చేయడానికి బదులుగా, ఢిల్లీ పోలీసులు ఆ ఎసిపిని కాపాడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్వతంత్ర జర్నలిస్టుల బృందం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టింది. ఎసిపిపై చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసింది. ఢిల్లీ పోలీసులు ఆమెను వైద్య పరీక్షల కోసం ఆర్ఎంఎల్ ఆస్పత్రికి తీసుకువెళ్లారని 'కాక్రోచ్ జనతా పార్టీ'కి చెందిన న్యాయ వ్యవహారాల విభాగం అధిపతి రత్న సింగ్ తెలిపారు. అనంతరం ఆమెను తిరిగి పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలను ధృవీకరించేందుకు ఎటువంటి ఆధారాలు లేనందున, ఎటువంటి కేసు నమోదు చేయలేదని ఢిల్లీ పోలీస్ అధికారి తెలిపారు. కేసు నమోదు చేయడానికి ముందు ఆ ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నామని అన్నారు.

# తెలంగాణలో శ్వేత విప్లవం

- తూప్రాన్ డెయిరీ ప్లాంట్ నాంది
- రూ.400 కోట్లతో అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్..
- 18 నెలల్లో నిర్మాణం పూర్తి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి




**తూప్రాన్ అక్టోబర్ 4(జనం సాక్షి):** సహకార వ్యవస్థతోనే రైతుల ఆర్థిక అభివృద్ధి, అభ్యున్నతి సాధ్యమని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణలో శ్వేత విప్లవం 2.0ను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో ఐదు లక్షల లీటర్ల పాల సామర్థ్యంతో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేయనున్న అమూల్ అత్యాధునిక డెయిరీ ప్లాంట్‌కు భూమిపూజ చేసిన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు .ఈ ప్లాంట్ కేవలం పారిశ్రామిక ప్రాజెక్టు మాత్రమే కాదని, తెలంగాణ పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాబోయే 18 నెలల్లో ప్లాంట్ నిర్మాణం పూర్తిచేసి, స్థానిక మహిళలు, యువతకు ఉపాధి కల్పించడంతోపాటు పాడి రైతులకు అదనపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యమన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన పాలకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం, నిల్వ, ప్రాసెసింగ్, బ్రాండింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారని అన్నారు. తూప్రాన్ డెయిరీ ద్వారా పరిసర ప్రాంతాల రైతుల నుంచి పాలు సేకరించి ఇక్కడే ప్రాసెసింగ్ చేయడంతోపాటు పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీ, పన్నీర్, ఐస్‌క్రీమ్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల పాలకు విలువ జోడింపుతో రైతులకు మెరుగైన ధర లభించడంతోపాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వ్యవసాయం అంటే వరి, పత్తి, మిర్చి పంటలే కాకుండా భూమి ఉన్నా లేకపోయినా పశుపోషణ ద్వారా జీవనోపాధి పొందవచ్చన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పాడి పరిశ్రమ అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొన్నారు. రైతులంతా విడివిడిగా కాకుండా సహకార సంఘాలుగా ఏర్పడి సమష్టిగా పనిచేస్తే బలమైన ఆర్థిక శక్తిగా ఎదగవచ్చని కిషన్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అవి నిర్వీర్యమయ్యాయని, వాటిని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులే సహకార వ్యవస్థలో భాగస్వాములైతే దళారుల దోపిడీ, అవినీతి, రాజకీయ నాయకుల పెత్తనం తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. సహకార సంఘాల ద్వారా వచ్చే ఆదాయం గ్రామాల్లోనే వినియోగమై స్థానిక ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని వివరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో సహకార రంగం కీలక స్తంభంగా నిలవాలన్నదే లక్ష్యమని తెలిపారు. శ్వేత విప్లవం 2.0 ద్వారా రైతులకు అదనపు ఆదాయం, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన, గ్రామాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పాడి రైతులు సహకార ఉద్యమంలో భాగస్వాములై రాష్ట్రాన్ని శ్వేత విప్లవంలో ముందంజలో నిలపాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ. ఈ ప్లాంట్ వల్ల సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం కింద నాణ్యమైన పాలు పాఠశాల విద్యార్థులకు అందచేయవచ్చని, రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి నాణ్యమైన పాలు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అందిస్తున్న వివరించారు . మెట్రో కార్యక్రమాల్లో కేంద్రం నుంచి శాఖ సహాయ సహకారాలు అందించాలని మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. అమూల్ ప్లాంటును చెన్నూరులో ఏర్పాటు చేయాలని , చెన్నూరు పరిసర ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలో కూడా మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. ఐటి శాఖామంత్రి దుద్దెల శ్రీధర్ బాబు మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాల వెన్నెముక పాల డైరీ అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అనేక పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. అమూల్ ప్లాంట్ ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలతో పాటు గ్రామీణ రైతుల ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ విభిన్న సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపం మెదక్ జిల్లా అన్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితులు మారుతున్న కాలానికి అనుగుణంగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో రైతన్నలకు కష్టం కావద్దని నేను పుట్టిన ఈ గడ్డలో రైతన్నలకు గల్లి నుంచి ఢిల్లీ దాకా రైతులకు ఏదో చేయాలని దృఢ సంకల్పంతో ఢిల్లీలో అమూల్ ప్రతినిధులను సంప్రదించామని తెలిపారు.

మెతుకు సీమలో రైతులు బాగుండాలని, రైతులకు అదనపు ఆదాయం చేకూరాలని ఆమూలు కంపెనీ ప్రతినిధులను అమిత్ షా గారిని కలిసిన సందర్భంలో ఆముల్ ఇండస్ట్రీ తూప్రాన్ లో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రుల కిషన్ రెడ్డి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వి వెంకటస్వామి శ్రీధర్ బాబు లతోపాటు ఇతర మంత్రుల సహాయ సహకారాలు ఎంతో తోడ్పాటుఅందించారని తెలిపారు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను మెదక్ జిల్లాకు పరిచయం చేయాలని తూప్రాన్ లో అముల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యవసాయం చేస్తున్న రైతన్న తన దినసరి ఖర్చులకు ఎవరి మీద ఆధారపడకుండా పాడి పరిశ్రమను నమ్ముకున్నట్లయితే తప్పనిసరిగా దినదినాభివృద్ధి చెందవచ్చు అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాబర్ డైరీ చైర్మన్ శ్యామ్ లాల్ జి పటేల్, రుతురాజ్ పటేల్ ,జయంతి భాయ్ పటేల్ , గీత భాయ్ పటేల్ ,కాంతి భాయ్ ,భోగి బాయ్ పటేల్ ఈతల్ కుమార్ రాంబాయి పటేల్ అశ్విని కుమార్ పటేల్ సచిన్ కుమార్, సుందర్మోహన్, అశోక్ భాయ్ చౌదరి, చామలా బాయ్ పటేల్ ,జితిన్ భాయ్ పటేల్ ,కోపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ కీర్తన విట్టల్ రెడ్డి బిజెపి మెదక్ పార్లమెంట్ ఇన్చార్జి రామ్మోహన్ గౌడ్ పట్టణ అధ్యక్షులు జానకిరామ్ గౌడ్ ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# వైద్యం వికటించి రైతు మృతి

- ఆస్పత్రి నిర్వాహకుడిపై కుటుంబ సభ్యుల ఆరోపణలు.!





**కాటారం అక్టోబర్ 4 (జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి కాటారం మండలం జాతరవ్ పేట గ్రామపంచాయతీ చెందిన యువరైతు వ్యవసాయ పనుల్లో భాగంగా పత్తి పంటకు పురుగుమందు పిచికారీ చేసి ఇంటికి చేరుకున్న రైతు అస్వస్థతకు గురై చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి ఆస్పత్రి నిర్వాహకుడి వైద్య విధానంపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కాటారం మండలం జాదరావుపేట గ్రామపంచాయతీ పరిధికి చెందిన ఆత్మకూర్ కుమార్ యాదవ్ (40) వ్యవసాయ పనుల నిమిత్తం పత్తి పంటకు పురుగుమందు పిచికారీ చేసిన అనంతరం ఇంటికి చేరుకున్నాడు. అనంతరం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు గారేపల్లి కూడలిలోని బాలాజీ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆస్పత్రిలో చికిత్స ప్రారంభించిన నిర్వాహకుడు గ్లూకోజ్ ఎక్కించడంతో పాటు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే కుమార్ యాదవ్‌కు తీవ్ర అస్వస్థత ఏర్పడి, గిర్రున తిరిగి కిందపడిపోయి ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపిస్తున్నారు. సరైన వైద్య చికిత్స అందకపోవడం వల్లే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటన అనంతరం కుటుంబ సభ్యులు న్యాయం కోసం డిమాండ్ చేయడంతో ఇరువర్గాల మధ్య చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. చెల్లింపునకు సంబంధించిన పూర్తి వివరాలు, ఒప్పందం లేదా అధికారిక ధ్రువీకరణపై స్పష్టత రావాల్సి ఉంది.

### వైద్య సేవలపై ప్రజల్లో ఆందోళన

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల పేరుతో సరైన అర్హతలు, అత్యవసర వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ లేకుండా హాస్పిటల్ వివాహకులు నడిపిస్తున్నట్లు ప్రజల ఆరోపిస్తున్నారు.

# తాగి వచ్చి ఎమ్మెల్యేపై దాడికి యత్నం!



**గుహవాటి (జనంసాక్షి) :** ఓ ట్రక్ డ్రైవర్ తప్పతాగి వీరంగం సృష్టించాడు. ఏకంగా ఎమ్మెల్యే కార్యాలయం ముందే ఓ వాహనాన్ని ట్రక్కుతో ఢీకొట్టాడు. ఇదేంటని ప్రశ్నించిన స్థానికులపై తిరగబడ్డాడు. ఆఖరికి ఎమ్మెల్యే మాట్లాడే ప్రయత్నం చేసినా అతడిపై కూడా దాడికి యత్నించాడు. లారీలో నుంచి కత్తితీసి దాడి చేయబోయాడు. అస్సాంలోని సోనిట్‌పూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అస్సాంలోని సోనిట్‌పూర్‌లో శనివారం మద్యం మత్తులో ఉన్న ఓ ట్రక్ డ్రైవర్ బీజేపీ ఎమ్మెల్యేపై కార్యాలయం ముందు పార్క్‌చేసి ఉన్న ఓ వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ఇదేంటని అక్కడే బీజేపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే ప్రశ్నించగా వారిపై తిరగబడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బర్చల్లా నియోజకవర్గ ఎమ్మెల్యే రితు బరన్ శర్మ కార్యాలయం ముందర ఈ ఘటన జరిగింది. రితు బరన్ శర్మ తన కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో కూర్చుని మాట్లాడుతుండగా గేటు ముందు ఓ కార్యకర్తకు చెందిన వాహనాన్ని ట్రక్‌డ్రైవర్ ఢీకొట్టాడు. దాంతో వారు బయటికి వచ్చి ట్రక్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. దాంతో డ్రైవర్ వాళ్లపై తిరగబడ్డాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కూడా జోక్యం చేసుకుని డ్రైవర్‌కు సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. దాంతో మరింత రెచ్చిపోయిన ట్రక్ డ్రైవర్ తన లారీలో నుంచి కత్తిని బయటికి తీసి ఎమ్మెల్యేపై దాడికి యత్నించాడు. కార్యకర్తలు అడ్డుకుంటున్నా ఆ డ్రైవర్ వారిని తోసుకుంటూ ఎమ్మెల్యేపై దాడికి ప్రయత్నించాడు. దాంతో స్థానికులు, కార్యకర్తలు కలిసి ఆ డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో ఎమ్మెల్యే శర్మకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ ఒక హోమ్ గార్డుకు, ఇద్దరు పార్టీ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి.

# రక్షకులా.. భక్షకులా?

సంపాదకీయం

జంతర్ మంతర్ మరోసారి పోలీసు దౌర్జన్యానికి సాక్షిగా నిలిచింది. ప్రజల భద్రతకు కాపలా కాయాల్సిన వ్యవస్థే, విధి నిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టుల పట్ల అనుచితంగా ప్రవర్తించిందన్న ఆరోపణలు దేశ రాజధానిని కుదిపేస్తున్నాయి. అక్టోబర్ 3న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ జరిగిన నిరసనను కవర్ చేయడానికి వెళ్లిన ముగ్గురు మహిళా జర్నలిస్టులు, తమపై లైంగిక వేధింపులు, దురుసు ప్రవర్తన జరిగాయంటూ ఫిర్యాదు చేశారు. పోలీసుల చర్యలను చిత్రీకరిస్తున్న సమయంలోనే ఇది జరిగిందని వారు ఆరోపించారు.

మహిళా ఆందోళనకారులను మహిళా పోలీసులు లేకుండానే పురుష సిబ్బంది అదుపులోకి తీసుకోవడాన్ని ఒక జర్నలిస్టు ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన ఓ సహాయ పోలీసు కమిషనర్ స్థాయి అధికారి, ఆమెను నెట్టడమే కాకుండా ఛాతీపై చేయి వేసి దురుసుగా ప్రవర్తించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో వీడియో జర్నలిస్టు, వెనుక నుంచి ఓ పోలీసు అధికారి తనను అనుచితంగా తాకారని ఆరోపించారు. ప్రశ్నించడం నేరమైపోయిన చోట, ప్రశ్నించిన మహిళకు ఎదురైన సమాధానం ఇదేనా అన్న ఆవేదన సహజమే.

ఇది ఒంటరి ఘటన కాదన్న అనుమానం కలగడానికి కారణాలు న్నాయి. గతంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ విద్యార్థులు ఇదే జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేసినప్పుడు కూడా పోలీసుల ప్రవర్తన దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించింది. మహిళా ఆందోళనకా రులను పురుష పోలీసులు వెనుక నుంచి ప్రైవేట్ పార్ట్స్ పట్టుకుని తోయడం అత్యంత అమానవీయం, హేయమైన చర్య అన్న విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. అదే తీరు మళ్లీ పునరావృతమవుతోందంటే, అది వ్యక్తుల తప్పిదమా లేక వ్యవస్థాగత లోపమా అన్న ప్రశ్న తప్పక తలెత్తుతుంది.

బాధిత జర్నలిస్టులు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద నిరసనకు దిగాక గానీ కేసు కదల్లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఢిల్లీ పోలీసులు ఫిర్యాదులను స్వీకరించి, వైద్య పరీక్షల అనంతరం దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. ఫిర్యాదుదారులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేస్తామని చెబుతున్నారు. పోలీసులపై ఆరోపణలను పోలీసులే విచారించే పరిస్థితిలో ఈ బదిలీ అవసరమే. కానీ అది కంటి తుడుపు చర్యగా మిగిలిపోకూడదు. ఆరోపణలు నిజమైతే నిందితుడు ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు నిలబడాలి. నిరాధారమైతే ఆ విషయం ఆధారాలతో బహిరంగంగా చెప్పాలి.

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సరిగ్గానే స్పందించింది. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, వేధింపులు కేవలం వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన కాదని, పత్రికా స్వేచ్ఛపై దెబ్బ అని స్పష్టం చేసింది. భయం, బెదిరింపులు లేకుండా పనిచేసే వాతావరణాన్ని పోలీసులు కల్పించాలని సూచించింది.

అసలు పోలీసు వ్యవస్థను ఏర్పాటు చేసిన ఉద్దేశం ఏమిటి? పౌరులను కాపాడటం, శాంతిభద్రతలను నిలబెట్టడం, బలహీనులకు అండగా ఉండటం. ఆ వ్యవస్థపైనే “ఇది రక్షణకా, భక్షణకా” అన్న ప్రశ్న తలెత్తడం దురదృష్టకరం. కెమెరాలను అడ్డుకోవచ్చు, నిరసనలను అణచివేయవచ్చు, కానీ నిజాన్ని, ప్రజల ప్రశ్నలను శాశ్వతంగా ఆపలేరు. బాధితులకు న్యాయం చేయడం, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవడం ఇప్పుడు ఢిల్లీ పోలీసుల ముందున్న పరీక్ష.

# సంస్థ నుంచి వ్యక్తి వైపు ప్రయాణమా?

*ఒక రాజకీయ పార్టీ చరిత్రను ఒకే నాయకుడి విజయగాథగా రాయవచ్చా? ఒక సంస్థను నిర్మించడానికి దశాబ్దాల పాటు శ్రమించిన వేలాది మంది కార్యకర్తలు, నాయకులు, సిద్ధాంతకర్తల పాత్ర క్రమంగా ఒక వ్యక్తి ప్రజాదరణలో కలిసిపోవచ్చా? ఒక పార్టీ సిద్ధాంతం కంటే నాయకుడి పేరు, పార్టీ గుర్తు కంటే నాయకుడి ముఖచిత్రం, ప్రభుత్వ విధానాల కంటే నాయకుడి వ్యక్తిగత హామీ ఎక్కువగా కనిపించడం ప్రారంభిస్తే, దానిని సంస్థాగత రాజకీయాల పరిణామంగా చూడాలా, లేక వ్యక్తి-కేంద్రీకృత రాజకీయాల పెరుగు దలగా చూడాలా? ఈ సైద్ధాంతిక చర్చను 'వ్యక్తి-సంస్థ' ప్రశ్నను బీజేపీ-ఆరెస్సెస్ రాజకీయ సంస్కృతికి అన్వయిస్తే ఈ ప్రశ్నలు మరింత ప్రాసంగికంగా మారతాయి.*




బీజేపీ తన సిద్ధాంత పత్రాల్లో 'ఏకాత్మ మానవతావాదం'ను తన సామాజిక తాత్విక పునాదిగా పేర్కొంటుంది. సమాజం-వ్యక్తి మధ్య విరోధం ఉండకూడదని, సమానత్వం, వ్యక్తి గౌరవం, సామాజిక సమగ్రత వంటి విలువలకు కట్టుబడి ఉంటామని పార్టీ పత్రాలు చెబుతున్నాయి. పార్టీ సభ్యత్వ ప్రమాణాల్లో ప్రజాస్వామ్యం, జాతీయ సమైక్యత, విలువల ఆధారిత రాజకీయాలు, పార్టీ రాజ్యాంగం-క్రమశిక్షణకు విధేయత వంటి అంశాలూ ఉన్నాయి.

అయితే ఒక పార్టీ యొక్క అసలు రాజకీయ సంస్కృతి కేవలం దాని పత్రాల్లో కనిపించదు. సంస్థలో నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు? నాయకత్వం ఎంతవరకు సమిష్టిగా ఉంది? కార్యకర్తలకు ఎంత స్వతంత్ర రాజకీయ పాత్ర ఉంది? గత నాయకుల వారసత్వాన్ని ఎలా గుర్తిస్తున్నారు? ప్రభుత్వ విధానాలను ఎవరి పేరుతో ప్రజలకు చేరుస్తున్నారు? నాయకుడిని విమర్శించే స్థలం పార్టీలో ఎంత ఉంది? ఈ ప్రశ్నలకు ఆచరణలో లభించే సమాధానాలే సంస్థాగత స్వభావాన్ని వెల్లడిస్తాయి.

జనసంఘ్ నుంచి జనతా పార్టీ, ఆ తర్వాత 1980లో బీజేపీ ఏర్పడిన దశ వరకు భారతీయ రైట్ వింగ్ రాజకీయాలకు సమిష్టి నాయకత్వం, కేడర్ నిర్మాణం, సిద్ధాంతపరమైన శిక్షణ ముఖ్యమైన లక్షణాలుగా నిలిచాయి. వాజపేయి-అద్వానీ వంటి నాయకుల మధ్య భిన్నమైన వ్యక్తిత్వాలు ఉన్నప్పటికీ, పార్టీని ఒక వ్యక్తి చుట్టూ మాత్రమే నిర్మించాలనే నమూనా అంత స్పష్టంగా కనిపించలేదు. రాష్ట్రాల నాయకత్వానికి, సంస్థాగత చర్చలకు, పార్టీ లోపలి సమీకరణాలకు కూడా ప్రాధాన్యం ఉండేది.

2014 తర్వాత ఈ రాజకీయ శైలిలో గణనీయమైన మార్పు కనిపించింది. దీనిని కేవలం విమర్శకుల ఆరోపణగా కొట్టిపారేయడం సరైంది కాదు. రాజకీయ శాస్త్ర పరిజ్ఞానం, పరిశోధనా దృష్టితో చూస్తే నరేంద్ర మోదీ కాలంలో బీజేపీలో 'పాక్షిక వ్యక్తీకరణ' జరిగిందని, అధికారిక పార్టీ నిర్మాణాలు పూర్తిగా తొలగిపోకపోయినా అనధికారికంగా నిర్ణయాధికారం కేంద్రీకృతమైందని గుర్తిస్తారు. అదే అధ్యయనం మోదీ కాలంలో నాయకుడి వ్యక్తిగత ప్రజాదరణతో పార్టీ సంస్థాగత శక్తి ముడిపడినట్లు, అయితే బీజేపీ పూర్తిగా ఒక వ్యక్తి ఆధీనంలోని సంస్థగా మారలేదని కూడా స్పష్టం చేస్తుంది.

ఇక్కడ విమర్శకు సరైన పదం 'వ్యక్తిపూజ' మాత్రమే కాదు; వ్యక్తి-కేంద్రీకరణ. ఎందుకంటే మోదీ నాయకత్వం బీజేపీకి ఎన్నికల విజయాలు, విస్తృత ప్రజాదరణ, శక్తివంతమైన ప్రచార సామర్థ్యాన్ని అందించిందనే వాస్తవాన్ని నిరాకరించడం విమర్శ కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే-ఈ విజయాల ఫలితంగా పార్టీ సంస్థ ఎంత బలపడింది? నాయకుడి రాజకీయ ప్రతిష్ఠ ఎంత బలపడింది? ఈ రెండింటి మధ్య సమతుల్యత ఎటు వైపు మారింది?

'మోదీకీ గ్యారంటీ' దీనికి మంచి ఉదాహరణ. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం 'మోదీ కీ గ్యారంటీ' అనే పేరుతో వాహనాలు దేశవ్యాప్తంగా తిరిగాయని ప్రధానమంత్రి కార్యాలయమే నమోదు చేసింది. అదే ప్రచారంలో గృహాలు, ఉచిత రేషన్, గ్యాస్, ఆరోగ్య పథకాలు, రైతు పథకాలు, బ్యాంకు ఖాతాలు వంటి ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

ఇక్కడ ఒక ప్రజాస్వామ్య ప్రశ్న తప్పనిసరిగా వస్తుంది. ఒక పథకం ప్రజల పన్నుల నుంచి నిధులు పొందుతుంది. దాన్ని రూపొందించేది ప్రభుత్వం; అమలు చేసేది మంత్రిత్వ శాఖలు, అధికారులు, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు; చివరికి దాని ఖర్చును భరించేది ప్రజలే. అలాంటి పథకం ఒక వ్యక్తి పేరుతో రాజకీయ హామీగా మారితే, ప్రభుత్వ సంస్థాగత బాధ్యత వ్యక్తిగత రాజకీయ విశ్వసనీయతతో ముడిపడే ప్రమాదం ఉంటుంది. పథకం ప్రజల హక్కా? నాయకుడి కృపా? అనే భావనలోనే ప్రజాస్వామ్య రాజకీయాల నాణ్యత దాగి ఉంటుంది.

మోదీ రాజకీయ బ్రాండింగ్ ఇమేజ్ కేవలం ప్రభుత్వ ప్రకటనలతో ఆగలేదు. ఎన్నికల ప్రచారం, సామాజిక మాధ్యమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, వీడియో సందేశాలు, వెబ్‌సైట్లు, రాజకీయ సభలు--అన్నింటిలోనూ ఒకే నాయకుడి దృశ్యమానత అపూర్వ స్థాయికి చేరింది. దీనిని ఆధునిక రాజకీయాల్లో 'పర్సనలైజ్డ్ పొలిటికల్ కల్ట్ కమ్యూనికేషన్'గా చూడాలి. నాయకుడి ముఖం రాజకీయ సందేశానికి ప్రధాన మాధ్యమంగా మారినప్పుడు పార్టీ సిద్ధాంతం, కేడర్, స్థానిక నాయకత్వం, విధాన చర్చలు వెనుకబడే అవకాశం ఉంటుంది. అమిత్ షా పాత్రను కూడా ఈ సందర్భంలో కేవలం మోదీకి సహాయకుడిగా చూడటం సరైంది కాదు. మోదీ-షా నాయకత్వం బీజేపీని అత్యంత సమర్థవంతమైన ఎన్నికల యంత్రాంగంగా మలచడంలో కీలక పాత్ర పోషించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి ఎన్నికల వ్యూహం వరకు కేంద్రీకరణ పెరిగిందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే ఇది కేవలం ఒక వ్యక్తి ప్రజాదరణ సమస్య కాదు; నాయకత్వం, పార్టీ యంత్రాంగం, ఎన్నికల నిర్వహణ, ప్రచార సాంకేతికత ఇవన్నీ ఒకదానితో ఒకటి అనుసంధానమైన కొత్త రాజకీయ నమూనా (న్యూ పొలిటికల్ మోడల్).

ఈ పరిణామంలో వాజపేయి, అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి పాత తరం నాయకుల స్థానాన్ని కూడా పరిశీలించాలి. వారు తప్పులేనివారని చెప్పడం కాదు; కానీ ఒక పార్టీని నిర్మించిన చారిత్రక నాయకత్వాన్ని ఎలా గౌరవిస్తుంది అనేది ఆ పార్టీ సంస్థాగత సంస్కృతికి ఒక ప్రమాణం. మోదీ కాలంలో పాత తరం నాయకులు 'మార్గదర్శక మండలి' వంటి గౌరవప్రదమైన కానీ నిర్ణయాధికారం లేని స్థితికి వెళ్లిన పరిణామాన్ని పరిశోధనా దృష్టితో చూస్తే, పార్టీ నాయకత్వ కేంద్రీకరణలో భాగంగా చూస్తారు.

ఇక్కడ ఆరెస్సెస్ పాత్ర మరింత ఆసక్తికరంగా మారుతుంది. ఆరెస్సెస్ తనను వ్యక్తి ఆధారిత సంస్థగా కాకుండా, దీర్ఘకాలిక కేడర్ నిర్మాణం, స్వచ్ఛంద సేవ, సంస్థాగత క్రమశిక్షణ, సామాజిక పునర్నిర్మాణంపై ఆధారపడిన ఉద్యమంగా వివరిస్తుంది. మోహన్ భగవత్ స్వయంగా కార్యకర్తలు కొత్త కార్యకర్తలను తయారు చేయడం నిరంతర ప్రక్రియ అని చెప్పారు. సంస్థ యొక్క కేంద్ర ఆలోచన 'భారత్' అని, వ్యక్తి కంటే విస్తృతమైన సామాజిక-జాతీయ లక్ష్యమే దాని దృష్టి అని ఆరెస్సెస్ అధికారికంగా వివరిస్తుంది.

అయితే ఇక్కడే ఒక సైద్ధాంతిక సవాలు ఉంది. కేడర్ నిర్మాణం, సామూహికత, సంస్థాగత క్రమశిక్షణ, దీర్ఘకాలిక సిద్ధాంత నిర్మాణం ఆరెస్సెస్‌కు ముఖ్యమైతే, దాని రాజకీయ పరివారంలోని ప్రధాన పార్టీ ఎందుకు క్రమంగా ఒక నాయకుడి ముఖచిత్రం చుట్టూ తన ఎన్నికల ప్రచారాన్ని కేంద్రీకరిస్తోంది? ఇది ఆరెస్సెస్ సిద్ధాంతానికి వ్యతిరేకత కాదా!? ఈ విషయంలో తక్షణమే తీర్పు ఇవ్వాల్సిన అవసరం లేదు. కానీ కాస్త ఓపిగ్గా పరస్పర విరుద్ధమైన ఆ రెండు రాజకీయ సంస్కృతుల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మాత్రం నిష్పాక్షికంగా, రాగద్వేషాలకు అతీతంగా పరిశీలించాలి.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే...మోదీని విమర్శించడం అంటే బీజేపీని వ్యతిరేకించడం కాదు. బీజేపీని విమర్శించడం అంటే ఆరెస్సెస్‌ను అవమానించడం కాదు. అలాగే మోదీకి ప్రజాదరణ ఉందని చెప్పడం అంటే ఆయనను దేవుడిగానో, దేవుడి ప్రతినిధిగానో భావించడం కాదు. ఒక ప్రజాస్వామ్యంలో నాయకుడికి ప్రజాదరణ ఉండటం సహజం. కానీ నాయకుడి ప్రజాదరణ సంస్థాగత నియంత్రణల కంటే పెద్దదిగా మారినప్పుడు సమస్య మొదలవుతుంది.

2024 ఎన్నికల సమయంలో మోదీ తన తల్లికి సంబంధించిన 'బయోలాజికల్' వ్యక్తిగా కాకుండా దేవుడు తనను ఎంచుకొని తన ప్రతినిధిగా పంపిన వ్యక్తిగా అభివర్ణించుకున్న వ్యాఖ్యలు కూడా ఈ చర్చలో ఒక రాజకీయ కమ్యూనికేషన్ కు ఉదాహరణగా పరిశీలించవచ్చు. దానిని వ్యక్తిగత విశ్వాసంపై తీర్పుగా కాకుండా, నాయకుడి రాజకీయ ప్రతిరూపం సాధారణ మానవ రాజకీయ నాయకుడి స్థాయిని దాటి అసాధారణమైన ప్రతీకగా ఎలా నిర్మించబడుతుందనే ప్రశ్నగా చూడాలి. అదే సమయంలో ఆరెస్సెస్ నాయకత్వం వ్యక్తిలో 'దైవత్వం' ఉందో లేదో ప్రజలే నిర్ణయించాలని వ్యాఖ్యానించిన సందర్భం కూడా ఉంది. ఈ విభిన్న సంకేతాలే మరింత లోతైన పరిశీలనకు కారణం.

ఇక్కడ కార్యకర్తల ప్రశ్న కూడా కీలకం. బీజేపీని నిర్మించిన వేలాది మంది కార్యకర్తలు కేవలం నాయకుడి సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఎన్నికల యంత్రాంగమా? లేక విధాన చర్చల్లో, అభ్యర్థుల ఎంపికలో, సంస్థాగత నిర్ణయాల్లో, నాయకత్వ నిర్మాణంలో స్వతంత్ర రాజకీయ పాత్ర కలిగిన భాగస్వాములా? ఒక కేడర్ పార్టీ బలం నాయకుడి ప్రజాదరణలో కాకుండా, నాయకుడు లేకపోయినా సంస్థ కొనసాగగల సామర్థ్యంలో ఉంటుంది.

ఇదే అసలు పరీక్ష. ఒక పార్టీ ఒక నాయకుడి విజయంతో గెలవడం తప్పు కాదు. కానీ ఆ నాయకుడు లేని భవిష్యత్తును ఊహించలేని స్థితికి పార్టీ చేరితే అది సంస్థాగత బలమా, బలహీనతా? నాయకుడి పేరుతో పథకాలు ప్రచారం కావడం తప్పు కాదు. కానీ పథకం కంటే నాయకుడి పేరు గుర్తుండిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య ప్రభుత్వ స్వభావం ఏమవుతుంది? పార్టీ సిద్ధాంతం నాయకుడిని నియంత్రించాలా, లేక నాయకుడి ప్రజాదరణ సిద్ధాంతాన్ని నిర్వచించాలా?

అందుకే బీజేపీ-ఆరెస్సెస్‌ను ప్రశ్నించాల్సిన సవాలు వ్యక్తిగతమైనది కాదు; సైద్ధాంతికమైనది. సంస్థ వ్యక్తికంటే పెద్దదా? సిద్ధాంతం నాయకుడికంటే పెద్దదా? కార్యకర్త అనుచరుడా, లేక సంస్థలో రాజకీయ భాగస్వామా? ప్రభుత్వం ప్రజలదా, లేక నాయకుడి వ్యక్తిగత హామీకి ప్రతీకా? బీజేపీ తన అధికారిక సిద్ధాంత పత్రాల్లో పేర్కొన్న ప్రజాస్వామ్యం, విలువల ఆధారిత రాజకీయాలు, వ్యక్తి గౌరవం, సామాజిక సమగ్రత వంటి ప్రమాణాలను నిజంగా విశ్వసిస్తే, అవే ప్రమాణాలు తన అత్యంత శక్తివంతమైన నాయకత్వానికీ వర్తించాలి. ఆరెస్సెస్ తనను కేడర్, సేవ, సామూహిక నిర్మాణంపై ఆధారపడిన సంస్థగా భావిస్తే, రాజకీయ రంగంలో వ్యక్తి-కేంద్రీకరణ పెరుగుతున్నప్పుడు దానిపై కూడా విమర్శనాత్మక ఆత్మపరిశీలన అవసరం. చివరికి ప్రశ్న మోదీ గొప్ప నాయకుడా కాదా అనేది ప్రధానం కాదు. అమిత్ షా సమర్థ నిర్వాహకుడా కాదా అనేది కూడా కాదు. అసలు ప్రశ్న మరింత పెద్దది:

బీజేపీ మోదీని ఉపయోగించుకుంటోందా? లేక మోదీ బ్రాండ్‌ను ఉపయోగించుకోవడానికి బీజేపీ తన సంస్థాగత స్వభావాన్ని మార్చుకుంటోందా? వ్యక్తులు వస్తారు. వ్యక్తులు వెళ్తారు. నాయకత్వాలు మారుతాయి. కానీ ఒక సంస్థ నిలబడాలంటే దాని భవిష్యత్తు ఒక వ్యక్తి ప్రతిష్ఠపై మాత్రమే కాకుండా, సైద్ధాంతిక, సంస్థాగత ప్రజాస్వామ్యం, కార్యకర్తల సామూహిక శక్తి, ప్రజల విశ్వాసంపై ఆధారపడాలి.

వ్యక్తి కంటే సంస్థ.
నాయకుడి కంటే సిద్ధాంతం.
ప్రచారం కంటే ప్రజా ప్రయోజనం.
వ్యక్తిగత ఘనత కంటే సామూహిక కృషి.
అనుచర గణం సంస్కృతి కంటే విమర్శనాత్మక ఆలోచన ముఖ్యం.
ఈ రాజకీయ సంస్కృతి (పొలిటికల్ కల్చర్) అనేది ఒక బీజేపీకి మాత్రమే కాదు. భారత ప్రజాస్వామ్యంలో ప్రతి పెద్ద రాజకీయ సంస్థ ఎదుర్కోవాల్సిన పరీక్ష.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# వర్గ దృక్పథం లేకపోతే..?




కర్మభూమి వేదభూమి అని పిలువబడే మన దేశం, ఇంతకూ 'కుల సమాజమా? వర్గ సమాజమా? ఈ చర్చ రెండు రాజకీయ సైద్ధాంతిక శిబిరాల మధ్య అనేక సంవత్సరాలుగా జరుగుతోంది. ఈ అంశం గురించి ఒక విమర్శనాత్మక దృక్పథంతో, చారిత్రక కోణంలో గతితార్కికంగా చర్చించా ల్సింది పోయి.. వితండ వాదాలతో, ఒంటెద్దు పోకడలతో, వ్యక్తి వాదాలకు ప్రాధాన్యతనిస్తూ.. మార్క్స్ - అంబేద్కర్ ఆలోచనా విధానాలకు మధ్య మరింత దూరం పెంచుతున్నా రు, కొంతమంది మేధావులు! అయితే ఈ అంశం పట్ల ఎవరికెన్ని భిన్నాభిప్రాయాలు ఉన్నా, ఇది వర్గ సమాజమే! ఇంకా చెప్పాలంటే ఇది 'కులాధిపత్య వర్గ సమాజం!' ఇక్కడ కులంలో వర్గం ఉంది. వర్గంలో కులం ఉంది! వర్గమంటే దోపిడీ చేసే వర్గం, దోపిడీకి గురయ్యే వర్గం అని అర్థం. ఈ దోపిడీ వర్గం ఆధిపత్య కులాల్లో అత్యధిక శాతం ఉంటే, అణచివేత కులాల్లో తక్కువ శాతం ఉంది. రెండు శిభిరాల్లోనూ ఎక్కువ తక్కువ శాతంగా ఈ దోపిడీ వర్గం బహిరంగంగానూ, స్వాభావికంగానూ తిష్ట వేసి ఉంది! మరి ఈ దోపిడీ వర్గాన్ని దాని స్వభావాన్ని ఎట్లా గుర్తించాలి అంటే, 'వర్గ దృక్పథం ( Class Perspective)' అనే చైతన్య జ్ఞానాన్ని అలవర్చుకుని పరిశీలించడం ద్వారా మాత్రమే, మనం గుర్తించగలము!

ఇంతకూ 'వర్గ దృక్పథం' అంటే ఏమిటి? సమాజాన్ని చారిత్రక పరిణామాల నేపథ్యంలో సామాజిక అంశాలను, రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అంశాలను, గతి తార్కికంగా విశ్లేషించి అర్థం చేసుకునే సైద్ధాంతిక దృక్పథమే - ఈ వర్గ దృక్పథం! దీన్నే 'శ్రామికవర్గ దృక్పథం, మార్క్సిస్టు వర్గ దృక్పథం' అని కూడా అంటారు. సమాజంలో నిరంతరం, ఉత్పత్తి శక్తుల (శ్రామిక వర్గ ప్రజల) శ్రమలను దోపిడీ చేసే ధనిక వర్గానికి - శ్రామిక వర్గ ప్రజలకు మధ్య జరిగే పోరాటాన్ని, గతి తార్కికంగా విశ్లేషించి అర్థం చేసుకునే దృక్పథమే - ఈ వర్గ దృక్పథం!

సమాజ సంపద కొందరి దగ్గరే ఏ విధంగా పోగు పడుతుందో, శాస్త్రీయంగా సైద్ధాంతికంగా తెలియజేప్పే ఆలోచన మార్గం ఇది! వ్యాపారాలు, రాజకీయాలు, భూ కబ్జాలు, శ్రమ దోపిడీ అనే సాధనాల ద్వారా.. నిరంతరం ఈ దోపిడి వర్గాలు ఏ విధంగా దోపిడీ కొనసాగిస్తున్నాయో, ఏ విధంగా ప్రకృతి సంపదను సొంతం చేసుకుంటున్నాయో, ఏ విధంగా సమాజంలో సామాజిక సాంస్కృతిక అసమానతలను పెంచి పోషిస్తున్నాయో తెలియజెప్పే మార్గమే - ఈ వర్గ దృక్పథం!

ఇంతకూ ఈ శ్రామిక వర్గ చైతన్యం మన నాయకుల్లో, ప్రజల్లో లేకపోతే ఏమవుతుంది అంటే.. 'వారిలో కులతత్వం బానిసత్వం పెరిగి, సమాజంలో మరింత సామాజిక అసమానతలు బలపడడానికి దోహదమవుతుంది! దోపిడీ చేసే వాళ్ళు మన కులపోల్లే కదా, మన వర్గపోళ్ళే కదా అనీ, సమర్థించుకునే బలహినత ఏర్పడుతుంది! ఈ విధంగా ఈ 'దోపిడీ స్వభావ గుట్టును కనిపెట్టే' వర్గ చైతన్యమే మనలో లేకపోతే, ఈ దోపిడీవర్గాలు పన్నే అమానవీయ కుతంత్రపు మాయాజాలం, మనకు ఎప్పటికీ అర్థం కాదు!'

అయితే ఇది మార్క్సిస్టు సిద్ధాంతం కదా, మాకెందుకు అని ఎవరైనా భావిస్తే, మార్క్సిజం పట్ల వాళ్లకు సరైన అవగాహన లేదని అనుకోవాల్సి ఉంటుంది. మానవ సమాజం గురించి, ప్రకృతి గురించి; ఈ సమాజంలో ఏర్పడ్డ పేద - ధనిక వర్గాల పుట్టుక గురించి, సామాజిక అసమానతలు అంటరానితనం గురించి.. అవి ఇంకా ఎందుకు కొనసాగుతున్నాయో, వాటి పరిష్కారం ఏమిటో గురించి.. శాస్త్రీయంగా సైద్ధాంతికంగా తెలియజేప్పే మార్గమే - ఈ మార్క్సిస్టు వర్గ దృక్పథం! ప్రతి మనిషి ఈ దృక్పథాన్ని ఎందుకు తప్పనిసరిగా కలిగి ఉండాలో తెలుసుకోవాలంటే, ఈ రెండు చిన్న ఉదాహరణలు చెప్పుకుందాం..

“అంతకుముందు ఎన్నో వివక్షలు, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు అనుభవించిన నా ప్రజలు.. రిజర్వేషన్లు అమలైన తర్వాత, ఆ రిజర్వేషన్ల ఫలాలను అనుభవిస్తూ, ఆర్థికంగా కొంత మెరుగైన జీవితం ఏర్పడేసరికి.. తమ జాతి ప్రజల విముక్తిని, రాజ్యాంగ స్పృహను, చివరికి నన్నూ నా మార్గాన్ని కూడా విస్మరించారు అనీ” అంబేద్కర్ తన చివరి రోజుల్లో చాలా బాధపడ్డారు! అంటే అంబేద్కర్ 'వర్గ దృక్పథం' అనే పదం వాడకపోయినా, అతను ఫీలైన దాంట్లో ఉన్న అంతరార్థం ఇదే. స్వార్థం అవినీతి దోపిడీ, ఇలాంటి స్వభావాలు ఏర్పరచుకున్న వాళ్ళు.. అణచివేత కులాల్లో ఉన్నవాళ్లయినా సరే, వాళ్ల వల్ల సమాజానికి గానీ, తమ జాతి ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేదు అనీ, అంబేద్కర్ ఆవేదనలో మనకు అర్థమవుతుంది. కాబట్టి ప్రజల్లో 'వర్గ దృక్పథ చైతన్యం' లేకపోతే, చివరకు అంబేద్కర్ చెప్పిన 'పే బ్యాక్ సొసైటీ' అనే నినాదం కూడా మనవాళ్లకు ఎప్పటికీ అర్థం కాదు!

ఇక రెండవ ఉదాహరణ. మార్క్స్ - అంబేద్కర్ పుట్టక ముం దు నుండే, సాధారణ ప్రజలకు నైతికపరమైన న్యాయపర మైన సమస్యలు ఎదురైనప్పుడు ఏం మాట్లాడతారంటే.. 'తమ్ముడు తనోడే అయినా, ధర్మం తప్పొదు!' అని అంటారు. అంటే దీని అర్థం.. “స్వార్థంతో, దోపిడి స్వభావంతో ఉన్న వాళ్ళు.. రక్తసంబంధీకులైనా సరే, బంధువులైన సరే, బయటి వాళ్లు అయినా సరే.. మనం వారిని గుర్తించాలి, ప్రశ్నించాలి, న్యాయబద్ధంగా వ్యవహరించాలి” అని అర్థం. మరి ఈ సామాజిక బాధ్యతను పెంపొందించే చైతన్యం ప్రజల్లో రావాలంటే.. కచ్చితంగా ప్రజల్లో 'వర్గ దృక్పథ చైతన్య జ్ఞానం' ఉండాలి!

అందుకే సమాజ మార్పు కోసం అత్యంత నిజాయితీగా, నిబద్ధతగా ఉద్యమిస్తున్న మార్క్సిస్టుల్లో అంబేద్కరిస్టుల్లో.. వర్గ దృక్పథాన్ని - రాజ్యాంగ స్పృహను తప్పకుండా పెంపొందించుకోవాలి! నేడు ఆ దృక్పథం కొరవడడం వల్లే నిర్దిష్టమైన లక్ష్యాన్ని, నిర్దిష్టమైన పని విధానాన్ని ఏర్పరచుకోలేకపోతున్నారు! ప్రజలను సమీకరించలేకపోతున్నారు! సమాజంలో నెలకొన్న మనువాద భావజాల పరిస్థితులను, సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విష సంస్కృతిని అర్థం చేసుకోలేక పోతున్నారు! ఇప్పటికైనా సామాజిక బుద్ధి జీవులందరూ ఈ అంశం పట్ల దృష్టి సారించి, ప్రజలను ఐక్యం చేసి, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన మౌలికమైన బాధ్యత మనందరి మీద ఉంది! భయంకరమైన మత ఉన్మాద ఫాసిజం, భారత దేశ ప్రజలను కబలిస్తున్న నేటి ఈ దుస్థితిలో.. భవిష్యత్ తరాల ప్రజలు ఆ ప్రమాదం బారిన పడకుండా ఉండేందుకు.. పార్టీలకు సిద్ధాంతాలకు అతీతంగా, సామాజిక బాధ్యత ఉన్న ప్రగతిశీల శక్తులందరూ ఏకమై, ఐక్య పోరాటాలు చేయ వలసిన అవసరం ఉంది!

“మనిషి ఆరోగ్యంగా ఉండడానికి శరీరంలో రక్తం ఎంత అవసరమో.. సమాజంలో నెలకొన్న దోపిడీని పసిగట్టడానికి, మనిషి స్వభావంలో 'వర్గ దృక్పథం' అనే ఆలోచనా చైతన్యం కూడా అంతే అవసరం!”



- ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284

నిన్నటి సంచిక తరువాయి

# రైతు కష్టానికి గిట్టుబాటు ధర ఎప్పుడొస్తుంది?



పంట సాగు చేయడానికి రైతు పెట్టుబడి పెట్టాలి, ప్రకృతి వైపరీత్యాల ప్రమాదాన్ని భరించాలి, వర్షాభావం లేదా అధిక వర్షాలతో వచ్చే నష్టాన్ని ఎదుర్కోవాలి, చీడపీడలను నియంత్రించాలి. చివరకు పంట చేతికి వచ్చిన తరువాత మార్కెట్‌లో ధర పడిపోతే ఆ నష్టాన్ని భరించేది కూడా రైతే. అంటే వ్యవసాయంలో పెట్టుబడి పెట్టే వ్యక్తి రైతు, ప్రకృతి ప్రమాదాన్ని భరించేది రైతు, మార్కెట్ ప్రమాదాన్ని ఎదుర్కొనేది రైతు, కానీ ధరను నిర్ణయించే అధికారం మాత్రం రైతు చేతుల్లో ఉండదు. ఈ పరిస్థితిలో వ్యవసాయం లాభదాయకమైన వృత్తిగా ఎలా మారుతుందనేది పాలకులు ఆలోచించాల్సిన ప్రశ్న.

రైతు ఆదాయం పెరగాలంటే కేవలం పంటల ఉత్పత్తి పెంచడం సరిపోదు. ఉత్పత్తికి సరైన ధర లభించాలి. పంటలకు శాస్త్రీయంగా నిర్ణయించిన కనీస మద్దతు ధర అమలులోకి రావాలి. ఉత్పత్తి వ్యయాలను వాస్తవికంగా లెక్కించి, కుటుంబ శ్రమ, భూమి వినియోగం, నీటి ఖర్చు, యంత్రాల వినియోగం, రవాణా, నిల్వ వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని ధర నిర్ణయించాలి. రైతు పంటను మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ గోదాములు, శీతల గిడ్డంగులు, రైతు మార్కెట్లు, ప్రత్యక్ష విక్రయ కేంద్రాలు విస్తరించాలి.

అదే సమయంలో పంటల వైవిధ్యీకరణ, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆహార శుద్ధి పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాల్లో పెరగాలి. రైతు ముడి సరుకును మాత్రమే అమ్మకుండా దానిని శుద్ధి చేసి, నిల్వ చేసి, ప్యాకింగ్ చేసి అధిక విలువతో మార్కెట్‌లో విక్రయించే అవకాశాలు కల్పించాలి. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి చిన్న రైతులు సమూహంగా మార్కెట్‌లోకి వెళ్లే విధంగా వ్యవస్థను రూపొందించాలి. దీంతో రైతు బేరసారాల శక్తి పెరిగి మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ రంగంలో మరో ముఖ్యమైన అంశం రైతు అప్పుల భారం. పంటకు సరైన ధర రాకపోవడం, వరుసగా నష్టాలు రావడం వల్ల రైతు అప్పుల ఊబిలోకి వెళ్లే ప్రమాదం పెరుగుతుంది. అందువల్ల పంట నష్టపరిహారం, పంటల బీమా, తక్కువ వడ్డీ రుణాలు, మార్కెట్ ధరల సమాచారం, వాతావరణ హెచ్చరికలు రైతుకు సకాలంలో అందాలి. వ్యవసాయాన్ని కేవలం ఎన్నికల సమయంలో చర్చించే అంశంగా కాకుండా దీర్ఘకాలిక ఆర్థిక విధానంలో కీలక రంగంగా చూడాల్సిన అవసరం ఉంది. రైతు పంట పండించకపోతే దేశానికి ఆహారం ఉండదు. రైతు ఆదాయం పడిపోతే గ్రామీణ మార్కెట్‌లో కొనుగోలు శక్తి తగ్గుతుంది. గ్రామీణ మార్కెట్ బలహీనపడితే చిన్న వ్యాపారాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, రవాణా, సేవారంగాలు కూడా ప్రభావితమవుతాయి. కాబట్టి రైతుకు గిట్టుబాటు ధర కల్పించడం అంటే కేవలం రైతు కుటుంబాన్ని ఆదుకోవడం కాదు; దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కూడా. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ ఆధారిత సమాజాల్లో ఒకటి. ఇంతటి విస్తృతమైన వ్యవసాయ రంగం ఉన్న దేశంలో రైతు తన పంటకు సరైన ధర కోసం ప్రతి సీజన్‌లో ఆందోళన చెందాల్సిన పరిస్థితి మారాలి. రైతు ఉత్పత్తికి ధర, పెట్టుబడికి భరోసా, పంటకు మార్కెట్, నష్టానికి రక్షణ, భవిష్యత్తుకు ఆదాయ భద్రత కల్పించే సమగ్ర వ్యవస్థ అవసరం. రైతు కష్టానికి గౌరవం మాటల్లో కాకుండా ధరలో, ఆదాయంలో, జీవన ప్రమాణాల్లో కనిపించాలి.

చివరికి రైతు బతికితేనే వ్యవసాయం బతుకుతుంది; వ్యవసాయం బతికితేనే దేశ ఆహార భద్రత బతుకుతుంది. రైతు ఆదాయం స్థిరపడితేనే గ్రామీణ భారతదేశం బలపడుతుంది. అందుకే రైతు పండించిన ప్రతి గింజకు న్యాయమైన విలువ దక్కేలా వ్యవసాయ ధరల విధానాన్ని పునఃపరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. రైతు కష్టాన్ని ఖర్చుగా కాకుండా దేశ భవిష్యత్తుపై పెట్టుబడిగా గుర్తించినప్పుడే భారత వ్యవసాయం సంక్షోభం నుంచి స్థిరమైన అభివృద్ధి వైపు పయనిస్తుంది. రైతు కళ్లలో నమ్మకం, కుటుంబంలో భద్రత, పంటకు గిట్టుబాటు ధర వచ్చిన రోజే నిజమైన వ్యవసాయ ప్రగతికి అర్థం ఏర్పడుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రగతినగర్ వాసుల నిరసన



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ డివిజన్లో ప్రజలకు త్రాగునీరు వ్యక్తిగత అవసరాలకు సరిపడా అందించలేని దౌర్భాగ్యమైన పరిస్థితుల్లో జలమండలి అధికారుల తీరును ఎండగడుతూ ఆదివారం కోతుల బొమ్మ చౌరస్తా వద్ద హెచ్ఎం డబ్ల్యూ సి దిష్టిబొమ్మను ప్రగతి నగర్ బిజెపి అధ్యక్షుడు నరేంద్ర చౌదరి నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వాటర్ వర్క్స్ అధికారులపై వ్యతిరేక నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ నిజాంపేట సర్కిల్లోని ప్రజల కోసం భారతీయ జనతా పార్టీ నాయకులు నిరంతర పోరాటం చేస్తూనే ఉంటుందని ఇప్పటికైనా అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు బిజెపి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## త్రీఫేజ్ కరెంట్ కోసం కరెంటు సబ్ స్టేషన్ వద్ద రైతుల ఆందోళన



**శామీర్‌పేట్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్దెమర్రి గ్రామ పరిధిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. సబ్‌స్టేషన్ వద్దకు చేరుకున్న రైతులు తమకు సమయానికి త్రీఫేజ్ కరెంట్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన దశలో ఉన్న వరి పంటకు నీరు అందక ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పంటను కాపాడుకునేందుకు విద్యుత్ కోసం ఎదురుచూస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. విద్యుత్ సరఫరా విషయంలో అధికారుల నిర్లక్ష్యమే తమ పంటల పరిస్థితికి కారణమని రైతులు ఆరోపించారు. త్రీఫేజ్ విద్యుత్‌ను నిర్దేశిత సమయాల్లో నిరంతరాయంగా సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతుల ఆందోళనతో అక్కడికి విచ్చేసిన ఏ ఈ విజయ్ కుమార్ సమస్యలు విని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## మహిళా పారిశ్రామికవేత్తలకు పూర్తి ప్రోత్సాహం




**మల్కాజిగిరి, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మహిళలు స్వయం ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు. గౌతమ్‌నగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం ఆచార్య ఎంపవరింగ్ ఉమెన్ ఎన్జీవో ఆధ్వర్యంలో 'వి-శక్తి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ బిజినెస్ మేళా-2026' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళా పారిశ్రామికవేత్తలు వ్యాపారాలను విస్తరించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ పథకాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై త్వరలోనే అవగాహన సదస్సులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యేలా అధికారులతో సమన్వయం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మేకల సునీత, నాయకులు రాముయాదవ్, రఘురామశర్మ, సూర్యకుమారి, శిరీష, హిమబిందు, పర్వతవర్ధిని, సుబ్రహ్మణ్యం, కావూరి శ్రీనివాసరావు, రమణచార్యులు, నందప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి హెచ్ఎండిఏ లేఔట్‌లో సమస్యలు పరిష్కరించాలంటూ రోడెక్కిన కుటుంబాలు

- హైదరాబాద్, వరంగల్ జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన




**బోడుప్పల్, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** నాలుగేళ్లు కావస్తున్న మేడిపల్లి హెచ్ఎండిఏ లేఔట్ లో వసతులు కల్పించక రాష్ట్ర ప్రభుత్వము హెచ్ఎండిఏ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్లాట్ల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్ఎండి అధికారుల వైఖరిని నిరసిస్తూ మేడిపల్లి లేఔట్ లో కొనుగోలుదారులు అసోసియేషన్ బ్యానర్, ప్లకార్డులను చేత పట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్పందించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం మేడిపల్లి హెచ్ఎండి లేఔట్ లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్లాట్ల కొనుగోలుదారులు కుటుంబాలతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్లాట్ల కుటుంబాలు మాట్లాడుతూ లేఔట్‌లో కరెంటు లేకుండా ఇల్లు ఎలా కట్టుకోవాలని నాలుగేళ్లయిన చలనం లేదా అని అధికారుల వైఖరిని నిలదీశారు. సిపిఆర్ఐ పర్వతపూర్ మధ్యన 60 ఫీట్ల అప్రోచ్ రోడ్డు సమస్యను, పార్కుల చుట్టూ కాంపౌండ్ వాల్, గేట్ల నిర్మాణము, గ్రీనరీ అభివృద్ధి తదితరాలను గాలికి వదిలేసారని ఓవర్ హెడ్ ట్యాంకు సంపుల నిర్మాణం పనులు నత్త నడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వము హెచ్ఎండిఏ అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే అక్టోబర్ ఆరవ తేదీ మంగళవారం రోజున హైదరాబాద్ అమీర్పేట్ హెచ్ఎండిఏ కేంద్ర కార్యాలయంలో కుటుంబాలతో పెద్ద ఎత్తున ఆందోళన తో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎంపల్లి పద్మా రెడ్డి, ఈదునూరి హేమంత్ కుమార్, సతీష్, సురేష్ నాయక్, రమణారెడ్డి, డిఎస్ నాయక్, అశోక్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ ప్రజా సేవకు విరామం కాదు

- తెలంగాణ ఉద్యమంలో జెల్ల సుధాకర్ పాత్ర అభినందనీయం
- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి



**మెదక్ టౌన్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** ఉద్యోగ విరమణ బాధ్యతలకు మాత్రమేనని.. ప్రజా సేవకు కాదని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా సుదీర్ఘకాలం నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ చేస్తున్న జెల్ల సుధాకర్‌కు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంతోపాటు ఉద్యోగుల హక్కులు, ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన జెల్ల సుధాకర్ పదవీ విరమణ అభినందన సభలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో సంపాదించిన అనుభవాన్ని ఇకపై సమాజ సేవకు వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ అంకితభావంతో పనిచేయడం సుధాకర్ ప్రత్యేకత అన్నారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడడంతోపాటు సహచర ఉద్యోగులు, అధికారులు, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సుధాకర్ క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొని ప్రజలను చైతన్యపరిచారని, సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ, ఉద్యోగుల ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూనే తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం ఆయన సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు. దళిత, బహుజన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం సుధాకర్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు విద్య, ఉపాధి, సమానత్వం, హక్కుల సాధన కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సుధాకర్ దంపతుల భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో, సంపూర్ణ ఆరోగ్యంతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగ బాధ్యతలకు ముగింపు మాత్రమేనని, సమాజం పట్ల బాధ్యతలకు కాదని అన్నారు. జెల్ల సుధాకర్ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో పనిచేయడంతోపాటు ఉద్యోగుల హక్కులు, సామాజిక న్యాయం కోసం కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను గుర్తు చేస్తూ.. పదవీ విరమణ అనంతరం కూడా తన అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడేలా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు దీపక్ కుమార్, సోహెల్, మాజీ కౌన్సిలర్లు ఆర్కే శ్రీనివాస్, మాయ మల్లేశం, నాయకులు జీవన్‌రావు, కృష్ణగౌడ్, లింగారెడ్డి, సాదిక్, షాకీర్, కిరణ్, ఎంబీపూర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రెస్‌క్లబ్ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ

- జర్నలిస్టుల సంక్షేమానికి అండగా ఉంటాం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులకు ఇన్సూరెన్స్ బాండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వద్దేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై పలువురు జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ బాండ్లను తన చేతుల మీదుగా అందజేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడి మధుసూదన్‌రెడ్డి అందించిన ఆర్థిక సహకారంతో జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టుల భద్రత, సంక్షేమానికి ఇలాంటి ఇన్సూరెన్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలు కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడి మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, నేర్థం భాస్కర్‌గౌడ్, నాయకులు ఈరెల్లి రవీందర్‌రెడ్డి, తిరుమలేష్, కొంపల్లి రవీందర్, పల్లె రాజకుమార్‌గౌడ్, గడ్డం పాపిరెడ్డి, పిట్టల నరేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వద్దేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా సీసా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ బోడ ప్రవీణ్, ఇడపాక సురేష్, కమిటీ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలకు పిలుపు



**మల్కాజిగిరి, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ రాజ్యాంగ స్ఫూర్తికి, పౌరుల ప్రాథమిక ఓటు హక్కుకు విఘాతం కలిగించేలా ఉందని టీపీసీసీ నాయకుడు, మల్కాజిగిరి నియోజకవర్గ పరిశీలకుడు సమీర్ కౌశల్ ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ సవరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నేరెడ్‌మెట్‌లోని మహాబోధి ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 6న మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు నిరసన చేపట్టనున్నాయని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లనున్నట్లు చెప్పారు. అలాగే అక్టోబర్ 7న బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్‌ఏ) తమ వద్దకు వచ్చే ఎస్ఐఆర్ ఫారాలపై సంతకాలు చేయకుండా బహిష్కరించి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, రాజ్ జితేంద్రనాథ్, బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, పిట్టల శ్రీనివాస్, ఏకే మురుగేష్, జీడీ సంపత్ గౌడ్, రామచందర్, ప్రభా తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

- లక్ష్మీపల్లి స్టేజీ వద్ద విషాద ఘటన
- బస్సు ఎక్కుతుండగా ప్రమాదం



**కొల్లాపూర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** లక్ష్మీపల్లి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, స్థానికుల కథనం ప్రకారం.. పెబ్బేరు నుంచి చిన్నంబావి మీదుగా కొల్లాపూర్‌కు వెళ్తున్న కొల్లాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన టీజీ 31 జెడ్ 0021 బస్సు లక్ష్మీపల్లి స్టేజీ వద్దకు చేరుకుంది. బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సుజాతమ్మ (48), భర్త ఈశ్వర గౌడ్ అనే మహిళను బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. అదే సమయంలో బస్సు ఎక్కేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు మహిళా ప్రయాణికులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. లక్ష్మీపల్లి స్టేజీ వద్ద బస్సు కోసం వేచి ఉన్న మహిళా ప్రయాణికులు డ్రైవర్‌కు కుడివైపు నుంచి ఎడమవైపునకు వచ్చి బస్సు ఎక్కేందుకు ప్రయత్నించిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షంగా చూసిన మహిళలు తెలిపారు. బస్సు ఢీకొనడంతో సుజాతమ్మ మృతి చెందడంతో ఆమె భర్త ఈశ్వర గౌడ్ బస్సు ముందు నిలబడి బోరున విలపించడం అక్కడున్న వారిని కలచివేసింది. సమాచారం అందుకున్న చిన్నంబావి మండల ఎస్ఐ రామన్ గౌడ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ నీలామణి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, సుజాతమ్మ బంధువులు, తోటి ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు.

## విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో ప్రభుత్వం విఫలం




**ఖమ్మం, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని మూడో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో కీలకమైన యూనిట్ నిలిచిపోవడం ప్రభుత్వ విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యానికి, వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ యూనిట్ నిలిచిపోవడంతో రోజుకు 270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగిందని ఇప్పటివరకు సుమారు 15.5 కోట్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలిగిందని మాజీ మంత్రి పువ్వాడ ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో కీలకమైన పరికరాల నిర్వహణ, ముందస్తు తనిఖీలు, స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహించిందో సమాధానం చెప్పాలని పువ్వాడ డిమాండ్ చేశారు. నిలిచిపోయిన మూడో యూనిట్‌ను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటో వెల్లడించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రశ్నించారు.

## ట్యాంకర్ నీటితో కంది పంట సాగు

- ఆదుకోవాలంటున్న రైతు



**గద్వాల, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండిపోవడంతో గద్వాల్ మండలం మదనపల్లి గ్రామానికి చెందిన రైతు నాగిరెడ్డి తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. తనకున్న 10 ఎకరాల పొలంలో పత్తి, కంది పంటలను సాగు చేయగా, నీరు లేక ఇప్పటికే పత్తి పంట పూర్తిగా ఎండిపోయింది. ప్రస్తుతం పూత దశకు చేరిన కంది పంటనైనా కాపాడుకోవాలనే ఆరాటంతో ఆయన రోజుకు రూ. 6,000 చొప్పున వెచ్చించి ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటకు అందిస్తున్నారు. సాగు కోసం ఇప్పటికే రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయానని, ఈ పరిస్థితిలో ప్రభుత్వం స్పందించి తక్షణమే తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఆవేదనతో రైతు నాగిరెడ్డి వేడుకుంటున్నారు.

# ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివి

- మంచాల సొసైటీ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి
- ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప నాయకుడు
- పట్లోళ్ల ఇంద్రారెడ్డి 72వ జయంతి



**రంగారెడ్డి, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ హోం శాఖ మంత్రి, స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి సేవలు మరువలేనివని మంచాల సొసైటీ చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి 72వ జయంతి వేడుకలను మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి విద్యార్థి స్థాయి నుండే ఎన్నో ఉద్యమాలు చేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచారన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ తన రాజకీయ ప్రస్థానంలో హోంమంత్రి స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్, గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నరసింహగౌడ్, బుట్టి కృష్ణ ముదిరాజ్, మార లక్ష్మణ్, మాజీ సర్పంచ్ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రావుల భాషా, గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్, కావలి శ్రీనివాస్ ముదిరాజ్, నూకం సత్తయ్య ముదిరాజ్, అంతటి రాజుగౌడ్, మేగావత్ లక్ష్మణ్ నాయక్, దాసరమోని రమేష్ ముదిరాజ్, కావలి రమేష్ ముదిరాజ్, మార సురేష్, ఉదరీ నరసింహ, మహమ్మద్ యూసుఫ్, మద్దెల గోపాల్ గౌడ్, మంకు శ్రీనివాస్, మహమ్మద్ ఇబ్రహీం, సుంకరి దానయ్యగౌడ్, దాసరమోని అశోక్ ముదిరాజ్, మహమ్మద్ అష్రఫ్, రావుల నాగరాజు పాల్గొన్నారు.

# వనపర్తికి రూ.60 కోట్ల రైతు విజ్ఞాన కేంద్రం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో సాకారం
- అయ్యవారిపల్లిలో 40 ఎకరాల్లో నిర్మాణానికి శ్రీకారం



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లాకు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం తీసుకురావాలన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ ఫలించింది. సుమారు రూ.60 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రైతు విజ్ఞాన కేంద్రానికి పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎం.ఎస్. నంబర్ 571, జి.ఓ.ఎం.ఎస్. నంబర్ 61 ప్రకారం జారీ అయినట్లు సమాచారం. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఐఏఎస్, 2026 సెప్టెంబర్ 17న లేఖ నంబర్ ఈ/1301/2025 ద్వారా 40 ఎకరాల ప్రభుత్వ భూమికి ముందస్తు స్వాధీనం (అడ్వాన్స్ పొజెషన్) కల్పిస్తూ చర్యలు చేపట్టారు.రైతు విజ్ఞాన కేంద్రం కోసం పెబ్బేరు మండలం అయ్యవారిపల్లిలోని సర్వే నంబర్ 280లో 10 ఎకరాలు, 281లో 30 ఎకరాలు, 164లో 10 ఎకరాలు కలిపి మొత్తం 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అందులో 40 ఎకరాలకు ముందస్తు స్వాధీనం కల్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

### రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ రైతు విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ సలహాలు, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల మార్గదర్శకత్వం, శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి రానున్నాయి.జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపడంతో పాటు ఆధునిక సాంకేతికతను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ఈ కేంద్రం కీలకపాత్ర పోషించనుంది. రైతులకు అవసరమైన వ్యవసాయ విజ్ఞానం, నూతన సాగు పద్ధతులు, పంటలపై నిపుణుల సూచనలు అందించేందుకు ఇది ఉపయోగపడనుంది.

### ప్రభుత్వానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

వనపర్తి జిల్లా రైతుల అవసరాలను గుర్తించి రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, భూమి గుర్తింపు నుంచి ముందస్తు స్వాధీనం వరకు ప్రక్రియను వేగవంతం చేయడంలో ప్రత్యేక చొరవ చూపారు.ఈ సందర్భంగా రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి వారికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.వనపర్తి వ్యవసాయ రంగానికి రైతు విజ్ఞాన కేంద్రం కొత్త దిశానిర్దేశం చేయనుందని, రైతులకు ఆధునిక వ్యవసాయ విజ్ఞానం, సాంకేతిక సేవలు మరింత చేరువ కానున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### ఎమ్మెల్యేకు సన్మానం

ఈ సందర్భంగా ఆదివారం వనపర్తి నంది హిల్స్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో పెబ్బేరు మండల నాయకులు, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్షుడు యాపర్ల రామిరెడ్డి, అయ్యవారిపల్లి లక్ష్మణ్, వనపర్తి మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరె రాములు, కౌన్సిలర్లు శరవంద, పరుశురాం, చీర్ల జనార్ధన్, రవి యాదవ్, రఫీక్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఇందిరమ్మ ఇండ్ల మార్ట్‌గేజ్ రుణాలను రద్దు చేయాలి



**అమరచింత, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలి అని మండల కార్యదర్శి వర్గ సభ్యులు యస్. అజయ్ డిమాండ్ చేశారు. అమరచింతలోని ఐదో వార్డులో జరుగుతున్న సిసి రహదారుల నిర్మాణ పనులను సిపిఎం పార్టీ బృందం పరిశీలించడం జరిగింది. సిపిఎం నాయకులు ఎస్ ఈ శ్యామ్ సుందర్ యస్ విజయ్ ఏ.చందు ఎస్. రమేష్ ల బృందం పరిశీలించారు. మక్తల్ ఎమ్మెల్యే మంత్రివర్యులు వాకిటి శ్రీహరి మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రహదారుల పనులకు నిధుల మంజూరు తో పాటు వెంటనే పనులు చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సిసి రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో పాటు క్యూరింగ్ కూడా రోజువారీగా చెపట్టాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఐదో వార్డులో ఎన్నికల ప్రచారంలోభాగంగా మంత్రి నేరుగా హామీ ఇచ్చిన విధంగా 1980 లో125 ఇందిరమ్మ ఇండ్లకు ఒక్కో లబ్ధిదారుడు రెండు లక్షల రూపాయలు మాడ్గేజి రుణాలు చెల్లించాలని నోటీసులు రావడంతో ఈ సమస్యనుమంత్రి దృష్టికి తీసుకు రావడంతో అట్టి రుణాలు రద్దుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా అసంపూర్తిగా ఉన్న ఎస్సీ ఫంక్షన్ హాల్ భవనాన్ని కూడా పూర్తి చేయించే బాధ్యత తనదేనని మంత్రి మున్సిపల్ ఎన్నికల్లో5వ వార్డులో ప్రచారశీ సందర్భంగా హామీ ఇచ్చారని వాటి అమలు కుతగిన చర్యలు తీసుకోవాలనిగుర్తు చెశారు. నాలుగో వార్డ్ లోని అంబేద్కర్ భవనంను అధికారికంగా ప్రారంభించి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేయాలని కోరారు.

## వ్యవసాయ గోదాముల నిర్మాణానికి స్థల పరిశీలన



**మక్తల్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** మక్తల్ నియోజకవర్గ కేంద్ర శివారులో రైతుల సౌకర్యార్థం భారీ వ్యవసాయ గోదాముల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక ఆదేశాల మేరకు, మక్తల్ శివారులో గోదాముల ఏర్పాటు కోసం అనువైన స్థలాన్ని పరిశీలించినట్లు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కురి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. ఒక్కోటి 2,500 మెట్రిక్ టన్నుల చొప్పున, మొత్తం 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు గోదాములను ఇక్కడ నిర్మించనున్నట్లు వెల్లడించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను దాచుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో, అందరికీ అందుబాటులో ఉండే విధంగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. త్వరలోనే మంత్రి సమక్షంలో ఈ గోదాముల నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ?ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగం డి.ఈ. రాజు, ఏ.ఈ. రామాంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేలో లోటుపాట్లకు తావివ్వొద్దు

- రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి
- అదనపు కలెక్టర్ వినోద్‌కుమార్



**వనపర్తి, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** జిల్లాలో చేపడుతున్న సమగ్ర భూ రీ-సర్వే పనులను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామంలో కొనసాగుతున్న రీ-సర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులు, భూ యజమానులతో మాట్లాడి పంటలు, సాగు వివరాలను తెలుసుకున్నారు. రీ-సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే నోటీసుల ద్వారా రైతులకు తెలియజేయాలని సూచించారు. కో-రిలేషన్ రిజిస్టర్‌ను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని, ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సరిహద్దులు, సర్వే రాళ్ల గుర్తింపులో స్పష్టత ఉండేలా నిబంధనల ప్రకారం రాళ్లకు రంగులు వేయాలని ఆదేశించారు. జిల్లాలోని 15 మండలాలకు గాను 12 మండలాల్లో రీ-సర్వే పనులు ప్రారంభమయ్యాయని, రేవల్లి, ఆత్మకూర్, చిన్నంబావి మండలాల్లో మరో రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని తెలిపారు. తొలి విడతగా 70 గ్రామాల్లో సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పెబ్బేరు మండలం బూర్దిపాడు గ్రామంలో రీ-సర్వే పూర్తయిందని వెల్లడించారు.

# దేవాలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**మల్దకల్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** నడిగడ్డలో ఎంతో చరిత్ర గల ఆదిశిల క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు.ఆదివారం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణ మాన్య పట్వారి ప్రహల్లాదరావు ఆధ్వర్యంలో అర్చకులు, వాల్మీకి పూజారులు,కుల వృత్తులవారు,కార్యకర్తలు, గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ముఖ్యంగా దేవాలయం నుండి దేవరగట్టుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, 334 సర్వే నెంబర్లు 86 ఎకరాలు ప్రభుత్వ భూమి, 134లో 16 ఎకరాలు భూమి సద్వినియోగం చేయుటకు మాస్టర్ ప్లాన్ ప్రకారం దేవాలయ అభివృద్ధికి నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. డిసెంబర్ లోజరిగే శ్రీ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలకు దేవరగట్టు వరకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు దసరా పర్వదినం నుండే రోడ్డు పనులు ప్రారంభించాలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.శ్రీతిమ్మప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వంతో మాట్లాడి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ చిట్టెమ్మ గోపాలు,సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి,నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారాం రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, నరేందర్, వెంకటన్న, మధు, పరశురాముడు, ఉప్పరి నారాయణ, తిమ్మరాజు, నరసింహులు,తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఐదుగురు పట్టివేత..
- రూ.9,600 నగదు స్వాధీనం



**కోహిర్, అక్టోబరు 4 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కోహిర్ గ్రామ సమీపంలోని పట్లూర్ బేస్ వద్ద చింత చెట్టు కింద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. పోలీసులు అక్కడికి చేరుకునే సమయానికి ఐదుగురు వ్యక్తులు ఒకచోట చేరి పేకాట ఆడుతూ కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు పేకాటకు ఉపయోగిస్తున్న సామగ్రితో పాటు వారి వద్ద ఉన్న నగదును పరిశీలించారు. ఈ తనిఖీల్లో మొత్తం రూ.9,600 నగదు లభించడంతో పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో పేకాట, ఇతర జూద కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### పేకాటపై నిఘా

కోహిర్ మండల పరిధిలో పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు నిఘా పెంచినట్లు తెలుస్తోంది. నిర్మానుష్య ప్రాంతాలు, చెట్ల కింద, గ్రామ శివారుల్లో గుంపులుగా చేరి పేకాట ఆడుతున్న వారిపై సమాచారం సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి కార్యకలాపాలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పేకాటకు అలవాటు పడటం వల్ల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, వివాదాలు తలెత్తే అవకాశం ఉందని, యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండలంలో ఎక్కడైనా పేకాట లేదా జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## రైతుల విద్యుత్ కష్టాలకు మంత్రి జూపల్లి చొరవతో పరిష్కారం

- నిజామాబాద్ గ్రామానికి 24 గంటల కరెంట్



**వనపర్తి/పాన్‌గల్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** విద్యుత్ సమస్యపై నిజామాబాద్ గ్రామ రైతులు చేసిన ఆందోళనకు ఫలితం దక్కింది. రైతుల ఇబ్బందులను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు సబ్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా కొత్త ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామానికి నిరంతరంగా 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చింది. ఆదివారం మాజీ జెడ్పీటీసీ రవి ఆధ్వర్యంలో కొత్త ఫీడర్‌ను ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులకు కరెంటు అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని ఆందోళన



**కల్హేర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నాణ్యమైన 24 గంటల కరెంటు ఇవ్వకపోవడంతో సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ముట్టడించి ఆందోళనకు దిగారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా కావడం లేదని, వస్తున్న కరెంటు కూడా లోవోల్టేజీతో ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోవడంతో రిపేర్ల కోసం వేల రూపాయలు ఖర్చవుతున్నాయి. పంటలకు నీరు పెట్టలేక పొలాలు ఎండిపోతున్నాయి. వరి, పత్తి, పసుపు వంటి పంటలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు కరెంటు లేక నిస్సహాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనకు దిగామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యమైన 24 గంటల కరెంటు అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, రాంసింగ్, మాజీ జిల్లా కో ఆప్షన్ మెంబర్ ఆలీ, బి ఆర్ ఎస్ నాయకులు మరియు వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోండి



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు ఫారం-18 దరఖాస్తులు నింపి తమ ఓటును నమోదు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..“2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లందరూ తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలి. మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ల గొంతును శాసన మండలిలో వినిపించాలంటే ఓటు నమోదు తప్పనిసరి. ప్రతి గ్రాడ్యుయేట్ త్వరగా తమ ఓటును నమోదు చేసుకోవాలి. డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, పాస్ పోర్ట్ ఫోటోలు తప్పనిసరిగా జత చేయాలి. గడువు తేదీ లోపు అందరూ దరఖాస్తు చేసుకోవాలి. నిరక్షరాస్యుల కంటే అక్షరాస్యులైన పట్టభద్రుల పాత్ర ప్రజాస్వామ్యంలో కీలకం. విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలంటే మొదట ఓటు నమోదు చేసుకోవాలి. శ్రీరంగాపూర్ మండలంలోని యువత, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ముందుకు రావాలని, తమ తోటి పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పలువురు తమ ఫారం-18 దరఖాస్తులను అక్కడికక్కడే పూర్తి చేశారు. వనపర్తి జిల్లాలో 100% పట్టభద్రుల ఓటు నమోదే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు ఆర్ వెంకటస్వామి సీనియర్ నాయకులు పృథ్వీరాజ్,, షఫీ, సయ్యద్, శ్రీనివాస గౌడ్, కృష్ణయ్య, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు



**రేవల్లి, అక్టోబర్ 04 (జనం సాక్షి) :** రేవల్లి మండల కేంద్రంలో మాజీ జెడ్పిటిసి బోర్ల భీమన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో రేవల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు శివరాం రెడ్డి మాట్లాడుతూ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొత్తపల్లి అంగడి అభివృద్ధి శూన్యం

- ప్రజాధనం ఎటు పోతోంది?



**తాండూర్, అక్టోబర్ 04(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతి శనివారం నిర్వహించే అంగడి (సంత) పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మండలంలోనే అత్యధిక ఆదాయం తెచ్చిపెట్టే అంగడిగా దీనికి పేరున్నప్పటికీ, ఇక్కడి అభివృద్ధి మాత్రం పూర్తిగా శూన్యం అని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం జరిగే వేలం పాటల ద్వారా పంచాయతీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. కానీ, ఆ నిధులను అంగడి ఆధునీకరణకు ఎందుకు ఖర్చు చేయడం లేదో అర్థం కావడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు అంగడి ప్రాంతమంతా బురద గుంటలా మారుతోంది. కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడుతోంది. సాయంత్రం కాగానే అంగడి ప్రాంతంలో సరైన విద్యుత్ దీపాలు (లైట్లు) లేక చీకటి కమ్ముకుంటోంది. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత పెద్ద మేజర్ పంచాయతీలో అంగడికి వచ్చే ప్రజల కోసం కనీస తాగునీరు లేదా మరుగుదొడ్ల సౌకర్యం కూడా కరువైంది. "అంగడి ద్వారా వస్తున్న ఆదాయం అంతా ఎటు పోతుందో అధికారులకే తెలియాలి" అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కొత్తపల్లి శనివారం అంగడిని అభివృద్ధి చేసి, ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు, వ్యాపారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# అడవిలో పుట్టిన ఎర్ర సూరీడు

- నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆదిలాబాద్ పులి!
- 'జల్-జంగల్-జమీన్' అనే పొలికేకతో దండుకట్టి పోరుబాట సాగించిన ఆదివాసీ విప్లవ వీరుడు - 85 ఏళ్ల తర్వాత నెరవేరిందా భీం కల?
- కొమురం భీమ్ చరిత్రపై జనంసాక్షి ప్రత్యేక కథనం...



కెరమెరి అక్టోబర్ 4 (జనంసాక్షి) : **ఎక్కడ పీడన ఉంటుందో అక్కడే స్వేచ్ఛ కోసం గొంతుక లేస్తుంది, ఎక్కడ అణిచివేత ఉంటుందో అక్కడే తిరుగుబాటు మొదలవుతుంది. ఆ మాటకు నిలువెత్తు నిదర్శనమే కొమురం భీం..**

చారిత్రక ఆధారాల ప్రకారం 1901 అక్టోబర్ 22న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి అనే మారుమూల గిరిజన గూడెంలో గోండు దంపతులు కొమురం చిన్నూ, సోంబాయి లకు భీం జన్మించాడు. దట్టమైన అడవులు, కొండల మధ్య గోండు ఆచారాలతో బాల్యం గడిచింది. అప్పట్లో హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో ఉండేది. పండించే పంటకు, తినే తిండికి, తాగే నీటికి, చెట్ల ఆకులకు, ఫలాలకు కూడా 'శిస్తు' లేదా 'పట్టి' పేరుతో పన్నులు వసూలు చేసేవారు. తమదే అనుకున్న భూమి ఇతరుల పేరు మీద పట్టాగా మారిపోయేది.

భీంకు 15 ఏళ్ల వయసులోనే తొలి దెబ్బ తగిలింది. అటవీ శాఖ అధికారుల దాడిలో తండ్రి చిన్నూ మరణించాడు. ఆ విషాదంతో కుటుంబం కెరమెరి ఘాట్స్ ప్రాంతానికి వలస వెళ్లింది. అక్కడ ఆరుగాలం కష్టపడి పండించిన పంటను సిద్ధిఖీ అనే జాగీర్దార్ తనదంటూ దౌర్జన్యం చేశాడు. కౌలు చెల్లించాలని బెదిరించాడు. ఆగ్రహంతో భీం అడవి గొడ్డలితో సిద్ధిఖీపై దాడి చేయడంతో అక్కడికక్కడే మరణించాడు. నిజాం పాలనపై గిరిజనుల తొలి సాయుధ తిరుగుబాటుగా అది చరిత్రలో నిలిచింది.

### అస్సాంలో ఆయుధ శిక్షణ - అల్లూరి స్ఫూర్తి

సిద్ధిఖీ మరణం తర్వాత నిజాం పోలీసుల నుంచి తప్పించుకోవడానికి భీం మంచిర్యాలలో రైలెక్కి అస్సాం చేరాడు. పేరు, ఊరు, వేషం మార్చుకుని టీ ఎస్టేట్లలో పనిచేశాడు. అక్కడే వివిధ భాషలపై పట్టు సాధించాడు. అక్కడే తోటి కార్మికుడి ద్వారా మన్యం దొర అల్లూరి సీతారామరాజు పోరాట గాథలు విన్నాడు. ఆశయమే ఆయుధంగా బ్రిటీష్ వాళ్లపై అల్లూరి చేసిన పోరాటం భీంలో మళ్లీ స్ఫూర్తిని రగిలించింది.

### జోడేఘాట్ నుంచి 'జల్-జంగల్-జమీన్' నినాదం

తిరిగి సొంత గడ్డకు వచ్చిన భీం చూసింది మరింత దుర్భర పరిస్థితి. దీంతో 'జల్-జంగల్-జమీన్' అనే నినాదం ఎత్తుకున్నాడు. నీరు, అడవి, భూమిపై హక్కులు మావే, 'మా గూడెంలో మా రాజ్యం' అంటూ పోరుబాట పట్టాడు. జోడేఘాట్ కేంద్రంగా 12 గూడేలలో స్వయం పాలన ప్రారంభించాడు. అక్కడ నిజాం చట్టం చెల్లదు, భీం చట్టమే చెల్లుతుంది. గెరిల్లా యుద్ధంతో నిజాం సైన్యానికి చుక్కలు చూపించాడు. భూములిస్తామన్నా, పన్నులు ఎత్తేస్తామన్నా భీం లొంగలేదు.

### నమ్మక ద్రోహంతో నెత్తుటి దీపావళి

భీం ను నేరుగా ఎదుర్కోలేని నిజాం ప్రభుత్వం కుట్ర పన్నింది. భీం వద్ద సన్నిహితంగా మెలిగే కుర్దు పటేల్ సహాయం తీసుకుంది. 1940 అక్టోబర్ 27, ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి, దీపావళి రోజున అర్ధరాత్రి నిజాం సైన్యం జోడేఘాట్ ను చుట్టుముట్టి తూటాల వర్షం కురిపించింది. 39 ఏళ్ల వయసులోనే కొమురం భీం తన 12 మంది అనుచరులతో కలిసి వీరమరణం పొందాడు.

### ఆశయం నెరవేరిందా?

స్వాతంత్ర్యం వచ్చినా చరిత్రకారులు భీం త్యాగాన్ని పుస్తకాల్లో ఎక్కించలేదు. కానీ ప్రజలు గుండెల్లో దేవుడిగా కొలుచుకున్నారు. తెలంగాణ వచ్చాక ఆసిఫాబాద్ జిల్లాకు భీం పేరు పెట్టారు, జోడేఘాట్ లో మ్యూజియం, స్మారకం కట్టారు. ప్రతియేటా అక్టోబర్ నెలలో భీమ్ వర్ధంతి అధికారికంగా జరుగుతుంది. కానీ నేటికీ ఆదివాసి ఏజెన్సీ ప్రాంతాల్లో ఎకరాల పోడు భూములకు పట్టాలు లేవు. ఆదివాసీలు మౌలిక సౌకర్యాలు, విద్యా, వైద్యం,రోడ్డు,సదుపాయాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు.అంటే భీం కల ఇంకా పూర్తిగా నెరవేరలేదు. అయినా ఆయన రగిలించిన విప్లవ జ్యోతి ఇప్పటికీ ఆదివాసీ గుండెల్లో సజీవంగా మండుతూనే ఉంది.

# నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. కలెక్టరేట్‌లో సమీక్ష
- ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 04 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలో నేడు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు. మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక విభాగంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- అఖిలపక్షాలు ఐక్యంగా ఉద్యమించాలి
- డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 04 (జనం సాక్షి) :** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని ఏ-1 ఫంక్షన్ హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హాజరై, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం తన విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి.. అఖిలపక్షాల ఐక్యత వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేస్తూ, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఉదయం 10:00 గంటలకు వరంగల్ పోచం మైదాన్ చౌరస్తా నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ చౌరస్తా వరకు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల ఆధ్వర్యంలో భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు అయూబ్ గారు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించేలా పారదర్శకమైన విధానాలు ఉండాలని, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను కాపాడాలని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. అదేవిధంగా, బీజేపీ పాలనలో ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అయూబ్ గారు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం అఖిలపక్షాలు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ గారు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన వరంగల్ పోచంమైదన్ నుండి హన్మకొండ అంబేద్కర్ వరకు అఖిలపక్ష ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకునే ప్రభుత్వాలే ప్రజాస్వామ్యానికి అసలైన ప్రతినిధులని అన్నారు. అలాంటి పవిత్రమైన ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలు, పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తినా వాటిని ఎన్నికల సంఘం అత్యంత బాధ్యతగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల వ్యవస్థపైనే ప్రజలకు అనుమానాలు కలిగే పరిస్థితి రావడం బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలు, ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని, రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓటు అనేది ప్రతి భారతీయుడి రాజ్యాంగ హక్కు. ఆ ఓటును కాపాడటం ఎన్నికల సంఘం బాధ్యత. ప్రజల ఓటు హక్కుపై అనుమానాలు కలిగించే పరిస్థితులు ఏర్పడితే వాటిని నివృత్తి చేయాల్సిందే. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఏ ప్రయత్నాన్నీ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు" అని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు, నిరసనలు చేపడతామని తెలిపారు. ప్రజల ఓటు హక్కు, రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేరా కార్పొరేషన్ చైర్మన్ సంఘ్ వెంకటరాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరవి పరమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బస్మియా, సీపీఐ నాయకురాలు రత్నమాల, జిల్లా జాయింట్ కన్వీనర్ సయ్యద్ ఫైజుల్లా, టీడీపీ జిల్లా నాయకులు రఘు, అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ జిల్లా నాయకులు హకీమ్ నవీద్, తో పాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

- జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి వరంగల్ కె. మనోహర్
- 15 మంది వ్యాపారులపై కేసు నమోదు



**నర్సంపేట అక్టోబర్ 4 (జనంసాక్షి) :** నర్సంపేట పట్టణంలోని తూనికలు, కొలతల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా లీగల్ మెట్రోలజీ అధికారి కె. మనోహర్ హెచ్చరించారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని చేపలు, చికెన్, మాంసం, పండ్ల దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ధ్రువీకరణ చేయించుకోకుండా, శాఖ ముద్రలు వేయించుకోకుండా వినియోగిస్తున్న 15 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాపారులందరూ తమ తూకపు యంత్రాలు, ఇతర కొలతల పరికరాలను నిర్ణీత గడువులోగా తనిఖీ చేయించి అధికారిక ముద్రలు వేయించుకోవాలని సూచించారు. వినియోగదారులకు సరైన తూకంతో సరుకులు అందించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడితే తూనికలు, కొలతల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు సందర్భంగా తూకాలను పరిశీలించాలని సూచించారు.

# అమీనాబాద్ మోడల్ స్కూల్ హాస్టల్‌లో కొరవడిన సం'క్షేమం'.!

- అవస్థలు ఎదుర్కొంటున్న విద్యార్థినులు
- హాస్టల్ వార్డెన్, హెడ్ కుక్ లేక అనేక ఇబ్బందులు
- అసిస్టెంట్ కుక్ లు, నైట్ వాచ్‌మెన్‌ల మధ్య గొడవ
- పట్టించుకోని జిల్లా విద్యాశాఖ అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థినీల తల్లిదండ్రులు





**చెన్నారావుపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** నిరుపేద విద్యార్థుల సం'క్షేమం' కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని ఓవైపు ప్రభుత్వం, ప్రజాపాలకులు చెబుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు మాత్రం పెడచెవిన పెడుతూ విద్యార్థుల సం'క్షేమాన్ని' గాలికి వదిలేశారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్లో విద్యార్థినీలకు సంబంధించిన హాస్టల్లో వార్డెన్, హెడ్ కుక్ లేక విద్యార్థినీలు అనేక తంటాలు ఎదుర్కొంటున్నారు. అమీనాబాద్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీల సం'క్షేమం' కోసం ప్రభుత్వం హాస్టల్ ( వసతి గృహాన్ని ) ఏర్పాటు చేసింది. ఇందులో 100 మంది విద్యార్థినీలు ఉండాల్సి ఉండగా అమీనాబాద్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో చదువుతున్న 9, 10వ తరగతులు, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంకు చెందిన విద్యార్థినీలు 70 మంది మాత్రమే హాస్టల్లో ఉంటూ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని చూసుకోవడానికి హాస్టల్ వార్డెన్, ప్రతిరోజు వంటలు వండి పెట్టడానికి హెడ్ కుక్, ఇద్దరు అసిస్టెంట్ కుక్ లు, విద్యార్థుల సంరక్షణ చూసుకోవడానికి నైట్ వాచ్ మెన్, ఆరోగ్య బాగోగులు చూసుకోవడానికి ఏఎన్ఎం, హాస్టల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి స్కావెంజర్ లను జిల్లా విద్యాశాఖ అధికారులు నియమించారు. కానీ హాస్టల్ వార్డెన్ స్రవంతి ఆగస్టు 3వ తేదీన తనకు పెళ్లి కుదరడంతో రాజీనామా చేసి వెళ్లిపోగా హెడ్ కుక్ అమృత సైతం ఆగస్టు 20వ తేదీన రాజీనామా చేసి వెళ్లిపోయారు. అప్పటినుండి ఇప్పటివరకు హాస్టల్లో ఏఎన్ఎంగా పనిచేస్తున్న రోజా ఇన్చార్జి హాస్టల్ వార్డెన్ గా అదనపు సేవలు అందిస్తుంది. ఇద్దరు అసిస్టెంట్ కుక్ లు సమ్మక్క, మమత, నైట్ వాచ్ మెన్ మమత, స్కావెంజర్ వరలక్ష్మిలు హాస్టల్లో విధులను నిర్వర్తిస్తున్నారు.

### అసిస్టెంట్ కుక్ లు, నైట్ వాచ్ మెన్ ల మధ్య గొడవ

హాస్టల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ కుక్ లు, నైట్ వాచ్ మెన్ల మధ్య సెప్టెంబర్ 17వ తేదీన హాస్టల్ లో గొడవ జరిగినట్లు ప్రచారం జోరుగా కొనసాగుతుంది. ఛాయ చేసే విషయంలో ముగ్గురు గొడవ పడ్డట్లు తెలుస్తుంది. మరుసటి రోజు 18వ తేదీన ఇద్దరు అసిస్టెంట్ కుక్ లు విధులకు గైర్హాజరయ్యారని దీంతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వండి పెట్టేవారు లేక విద్యార్థినీలు అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని సమాచారం. చివరకు ఇన్చార్జి హాస్టల్ వార్డెన్ గా ఉన్న ఏఎన్ఎం రోజా ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతిల దృష్టికి తీసుకువెళ్లగా మండల విద్యాశాఖ అధికారిని పాపమ్మ మరుసటి రోజు 19వ తేదీన స్థానిక తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో వెంకటసాయి శివానంద్ లను వేరువేరుగా హాస్టల్ కు తీసుకువెళ్లి ఇద్దరు అసిస్టెంట్ కుక్ లు, నైట్ వాచ్ మెన్ లను మందలించినట్లు తెలిసింది. మరోసారి హాస్టల్లో గొడవ పడవద్దని అందరూ కలిసి సమన్వయంతో విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేయాలని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రతిరోజు మెనూ ప్రకారం విద్యార్థినీలకు వండి పెట్టాలని సూచించినట్లు తెలిసింది. ఏది ఏమైనా హాస్టల్లో పనిచేస్తున్న సిబ్బంది గొడవ పడిన విషయం చెన్నారావుపేట మండలంలో చర్చనీయాంశంగా మారింది.

### బఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థినీల తల్లిదండ్రులు

బహాస్టల్లో విద్యార్థినీల సంక్షేమం కొరవడిందని విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడం మూలంగానే హాస్టల్లో పనిచేస్తున్న వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని విద్యార్థినీల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ వార్డెన్, హెడ్ కుక్ ఇద్దరు రాజీనామా చేసి ఆగస్టు నెలలో వెళ్లిపోయారని రెండు నెలలు దాటినా కూడా ఇప్పటివరకు హాస్టల్ వార్డెన్, హెడ్ కుక్ పోస్టులను జిల్లా విద్యాశాఖ అధికారులు భర్తీ చేయకపోవడం న్యాయం కాదన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ సత్య శారద, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడులు ప్రత్యేక చొరవ తీసుకొని అమీనాబాద్ మోడల్ స్కూల్ లోని వసతి గృహంలో హాస్టల్ వార్డెన్, హెడ్ కుక్ పోస్టులను భర్తీ చేసి హాస్టల్లో సిబ్బంది మధ్య గొడవలు మరోసారి పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టి విద్యార్థినీల సంక్షేమం కోసం కృషి చేయాలని విద్యార్థినీల తల్లిదండ్రులు, పలువురు కోరుతున్నారు. ఈ విషయం పై తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీని వివరణ కోరగా హాస్టల్లో ఇద్దరు అసిస్టెంట్ కుక్ లు, నైట్ వాచ్ మెన్ల మధ్య ఛాయ చేసే విషయంలో గొడవ జరిగింది వాస్తవమేనని ఎంఈఓ పాపమ్మతో కలిసి వెళ్లి వారిని మందలించామని మరోసారి ఇలాంటి సంఘటనలు హాస్టల్లో పునరావృతం కావద్దని హెచ్చరించినట్లు తెలిపారు. విద్యార్థినీలకు మెనూ ప్రకారం ప్రతిరోజు భోజనాన్ని విధిగా అందించాలని సూచించినట్లు వివరించారు.

# కౌకొండ కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చి అన్యాయం చేశారు..

- పత్రికా సమావేశంలో వెల్లడించిన చుక్క నవీన్..




**నడి కూడ అక్టోబర్ 4 (జనం సాక్షి) :** నడికూడ మండలం కౌకొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు హామీ ఇచ్చి అన్యాయం చేశారని గ్రామానికి చెందిన చుక్క నవీన్ ఆరోపించారు. ఆదివారం నడికుడ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నందు పత్రిక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ పత్రిక సమావేశంలో చుక్క నవీన్ మాట్లాడుతూ గత సర్పంచ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోర్తాల రాజు .మేకల రఘుపతి. చుక్క కుమారస్వామి. సర్పంచ్ ఎన్నికలలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని అట్టి ఖర్చు మేమే భరిస్తామని అలాగైతే బి.ఆర్.ఎస్ పార్టీని ఓడించవచ్చుని హామీ ఇచ్చి నామినేషన్ వేయించడం జరిగిందని వేసినా అనంతరం పెట్టిన ఖర్చులు ఇవ్వకుండా నాపైనే దురుసుగా ప్రవర్తించడం జరిగిందని ఆరోపించారు. వారి ముగ్గురు వలన 36000 ఎన్నికలకు ఖర్చు పెట్టడం జరిగిందని తెలిపారు అదేవిధంగా నిరుపేదనైనా నాకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఒకవైపు నామినేషన్ వేయించి ఖర్చు పెట్టించారు మరోవైపు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే స్పందించి నాకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని తెలిపారు నాకు హామీ ఇచ్చి నాకు అన్యాయం చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని పత్రికా సమావేశంలో చుక్క నవీన్ తెలియజేశారు

# సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు

- పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటి విడుదల
- మంత్రి తుమ్మల వెల్లడి

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు చివరి తడికి నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు విడుదల చేస్తున్నామని చెప్పారు. పంటలు ఎండిపోకుండా అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సాగర్ ఆయకట్టుతోపాటు అశ్వారావుపేట, కొత్తగూడెం, పినపాక, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాలకు కూడా అదనంగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

**ఆయకట్టు, ప్రాజెక్టులకు నీరు..**

పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టుకు, అలాగే వైరా ప్రాజెక్టు, వెంగళరాయసాగర్ ప్రాజెక్టు, సింగభూపాలెం ప్రాజెక్టు, లంకాసాగర్ ప్రాజెక్టులకు కూడా గోదావరి జలాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా ప్రాజెక్టులు, చెరువుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించి సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

లిఫ్ట్‌లకు విద్యుత్ సరఫరా..

పంటలను కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను వినియోగించుకుంటున్నామని తుమ్మల తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములకు కూడా విద్యుత్ సరఫరా చేయనున్నట్లు



పేర్కొన్నారు. లిఫ్ట్‌ల ద్వారా అందుబాటులో ఉన్న నీటిని పొలాలకు అందించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాగర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే వేసిన పంటలకు చివరి తడి అందించడమే లక్ష్యంగా నీటి విడుదల చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. సాగర్ ఆయకట్టుతోపాటు పినపాక నియోజకవర్గంలోని తుమ్మల చెరువు ఆయకట్టు, వైరా, వెంగలరాయ సాగర్, సింగభూపాలెం, లంకాసాగర్ ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల పంటలను కాపాడేందుకు నీటి విడుదలతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు విద్యుత్ సరఫరా చేసి అన్ని విధాలుగా సహకరిస్తామని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## సంతోషిమాత ఆలయంపై దాడిని ఖండించిన భాజపా శ్రేణులు



**న్యాల్‌కల్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** హైదరాబాద్, దిల్ శుక్ నగర్ లోని సంతోషిమాత ఆలయంపై దాడిచేసిన నేపథ్యంలో మండల భాజపా అధ్యక్షుడు గంగ్వార్ మల్లేష్, పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించారు. శనివారం మండలంలోని గంగువార్ ప్రధాన కూడలి వద్ద ఖండిస్తూ, నిరసన తెలిపారు. సంతోషిమాత ఆలయంపై దాడి జరిగిన నేపథ్యంలో.. బాధ్యులైన దుండగులను వెంటనే అదుపులో తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనస్థలిలో స్థానిక పోలీసులు జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, విచారణ చేపట్టాలని, దాడికి పాల్పడ్డ అల్లరి మూకలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆలయ పురోహితులు, భక్తులకు ఎలాంటి విఘాతం కలగకుండా రక్షణ కల్పించాలన్నారు. ఆలయాలపై దాడులు పునరావృతం కాకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## ఏరియల్ వీడియోగ్రఫీలో భద్రాచలం యువకుడి జయకేతనం

- ఎలివేట్ - 2026లో ఎడ్వర్డ్ రాజుకు ప్రథమ స్థానం



**భద్రాచలం, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** సృజనాత్మకతకు సాంకేతికతను జోడిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని భద్రాచలానికి చెందిన గంజి ఎడ్వర్డ్ రాజు నిరూపించారు. డ్రోన్ వీడియోగ్రఫీలో తనకున్న నైపుణ్యంతో రూపొందించిన ఏరియల్ వీడియోకు ప్రతిష్టాత్మక 'ఎలివేట్ – 2026' పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. తద్వారా జాతీయ స్థాయి డ్రోన్ వీడియోగ్రఫీ వేదికపై భద్రాచలం పేరును నిలిపారు. గోదావరి తీర ప్రాంతంలో చిత్రీకరించిన వీడియోలో ప్రకృతి అందాలు, నదీ ప్రవాహం, తీర ప్రాంత వాతావరణంతో పాటు అక్కడ కనిపించిన మొసళ్ల కదలికలను ఎడ్వర్డ్ రాజు ప్రత్యేకమైన ఏరియల్ యాంగిల్స్? లో చిత్రీకరించారు. సహజ దృశ్యాలను ఆకట్టుకునే విధంగా చూపించడంతో ఈ వీడియోకు న్యాయనిర్ణేతల నుంచి మంచి స్పందన లభించింది. ఎడిట్ పాయింట్, పీపీఐఎన్ , డ్రోనిక ఇన్నోవేషన్స్? సంయుక్తంగా నిర్వహించిన 'ఎలివేట్ – 2026 డ్రోన్ ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ' పోటీల్లో సుమారు 200 మంది తమ ప్రతిభను ప్రదర్శించారు. నేచర్, కల్చర్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్, సెలబ్రేషన్, అవాటా 360, ఎఫ్ పీవీ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి. వివిధ కేటగిరీల్లో ప్రతిభ చూపిన 30 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. ఏరియల్ వీడియోగ్రఫీ–నేచర్ విభాగంలో ఎడ్వర్డ్? రాజు రూపొందించిన వీడియో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్ ఎస్ కన్వెన్షన్స్ లో అక్టోబర్ 2 నుంచి 4 వరకు జరిగిన 'ఫొటో ట్రేడ్ ఎక్స్ పో–హైదరాబాద్ 2026'లో విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ రాజుకు ప్రథమ స్థానానికి సంబంధించిన సర్టిఫికెట్ ను అందజేయడంతో పాటు 'బెస్ట్ డ్రోన్ వీడియోగ్రాఫర్ 'గా భారత్ కళా పురస్కార్ – 2026 ట్రోఫీని ప్రదానం చేశారు. డ్రోన్ టెక్నాలజీని సృజనాత్మకంగా వినియోగించి ప్రత్యేక గుర్తింపు సాధించిన ఎడ్వర్డ్ రాజును భద్రాచలం ప్రాంతానికి చెందిన పలువురు అభినందించారు.

## ఐటీసీ ఉద్యోగాలు, వ్యాపారాల పేరుతో రూ.10 కోట్లకు పైగా మోసం

- ఉద్యోగాలు, కాంట్రాక్టులు ఇప్పిస్తామని నమ్మించి భారీగా వసూళ్లు.
- కేసు నమోదు చేసిన పోలీసులు.

**భద్రాచలం, అక్టోబరు 4 (జనంసాక్షి) :** ఐటీసీ పేపర్‌బోర్డులో ఉద్యోగాలు, కాంట్రాక్టు పనులు ఇప్పిస్తామని.. వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.10.21 కోట్లకు పైగా నగదు, 30 తులాల బంగారు ఆభరణాలు కాజేసి మోసం చేసిన ఘటన భద్రాచలంలో వెలుగుచూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు భద్రాచలం టౌన్ పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన సింగలదేవి వేంకటరమణ ఫిర్యాదు మేరకు భేతంపూడి భరత్‌కుమార్, భేతంపూడి రాజేశ్వరి, నక్కా సత్యనారాయణ, శబరీష్ సుబ్రహ్మణ్యన్, భేతంపూడి శ్రీవిద్యలపై కేసు నమోదైంది. ఐటీసీలో ఉద్యోగాలు, కాంట్రాక్టు పనులతో పాటు శ్రీ సూర్యప్రియ ఇంజనీరింగ్ వర్క్స్, బీకే నాయుడు అండ్ కో సంస్థల్లో పెట్టుబడులు పెడితే నెలకు మూడు శాతం లాభాలు ఇస్తామని నమ్మించి బాధితుడి నుంచి రూ.10,21,33,284 వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా కుటుంబ వేడుకల పేరుతో 30 తులాల బంగారు ఆభరణాలను కూడా తీసుకున్నట్లు తెలిపారు. కొంతకాలం లాభాలు చెల్లించిన నిందితులు అనంతరం వాటిని నిలిపివేయడంతో బాధితుడు తన నగదు, బంగారం తిరిగి ఇవ్వాలని కోరాడు. దీంతో నిందితులు ఇళ్లకు తాళాలు వేసి, ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ వి.సతీష్ దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు భరత్‌కుమార్‌పై ఇప్పటికే లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ కేసులో అరెస్టయిన అతడు ప్రస్తుతం భద్రాచలం సబ్‌జైలులో ఉన్నట్లు వెల్లడించారు.

## ఆన్‌లైన్ లోన్‌యాప్ పేరుతో రూ.1.12 లక్షలు కాజేత

- ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులు
- భయంతో విడతల వారీగా డబ్బులు చెల్లించిన వ్యాపారి
- కేసు నమోదు చేసిన పోలీసులు

**భద్రాచలం, అక్టోబరు 4 (జనంసాక్షి) :** ఆన్‌లైన్ లోన్ యాప్ మాయలో పడిన ఓ వ్యాపారి సైబర్ నేరగాళ్ల వేధింపులకు గురై ఏకంగా రూ.1.12 లక్షలు నష్టపోయాడు. రుణం పేరుతో ప్రారంభమైన వ్యవహారం చివరకు ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు దారితీసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీకి చెందిన కొటిపల్లి రాజేష్ (36)కు వాట్సాప్‌లో ఓ లింక్ వచ్చింది. ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో 'లోన్ మిత్ర' పేరుతో ఉన్న యాప్ ఆయన మొబైల్‌లో డౌన్‌లోడ్ అయింది. అనంతరం యాప్ నిర్వాహకులు రుణం ఇప్పిస్తామంటూ రాజేష్‌తో సంప్రదింపులు జరిపినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కొంతకాలానికి సైబర్ నేరగాళ్లు రాజేష్ ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన రాజేష్ వారి మాటలను నమ్మి డబ్బులు చెల్లించడం ప్రారంభించాడు. ఏప్రిల్ 1 నుంచి 11వ తేదీ వరకు పలు విడతల్లో ఫోన్‌పే ద్వారా మొత్తం రూ.1,12,351 చెల్లించాడు. అయినప్పటికీ సైబర్ నేరగాళ్ల వేధింపులు ఆగకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన రాజేష్ వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశాడు. అనంతరం భద్రాచలం టౌన్ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డబ్బులు ఏ ఖాతాలకు బదిలీ అయ్యాయి, నిందితులు ఎవరు, యాప్ వెనుక ఉన్న వ్యక్తుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. అపరిచిత లోన్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత ఫొటోలు, బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు వంటి సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని సూచిస్తున్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు సమాచారం అందించాలని పోలీసులు కోరుతున్నారు.

## మునగాలలో రూ.9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు

- 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ



**సూర్యాపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలోని 1029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల మాదారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ వంటశాల ద్వారా సూర్యాపేట జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.

## పలు సిసి, బీటీ రోడ్లకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**ఎర్రుపాలెం, సెప్టెంబర్ 4 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు. మండలంలోని ఎరుపాలెం రేమిడిచర్ల రామాపురం అంతర్గత సిసి రోడ్లకు బిటి రహదారులకు శంకుస్థాపన చేశారు ఎరుపాలెం నుండి జయంతి వరకు నిర్మించనున్న రోడ్డు కు శంకుస్థాపన చేసిన అనంతరం ఎరుపాలెం నుండి రేమిడిచర్ల, రామాపురం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనకు వెళుతున్న డిప్యూటీ సీఎం మధిర ఎమ్మెల్యే బట్టి విక్రమార్క కారును ఎరుపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ వాసులు తమకు సీసీ రోడ్లు త్రాగు నేటి సమస్యలు పలు మౌలిక వసతుల సమస్యలపై రోడ్డుపై అడ్డుకొని కారుని అడ్డుకొని ఆపగా డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క తమ సమస్యలు తెలుసుకునేందుకు కారు దిగి కాలనీవాసుల విన్నపం మేరకు ఎన్టీఆర్ కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.త్వరలో వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం రేమిడిచర్ల, ఎస్సీ కాలనీ సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు.రామాపురం రామాపురం నుండి కొత్తపాలెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.రేమిడిచర్ల గ్రామంలో సర్పంచి కాపు వరప్రసాద్ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను గజమాలతో సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ జిల్లా అధికారులు మండల అధికారులు వివిధ శాఖల అధికారులు, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ మట్టి బిడ్డల స్ఫూర్తితోనే జనసేన ఆవిర్భావం



**చౌటుప్పల్, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** తెలంగాణ మట్టి బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే పవన్ కల్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ తెలంగాణ గడ్డపై ఆవిర్భవించిందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నీళ్లు, నిధులు, నియామకాల కోసం సుమారు 1,200 మంది యువత బలిదానాలు చేశారని గడల శ్రీనివాసరావు గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. యువతకు ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2,500, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపడతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. పార్టీ సభ్యత్వ నమోదులో అత్యధిక సంఖ్యలో సభ్యులను చేర్పించిన వివిధ నియోజకవర్గాల నాయకులను వేదికపై ఘనంగా సన్మానించారు.

**జనసేనకు రూ.లక్ష విరాళం**

జనసేన ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం రూ.లక్ష విలువైన చెక్కును విరాళంగా అందజేశారు. ఒక ఆశయం, లక్ష్యం, సిద్ధాంతంతో పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేనకు పట్టభద్రులు అండగా నిలిచి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన తెలంగాణ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్ము రెడ్డి ప్రేమ్‌కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్, మామిడాల రమేశ్, శ్రీకాంత్, లింగస్వామి, బద్రి రాజు, పాండు, ప్రవీణ్, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## వెన్నవల్లి గుట్ట వద్ద ప్రమాదం

- జెసిబిపై భారీగా జారిపడిన మట్టి చర్యలు
- డ్రైవర్ మృతి



**కల్లూరు, అక్టోబర్ 4 (జనం సాక్షి) :** కల్లూరు మండల పరిధిలోని వెన్నవెల్లి గ్రామ శివారునగల గుట్ట వద్ద జెసిబితో మట్టి తవ్వకాలు చేపడుతున్న నేపథ్యంలో ఒక్కసారిగా పై మట్టి చర్యలు జారిపడి డ్రైవర్ మృతి చెందిన ప్రమాద సంఘటన శనివారం రాత్రి జరిగింది. సంఘటనా సమాచారం తెలుసుకున్న రెవెన్యూ పోలీస్ అధికారులు మృతదేహాన్ని బయటకు తీసేందుకు మూడు ఇతర జెసిబి లతో సహాయక చర్యలు చేపట్టారు.కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి--వెన్నవల్లి గ్రామాల మధ్య ఉన్న వెన్నవల్లి గుట్ట చుట్టూ సొరంగం తరహాలో తవ్వకాలు చేపట్టిన సమయంలో ఒక్కసారిగా మట్టి కుప్పకూలడంతో అక్కడ పనిచేస్తున్న జేసీబీ డ్రైవర్ ఏలూరు రవి మట్టిలో చిక్కుకుని దుర్మరణం చెందినట్లు స్థానికులు తెలిపారు.వెన్నవల్లి గుట్ట వద్ద గత కొంతకాలంగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో తవ్వకాలు కొనసాగుతున్నాయని పలుమార్లు ఆందోళన వ్యక్తం చేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు.

వెన్నవల్లి గుట్ట కొండచుట్టు సొరంగరం లాగా మట్టి తవ్వకాలు చేపడుతుండంతో గుట్టకుప్పకూలి మట్టి పడటంతో జెసిబి డ్రైవర్ మృతి చెందాడు దీనికి బాధ్యులు ఎవరు అంటూ ప్రశ్నిస్తున్నారు. సంఘటనపై మైనింగ్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, భద్రతా నిబంధనల అమలు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి సమాచారంతో వివరాలు సేకరించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గుట్ట నుంచి మట్టి తవ్వకాలు చేపడుతూ వివిధ ప్రాంతాలకు టిప్పర్లలో మట్టిని తరలిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్న గుట్ట నిర్వాహకులపై చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి భరోసా కల్పిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...

జెసిపి పై పెద్ద ఎత్తున పడిన గుట్ట మట్టి, రాళ్లను తొలగించేందుకు నిర్వాకుల చేత భారీ జెసిబిలను తీసుకొచ్చి 10 గంటల పాటు స్థానిక ఎస్సై డి హరిత, రూరల్ సీఐ ముత్తులింగయ్య పర్యవేక్షణలో శ్రమించి రెవెన్యూ పోలీస్ అధికారులు డెడ్ బాడీని ఆదివారం తెల్లవారుజామున బయటకు తీశారు. ఆదివారం పోలీసులు కల్లూరు లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్కు పోస్టుమార్టం నిమిత్తం డెడ్ బాడీని తరలించారు.మహబూబాద్ జిల్లా డోర్నకల్లు మండలం మల్లెగూడెం గ్రామానికి చెందిన జెసిబి ఆపరేటర్ ఏలూరు రవి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన కల్లూరుకు తరలివచ్చారు. పోస్టుమార్టం అనంతరం పోలీసులు భౌతిక దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి హరిత తెలిపారు.

## డంపింగ్ యార్డు ప్రభావంతో అసహజ మరణాలపై ఉద్యమం

- బొల్లం కృష్ణకు నివాళులర్పించిన డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ

**జవహర్‌నగర్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో అనారోగ్యాలతో ప్రజలు మృత్యువాత పడుతున్నారని, ఈ పరిస్థితిపై ప్రజా ఉద్యమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ నేతలు తెలిపారు. గబ్బిలాలపేటలో సెప్టెంబర్ 26న అనారోగ్యంతో మృతి చెందిన బొల్లం కృష్ణకు ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యుల బాధను చూసి పలువురు భావోద్వేగానికి గురయ్యారు. డంపింగ్ యార్డు నుంచి వెలువడే



విషవాయువుల ప్రభావాన్ని వెంటనే నివారించాలని, ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచిత వైద్యం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బొల్లం కృష్ణ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ షేక్ షావలి, కో–కన్వీనర్లు గడ్డం సదానందం, గడిపే సునీత, కొన్నెవేణు, శారద, జ్యోతి, శ్రీదేవి, వసంత, అల్లూరి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమ ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- 216 మందికి రూ.1.02 కోట్ల ఆర్థిక సాయం
- కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ఖమ్మం రూరల్, అక్టోబరు 4 (జనం సాక్షి) :** పేద, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 51 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు రూ.50.05 లక్షలు అందజేశారు. అలాగే ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన 70 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.23.66 లక్షలు, ఖమ్మం రూరల్ మండలంలోని 95 మంది లబ్ధిదారులకు రూ.28.79 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తంగా 216 మంది లబ్ధిదారులకు రూ.1.02 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందింది. సీఎంఆర్ఎఫ్ ద్వారా 165 మందికి రూ.52.45 లక్షల మేర లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం చేయించుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజా ప్రభుత్వంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు



తీసుకుంటున్నామని తెలిపారు. గత పాలకుల కంటే మరింత విస్తృతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఏదులాపురం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్‌నాయక్,జిల్లా నాయకులు మద్ది మల్లా రెడ్డి ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఈఎంఐలు భారం కానున్నాయా?..

### ఆర్‌బీఐ వడ్డీ రేట్లు పెంచే ఛాన్స్




**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలకమైన రెపోరేటును పెంచే అవకాశం ఉంది. అక్టోబర్ నెల ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును 0.25 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు, బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితుల కారణంగా నెలకొన్న ద్రవ్యోల్బణ భయాలకు తోడు, ఇతర కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు సవరిస్తుండడమే ఇందుక్కారణమని పేర్కొంటున్నారు. ఒకవేళ విశ్లేషకులు ఊహించినట్లే ఆర్‌బీఐ వడ్డీ రేట్లు సవరిస్తే.. రెపోరేటుతో ముడిపడి ఉన్న గృహ, వాహన రుణాలు ప్రియం కానున్నాయి. ఆ మేర నెలవారీ చెల్లించే ఈఎంఐలు భారం కానున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచింది. దీంతో అప్పట్లో రెపోరేటు 6.50 శాతానికి చేరింది. ఆపై 2023-24లో స్థిరంగా కొనసాగించింది. 2025లో వరుసగా వడ్డీ రేట్లు తగ్గించిన ఆర్‌బీఐ.. పశ్చిమాసియా పరిస్థితుల నేపథ్యంలో స్థిరంగా కొనసాగిస్తోంది. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అక్టోబర్ నెలకు సంబంధించిన ఎంపీసీ భేటీలో రెపోరేటుపై నిర్ణయం తీసుకోనుంది. బుధవారం నిర్ణయం వెలువడనుంది.ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులతో సమానంగా ఆర్‌బీఐ కూడా వడ్డీ రేట్లు సవరించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వృద్ధి ఊపందుకోవడం వంటివి ఇందుకు కారణాలని చెబుతున్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో మరోసారరి ఉద్రిక్తతలు తలెత్తడం వల్ల ఇంధనం, కమొడిటీ ధరలు పెరుగుతున్నాయని, దీనివల్ల మరోసారి రెపోరేటు పెంచొచ్చని అభిప్రాయపడుతున్నారు. పీటీఐ నిర్వహించిన పోల్‌లో మెజారిటీ ఆర్థిక నిపుణులు ఇదే తరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. అయితే, మరోసారి స్టేటస్ కో కొనసాగించే అవకాశమూ లేకపోలేదని మరో ఆర్థికవేత్త అభిప్రాయపడ్డారు. డిమాండ్ ఆధారిత ద్రవ్యోల్బణం ఇంకా ఊపందుకోని కారణంగా మరికొంతకాలం వేచి చూసే ధోరణిని ఆర్‌బీఐ అవలంబించొచ్చని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# పాత ప్రీమియం కార్లను కొనేద్దాం

### మారుతున్న యువత ధోరణి




**హైదరాబాద్:** విలాసవంతమైన కారు కొనాలంటే కొత్తదే కావాలన్న భావన క్రమంగా మారుతోంది. ఖరీదైన ప్రీమియం వాహనాలను సొంతం చేసుకోవాలనుకునే యువత.. కొత్త కార్లకు బదులుగా వాడిన (ప్రీ-ఓన్డ్) లగ్జరీ కార్లను ఎంచుకుంటోంది. కొత్త కార్ల ధరలు గణనీయంగా పెరగడం, యువతలో పెరుగుతున్న ఆకాంక్షలు ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ప్రీమియం వాహనాల విభాగంలోకి అడుగుపెట్టేందుకు ప్రీ-ఓన్డ్ కార్లు అనుకూలమైన మార్గంగా మారుతున్నాయి. ప్రస్తుతం ఈ విభాగంలోని కొనుగోలుదారుల సగటు వయసు 35-40 ఏళ్ల మధ్య ఉంది. పాత లగ్జరీ కార్ల విపణి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్థంలో దాదాపు 21 శాతం పెరిగింది. అదే సమయంలో అమ్ముడైన వాహనాల సగటు ధర (ఏఎస్‌పీ) 25 శాతం పెరిగింది. అధిక విలువ కలిగిన మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆదరణ పెరుగుతోందని మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి.పాత లగ్జరీ కార్ల విపణిలో రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల ధరల శ్రేణి కీలకంగా మారింది. ఈ బడ్జెట్‌లో ప్రీమియం బ్రాండ్లకు చెందిన పెద్ద కార్లు, మెరుగైన ఫీచర్లు ఉన్న మోడళ్లు అందుబాటులోకి రావడం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. కొత్త లగ్జరీ కారుతో పోలిస్తే తక్కువ ధరకు ప్రీమియం అనుభూతిని పొందే అవకాశం లభిస్తోంది. ఇక సెడాన్లతో పోలిస్తే ఎస్‌యూవీలకు గిరాకీ ఎక్కువగా కనిపిస్తోంది. విశాలమైన స్థలం, మెరుగైన ప్రయాణ అనుభూతి, అధిక గ్రౌండ్ క్లియరెన్స్, రోజువారీ వినియోగానికి అనుకూలత వంటి అంశాలూ వీటి ఆదరణకు కారణమవుతున్నాయి. పెట్రోల్ వాహనాలతో పోలిస్తే డీజిల్ మోడళ్లకూ కొనుగోలుదారుల నుంచి ఆసక్తి కనిపిస్తోంది.

**బ్రాండ్ ఒక్కటే కాదు..**

ప్రీ-ఓన్డ్ లగ్జరీ కారును కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు కేవలం బ్రాండ్ పేరునే పరిగణనలోకి తీసుకోవడం లేదు. వాహనం తయారైన సంవత్సరం, ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకూ జరిగిన సర్వీసింగ్, ప్రమాదాల చరిత్ర, మిగిలిన వారంటీ, నిర్వహణ వ్యయం వంటి అంశాలనూ పరిశీలిస్తున్నారు. కారులోని ఫీచర్లు, సాంకేతిక వివరాలతోపాటు, భవిష్యత్తులో తిరిగి విక్రయిస్తే వచ్చే విలువపైనా దృష్టి పెడుతున్నారు. అంటే, విలువకు తగ్గ ప్రయోజనమూ లగ్జరీ కార్ల కొనుగోలు నిర్ణయంలో ప్రధానంగా మారింది.

**ఈవీ.. బ్యాటరీపై సందేహాలు**

వాడిన లగ్జరీ విద్యుత్ కార్లపైనా ఆసక్తి పెరుగుతోంది. కొన్ని కొత్త లగ్జరీ ఈవీల విలువ వేగంగా తగ్గుతుండటంతో, కొత్త మోడళ్లూ పాత కార్ల విపణిలో ఆకర్షణీయమైన ధరలకు లభిస్తున్నాయి. దీంతో మంచి నిర్వహణ ఉన్న ఈవీలకు గిరాకీ పెరుగుతోంది. ఈ విభాగంలోనూ సవాళ్లున్నాయి. బ్యాటరీ ఆరోగ్యం, ఉపయోగించగల సామర్థ్యం, బ్యాటరీ మార్పిడి ఖర్చు, మిగిలిన వారంటీ, పాత మోడళ్ల ప్రయాణ పరిధి, భవిష్యత్తులో అమ్మగలమా? వంటి అంశాలపై కొనుగోలుదారులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వాడిన ఈవీని కొనుగోలు చేసేముందు బ్యాటరీయే కీలకంగా మారుతోంది. మరోపక్క గిరాకీ ఉన్నప్పటికీ.. వాటి సరఫరా మాత్రం ఇంకా పరిమితంగానే ఉంది.

**పండగల వేళ..**

దసరా, దీపావళి పండగల సీజన్ వస్తుండటంతో పాత లగ్జరీ కార్ల విక్రయాలు బలంగా ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా నిర్వహణ బాగుండి, తక్కువగా తిరిగిన ఎస్‌యూవీలకు గిరాకీ పెరిగే అవకాశం కనిపిస్తోంది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో అమ్మకాలు దాదాపు 30 శాతం పెరిగే అవకాశం ఉందన్న అంచనాలున్నాయి. ఇందులోనూ వ్యవస్థీకృత కార్ల విపణి నుంచే కొనుగోలు చేసేందుకు యువత మొగ్గు చూపిస్తోంది. సులభంగా రుణం లభించడం, విక్రయానంతర సేవలు అందుబాటులో ఉండటంతో ఈ మార్కెట్‌పై నమ్మకం పెరుగుతోంది.

## 7 శాతం పెరిగిన ఇళ్ల ధరలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశ వ్యాప్తంగా 7 ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు జులై-సెప్టెంబరు త్రైమాసికంలో సగటున 7% పెరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్, దిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై, కోల్‌కతా ఈ నగరాల్లో ఉన్నాయి. వీటిలో దిల్లీ-ఎన్‌సీఆర్‌లో అత్యధికంగా 12% వార్షిక వృద్ధి నమోదైంది. నిర్మాణ వ్యయాలు పెరగడం, డెవలపర్లు విలాసవంతమైన ప్రాజెక్టులపై దృష్టి సారించడం ఇందుకు కారణాలని స్థిరాస్తి సేవల సంస్థ అనరాక్ తెలిపింది. గతేడాది ఇదే కాలంలో 7 ప్రధాన నగరాల్లో నివాస గృహాల సగటు ధర చదరపు అడుగుకు రూ.9,105 ఉండగా, ఈ ఏడాది ఇది రూ.9,714కు చేరింది. దిల్లీ-ఎన్‌సీఆర్‌లో 2025 మూడో త్రైమాసికంలో రూ.8,900గా ఉన్న సగటు ధర, ఈ ఏడాది జులై-సెప్టెంబరులో రూ.9,980కి చేరింది. కరోనా తర్వాత భూముల ధరలు, ముడిసరకులు సహా నిర్మాణ ఖర్చులు పెరగడంతో అన్ని ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు గణనీయంగా పెరిగాయని అనరాక్ వైస్ ఛైర్మన్ సంతోష్ కుమార్ తెలిపారు. దిల్లీ-ఎన్‌సీఆర్‌లో నోయిడా, గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్‌లలో భూముల ధరలు భారీగా పెరిగాయని, అక్కడి పట్టణాభివృద్ధి సంస్థలు నిర్వహించిన వేలాల్లో ఇది ప్రతిబింబించిందని ఆయన పేర్కొన్నారు. స్థిరాస్తి డెవలపర్లు ప్రస్తుతం ప్రీమియం, లగ్జరీ, అల్ట్రా-లగ్జరీ ఇళ్లపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితుల్లో మార్పులున్నా.. సెప్టెంబరు త్రైమాసికంలో నివాస స్థిరాస్తి మార్కెట్ పనితీరు బాగుందని ఆల్ఫా కార్ప్ డెవలప్‌మెంట్ సీఈఓ, డైరెక్టర్ ఆశిష్ సరీన్ తెలిపారు. ఇళ్లను కేవలం పెట్టుబడి సాధనంగా కాకుండా, దీర్ఘకాలిక అవసరంగా కొనుగోలుదారులు భావిస్తున్నారని చెప్పారు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.10 | ₹ 5.12 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,57,755 (22 క్యారెట్లు) | ₹ 1,72,094 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,45,000

## ధరలు పెరిగినా.. పండగకు డిమాండ్ ఎక్కువే

### : ఎలక్ట్రానిక్ కంపెనీలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
పండగ సీజన్‌కు ముందు ఏసీ, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాల ధరలను ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలు 5 నుంచి 7 శాతం పెంచిన విషయం తెలిసిందే. అక్టోబర్ 1 నుంచి ఆయా ధరలు అమల్లోకి వచ్చాయి. ధరలు పెరిగినప్పటికీ.. దసరా, దీపావళి సీజన్‌లో ఉత్పత్తుల విక్రయాల్లో రెండంకెల వృద్ధిని నమోదు చేస్తామని సదరు కంపెనీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. వినియోగదారులు ప్రీమియం మోడళ్ల కోసం ఈఎంఐ ఆప్షన్లను ఎంచుకోవడం, రీప్లేస్‌మెంట్ వంటి ప్రత్నామ్నాయ ఆప్షన్లు డిమాండ్‌ను పెంచుతాయని విశ్వసిస్తున్నారు. విలువ పరంగా 15 నుంచి 35 శాతం వరకు వృద్ధి నమోదు చేస్తామని ప్రముఖ సంస్థల అధిపతులు వార్త సంస్థ పీటీఐకు తెలిపారు. ఏసీ, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాల ధరలు పెరిగినా.. పండగ సీజన్‌లో రెండంకెల వృద్ధిని నమోదు చేస్తామని హైమర్ సంస్థ అధ్యక్షుడు ఎన్ఎస్ సతీష్ అన్నారు. విలువ పరంగా 30-35 శాతం వృద్ధిని నమోదు చేస్తామన్నారు. దాదాపు 20 శాతం వరకు అధిక యూనిట్లను విక్రయిస్తామన్నారు.పండగ సీజన్‌లో తమ ఉత్పత్తులకు డిమాండ్ అధికంగానే ఉంటుందని ఎల్‌జీ ప్రతినిధి తెలిపారు. కొత్త గృహోపకరణాల కొనుగోలుకు దసరా వేదిక అవుతుందన్నారు. రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్ వైపు కాకుండా డిష్‌వాషర్స్, మైక్రోవేవ్స్ తదితర ఉత్పత్తుల కొనుగోలుకు కూడా డిమాండ్ ఎక్కువే ఉంటుందన్నారు.ఉత్పత్తుల విలువపరంగా దాదాపు 15-20 శాతం డిమాండ్ ఉంటుందని సోనీ ఇండియా డైరెక్టర్ సునీల్ నయ్యర్ అన్నారు. ప్రీమియం టీవీ మోడళ్లకు కొనుగోలుదారులు మొగ్గుచూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎయిర్ కండీషనర్స్, రిఫ్రిజిరేటర్ల విక్రయాలకు పండగ సీజన్‌లో అధిక డిమాండ్ ఉంటుందని గ్రోద్రేజ్ అప్లయన్సెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కమల్ నంది అన్నారు. ఓనం పండగకు తమ ఉత్పత్తులకు మంచి స్పందన వచ్చిందని, అదే డిమాండ్ దసరా, దీపావళిలోనూ కొనసాగుతుందన్నారు.

# పసిడికి 'నకిలీ' హాల్‌మార్క్ ముప్పు

### ఛార్జీల పెంపుతో మోసాలకు అవకాశం

### ఆందోళన వ్యక్తం చేస్తున్న జీజేసీ

**జనంసాక్షి:**ఏదైనా పసిడి ఆభరణం కొనుగోలు అనంతరం, స్వచ్ఛత ధ్రువీకరణకు హాల్‌మార్కింగ్ చిహ్నాలను పరిశీలించాల్సి ఉంటుంది. హాల్‌మార్కింగ్ ఉంది కదా అని దానిని యాప్‌లో చెక్ చేసుకోకపోతే కొనుగోలుదార్లు మోసపోయే ప్రమాదం లేకపోలేదు. ఒక్కో బంగారు ఆభరణానికి హాల్‌మార్కింగ్ ధ్రువీకరణ ఇచ్చేందుకు ఛార్జీని రూ.45 నుంచి రూ.75కి భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) పెంచింది. అయితే వెండి ఆభరణాల హాల్‌మార్కింగ్ ఛార్జీలో మార్పు చేయకుండా, ఆభరణానికి రూ.35గానే వసూలు చేస్తున్నారు. బంగారు ఆభరణాల హాల్‌మార్కింగ్ ఛార్జీని పెంచడం వల్ల, స్వచ్ఛత ధ్రువీకరణ కోసం అస్సేయింగ్/హాల్‌మార్కింగ్ కేంద్రానికి వెళ్లకుండా కొందరు అక్రమార్కులు/వ్యాపారులు నకిలీ హాల్‌మార్కింగ్ స్టాంపులను సృష్టించి, వినియోగదారులను మోసగించే ప్రమాదం ఉందని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) హెచ్చరిస్తోంది. ప్రతి ఆభరణానికి ముద్రిస్తున్న హాల్‌మార్క్ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (హెచ్‌యూఐడీ) గురించి కొనుగోలుదార్లకు అవగాహన లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోందని వివరించింది.దేశంలోని దాదాపు 800 జిల్లాల్లో 10% ప్రాంతాల్లో మాత్రమే హాల్‌మార్కింగ్, బీఐఎస్ కేర్ మొబైల్ యాప్ ద్వారా హాల్‌మార్క్ ప్రత్యేక



గుర్తింపు (హెచ్‌యూఐడీ) సంఖ్యను తనిఖీ చేసుకునే అవగాహన ఉందని జీజేసీ ఛైర్మన్ రాజేష్ రోక్డే తెలిపారు. ముఖ్యంగా చిన్న నగరాలు-పట్టణాలు-గ్రామీణ వినియోగదారులకు దీనిపై అవగాహన లేకపోవడంతో.. మోసగాళ్లు ఫోటోగ్రాఫ్‌లు, నకిలీ స్టాంపులను సులభంగా కాపీ చేసి నకిలీ బంగారాన్ని 'హాల్‌మార్కింగ్ స్వచ్ఛత పేరిట' అంటగట్టే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశంలో హాల్‌మార్కింగ్ కేంద్రాల (ఏహెచ్‌సీలు) సంఖ్య 2022 జులైలో 1,220 కాగా, 2026 జులై నాటికి 1,577కు పెరిగింది. ఇప్పటి వరకు హెచ్‌యూఐడీతో కూడిన హాల్‌మార్క్ ముద్రించిన మొత్తం ఆభరణాల సంఖ్య 65 కోట్లు దాటింది. ఒక్క 2025-26లోనే 13.22 కోట్ల ఆభరణాలకు హాల్‌మార్కింగ్ చేశారు. హాల్‌మార్కింగ్ ముద్రణకు తాజా ఛార్జీల పెంపుతో, వార్షికంగా దాదాపు రూ.400 కోట్ల అదనపు ఆర్థిక భారం, దానికి రూ.80 కోట్ల జీఎస్‌టీ భారం పడుతుందని జీజేసీ అంచనా వేస్తోంది. ఫలితంగా వినియోగదారుల రక్షణ కొరవడే పరిస్థితి ఏర్పడినందున, హాల్‌మార్కింగ్‌కు పాత ధర రూ.45ను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర వినియోగదారు వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, బీఐఎస్‌కు జీజేసీ వినతిపత్రం సమర్పించింది.ఆభరణాలకు తప్పనిసరి ఫోటోగ్రఫీ వంటి అదనపు నిబంధనల వల్ల.. గతంలో కేవలం 6 గంటల్లో పూర్తయ్యే హాల్‌మార్కింగ్ ప్రక్రియకు ఇప్పుడు 24-36 గంటల సమయం పడుతోంది. దీని వల్ల ఆభరణాల వ్యాపారుల వర్కింగ్ క్యాపిటల్ ఎక్కువ సమయం నిలిచిపోయి, వారి ఫైనాన్సింగ్ ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని మండలి తెలిపింది.

**హాల్‌మార్కింగ్ తనిఖీ చేసుకోండి ఇలా..**

బీఐఎస్ నిబంధనల ప్రకారం.. అసలైన హాల్‌మార్క్ ఆభరణంపై 3 గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. బీఐఎస్ లోగో, స్వచ్ఛత గ్రేడ్ (22, 18 క్యారెట్‌లు), 6 అంకెలు-అక్షరాలతో కూడిన హెచ్‌యూఐడీ కోడ్ ఉండాలి. దీని పరిశీలనకు స్మార్ట్‌ఫోన్‌లోకి 'బీఐఎస్ కేర్' యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, హెచ్‌యూఐడీ ఆప్షన్ ఎంచుకోవాలి. మనం కొనుగోలు చేయాలనుకుంటున్న ఆభరణంపై ఉండే హెచ్‌యూఐడీ కోడ్‌ను అందులో నమోదు చేస్తే, అది సరైన ధ్రువీకరణ పొందిన ఆభరణమో, కాదో తెలుస్తుంది. సరైనది అయితే ఆభరణంలో బంగారం స్వచ్ఛత, హాల్‌మార్క్ చేసిన తేదీ, సదరు కేంద్రం వివరాలు క్షణాల్లో లభిస్తాయి.

## త్వరలో సీఏఎస్‌లో మార్పులు!

### అభిప్రాయాలను వేగంగా పరిశీలించి సర్క్యులర్

### సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే

దిల్లీ: తన చర్చాపత్రంపై భారీ సంఖ్యలో వచ్చిన అభిప్రాయాలను వేగంగా పరిశీలించి, క్లోజింగ్ ఆక్షన్ సెషన్ (సీఏఎస్) విధానంలో ప్రతిపాదిత మార్పులపై త్వరలో ఒక సర్క్యులర్‌ను జారీ చేయనున్నట్లు సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. సీఏఎస్‌లోని కొన్ని అంశాలు, మార్కెట్ సమయాలు, డెరివేటివ్ కాంట్రాక్టుల సెటిల్‌మెంట్ పద్ధతిని సమీక్షించాలన్న తన ప్రతిపాదనపై ప్రజల నుంచి సెబీ అభిప్రాయాలను కోరింది. అభిప్రాయాలు సమర్పించడానికి గడువు తేదీ అక్టోబరు 3తో ముగిసింది. 'మేం ఈ అభిప్రాయాలన్నింటినీ త్వరగా పరిశీలించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తాం. ఎందుకంటే మా ప్రతిపాదనలు చాలా స్పష్టంగా ఉన్నాయని నేను భావిస్తున్నా'ని సీపీఏఐ (కమొడిటీ అండ్ కేపిటల్ మార్కెట్ పార్టిసిపెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాండే అన్నారు. సంప్రదింపుల పత్రంలోని ప్రతిపాదనలు స్పష్టంగా నిర్వచించినందున, స్పందనలను సంకలనం చేసి విశ్లేషించడానికి నియంత్రణ సంస్థకు ఎక్కువ సమయం అవసరం లేదని ఆయన జోడించారు. ఈ విషయంపై త్వరలో ఒక సర్క్యులర్‌ను ఆశించవచ్చా అని అడగగా.. అవును వస్తుంది అని ఆయన అన్నారు. కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ రోజుల్లో సూచీ, స్టాక్ డెరివేటివ్‌ల సెటిల్‌మెంట్ ధరలను నిర్ధారించే సీఏఎస్ విధానంలో మార్పులను సెబీ సెప్టెంబరులో ప్రతిపాదించింది. ఈక్విటీ క్యాష్ విభాగంలో సీఏఎస్‌ను ప్రవేశపెట్టిన తర్వాత డెరివేటివ్‌ల సెటిల్‌మెంట్ ధరలపై సీఏఎస్ ప్రభావం గురించి ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఈ సమీక్ష జరిగింది. వేలం ప్రక్రియ ద్వారా



ముగింపు ధరలను నిర్ధారించడమే సీఏఎస్ లక్ష్యం.

కార్పొరేట్ బాండ్ డెరివేటివ్స్ మార్కెట్ అభివృద్ధిపై పాండే మాట్లాడుతూ ఈ రంగం వృద్ధి చెందడానికి నియంత్రణపరమైన సౌలభ్యం, సాంకేతిక మౌలిక సదుపాయాలు, మార్కెట్ భాగస్వామ్యం అన్నీ ముఖ్యమైనవని పాండే అన్నారు. బాండ్ మార్కెట్‌లో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ వ్యవస్థలను ప్రోత్సహించాలని సెబీ చూస్తోందని, ఇందుకోసం ప్రాథమిక జారీలకు ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రవేశపెట్టడం, ఆన్‌లైన్ బాండు ప్లాట్‌ఫామ్ ప్రొవైడర్లను నియంత్రించడం, సెకండరీ మార్కెట్ లావాదేవీల కోసం రిక్వెస్ట్-ఫర్- కోట్ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలను ఇప్పటికే తీసుకుందని ఆయన చెప్పారు. భవిష్యత్‌లో బాండ్ సూచీలు, డెరివేటివ్‌లు ఒక ప్రధాన మైలురాయి అవుతాయని భావిస్తున్నానని పాండే అన్నారు.

**ఎఫ్‌పీఐల పెట్టుబడులపై**

విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐలు) నుంచి పెట్టుబడుల రాకపై పాండే మాట్లాడుతూ.. భారత మార్కెట్లలోకి ఎఫ్‌పీఐలు సులభంగా ప్రవేశించడానికి సెబీ అవకాశం కల్పిస్తుందని, అయితే పెట్టుబడి నిర్ణయాలు అంతిమంగా వివిధ దేశాల్లో లభించే రాబడులు, అవకాశాలపై ఆధారపడి ఉంటాయన్నారు. ఎఫ్‌పీఐలకు ప్రవేశాన్ని మరింత సులభతరం చేసే చర్యలపై సెబీ, ఆర్‌బీఐతో కలిసి పనిచేస్తోందని, వ్యవసాయేతర కమొడిటీ డెరివేటివ్‌లకు ఎఫ్‌పీఐలను అనుమతించడం సహా నియంత్రణ సంస్థ ఇప్పటికే అనేక చర్యలు తీసుకుందని ఆయన పేర్కొన్నారు.

## అమెరికా సంస్థల ఉన్నతాధికార్లతో పీయూష్ గోయల్ భేటీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
అమెరికాకు చెందిన పలు కంపెనీల ఉన్నతాధికార్లతో భారత వాణిజ్య పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించి, భారత్‌లో పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. ఆయన అక్టోబరు 5 వరకు అమెరికాలోనే ఉంటారు. అమెరికాలోని ప్రధాన రిటెయిల్ సంస్థ అయిన టార్గెట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ లీగల్ అండ్ కాంప్లియెన్స్ అధికారి గ్రాంట్ మెక్‌గీతో మంత్రి సమావేశమయ్యారు. 'మేక్ ఇన్ ఇండియా చొరవ కింద భారత్‌లో పెరుగుతున్న తయారీ అవకాశాలను టార్గెట్ మరింత సద్వినియోగం చేసుకోవడం, దేశంలో ఉనికిని బలోపేతం చేసుకోవడం, భారత్ నుంచి సరఫరాను విస్తరించడం తదితరాలకు ఉన్న అవకాశాలపై చర్చించామ'ని ఒక సామాజిక మాధ్యమ పోస్ట్‌లో మంత్రి తెలిపారు. ప్రముఖ చాక్లెట్లు, బిస్కెట్ల బ్రాండ్ల సంస్థ మోండలెజ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ముఖ్య ఆర్థిక అధికారి అమిత్ బనతి, ఏయోన్ సీఈఓ గ్రెగ్ కేస్‌తోనూ ఆయన భేటీ అయ్యారు.

**ఎల్ఐసీకు నష్టాన్ని కలిగించినందుకు ఆర్‌కామ్, గ్రూపు మాజీ అధికారులు, ఎల్ఐసీకి చెందిన చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌పై నమోదైన రూ.3,750 కోట్ల మోసం కేసులో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసిందని అధికారులు శనివారం తెలిపారు. 2012లో ఆర్‌కామ్ జారీ చేసిన రూ.1,500 కోట్ల విలువైన ఎన్‌సీడీలను, కంపెనీ ఇచ్చిన తప్పుడు సమాచారం ఆధారంగా ఎల్ఐసీ సబ్‌స్క్రైబ్ చేసుకున్నట్లు ఇప్పటివరకు జరిగిన సీబీఐ దర్యాప్తులో వెల్లడైంది.**

# అనిశ్చితికి తగ్గట్లు విధానాలు రూపొందించాలి




### ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**దిల్లీ:** అనిశ్చితి అనేది ఇప్పుడు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఒక శాశ్వత స్థితిగా మారినందున, దీనికి అనుగుణంగానే విధానాలు రూపొందించాల్సి ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. శనివారం జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్‌లో ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశ ఆర్థిక వ్యవస్థను నిరంతరం బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రైవేటు రంగం మరింతగా పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మన దేశం జీడీపీలో కేవలం 0.83 శాతం మాత్రమే పరిశోధన-అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం ఖర్చు చేస్తోందని, అందులో ప్రైవేటు రంగ వాటా 36 శాతం మాత్రమే ఉందని ఆమె పేర్కొన్నారు. కేవలం ఖర్చును తగ్గించుకోవడం కోసమే ఒకే దేశంపై ఆధారపడే సరఫరా చైన్ ప్రమాదకరమని హెచ్చరించారు. దీన్ని అధిగమించడానికి భారత్ నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్, ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 వంటి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలు నిబంధనలకు లోబడి పారదర్శకంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ దేశ ఆర్థిక పునాదులు బలంగా ఉన్నాయని సీతారామన్ తెలిపారు.

**ఆర్‌బీఐ అప్రమత్తంగా ఉంటుంది.. గవర్నర్ సంజయ్ మల్హోత్రా:** నేటి ఆర్థిక స్థిరత్వం.. రేపటి భద్రతకు గ్యారెంటీ కాదు. అందుకే భవిష్యత్తులో వచ్చే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కొత్తగా పుట్టుకొచ్చే ఆర్థిక లోపాలు, నష్ట భయాలపై ఆర్‌బీఐ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థపై పడే అంతర్గత-బాహ్య ఒత్తిళ్లను పూర్తిగా నిరోధించడం ఎవరికీ సాధ్యం కాదు. అయితే తీవ్రమైన ఒత్తిడి సమయాల్లో ఆర్థిక సేవలు ఆగకుండా, వ్యవస్థ ఒక 'షాక్ అబ్జార్బర్'లా పని చేసేలా బలోపేతం చేయడమే ఆర్‌బీఐ లక్ష్యమని పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ, టోకనైజేషన్ వంటి అంతర్లీన సాంకేతికతలను ప్రోత్సహిస్తూనే, క్రిప్టో కరెన్సీల పట్ల జాగ్రత్తతో కూడిన వైఖరిని మన దేశం కొనసాగిస్తోందని తెలిపారు.

## అద్దె నౌకల్లో.. హర్మూజ్‌ను దాటేద్దాం

### భారత చమురు రిఫైనరీల కొత్త వ్యూహం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధి మీదుగా చమురును మనదేశానికి తీసుకు రావడానికి మన రిఫైనరీ కంపెనీలు కొత్త వ్యూహాన్ని ఎంచుకున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ఈ జలసంధిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నందున, చమురు దిగుమతులకు తిప్పలు తప్పడం లేదు. పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు తీసుకురావడానికి, అక్కడి ట్యాంకర్లనే మన రిఫైనరీలు అద్దెకు తీసుకుంటున్నాయి. తద్వారా వ్యయాలు తగ్గడంతో పాటు, సరఫరా వ్యవస్థకు భద్రత కూడా లభిస్తోంది. తొలుత భారీగా ఖర్చు పెట్టినా: అమెరికా-ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచే, చమురు దిగుమతికి మన కంపెనీలు తమ సొంత ట్యాంకర్లను పంపడం నిలిపేశాయి. దీనికి బదులుగా గల్ఫ్ ఉత్పత్తిదార్లు, అంతర్జాతీయ ట్రేడర్లపై ఆధారపడ్డాయి. చమురు రవాణా భారాన్ని వాటిపై వేసినా, అందుకు భారీ మొత్తాన్ని చెల్లించాల్సి వచ్చేది. ఇపుడేం చేస్తున్నాయంటే..: ఇటీవలి కొద్ది వారాల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ పెట్రోలియం, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ సంస్థలు ఇరాక్ చమురును ఫ్రీ-ఆన్-బోర్డ్ పద్ధతిలో కొంటున్నాయి. అంటే కొనుగోలుదార్లే లాజిస్టిక్స్ నిర్వహించుకోవాలి. మనమే ట్యాంకరును పంపితే వారు చమురు లోడ్ చేసి, గమ్యస్థానానికి పంపుతారు. దీంతో వ్యయాలను నియంత్రించుకోవడానికి భారత కంపెనీలకు వీలు కలిగింది. అయితే ట్యాంకర్లను లీజుకు తీసుకోవడం కూడా అంత సులువుగా జరగడం లేదని తెలుస్తోంది. యుద్ధం ముందు స్థాయికి దిగుమతులు వ్యూహంలో మార్పుతో పాటు, సౌదీ అరేబియా తూర్పు-పశ్చిమ గొట్టపు మార్గం పునరుద్ధరణ జరగడంతో.. గల్ఫ్ నుంచి వచ్చే చమురు పరిమాణం దాదాపు యుద్ధం ముందు స్థాయి(98%)కి చేరింది. రష్యా నుంచి ఎక్కువ చమురు తీసుకోవడానికి అమెరికా నుంచి వ్యతిరేకత ఎదురవుతున్నందునే, గల్ఫ్‌పై మనదేశం దృష్టి సారించింది.





# రాంపల్లి చెత్త కుప్పల్లో కూరుకుపోతోంది

## మూడు నెలలుగా నిలిచిన చెత్త తరలింపు

- దుర్వాసన, దోమలతో ప్రజలకు ఇబ్బందులు
- వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్
- లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిక

**కీసర, అక్టోబర్ 03 (జనంసాక్షి):** రాంపల్లి గ్రామం చెత్త కుప్పల మధ్య ఊపిరాడని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతోందని నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త తరలింపు నిలిచిపోవడంతో గ్రామం డంపింగ్ యార్డును తలపిస్తోందని, ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని అన్నారు. రాంపల్లిలో సేకరించిన వ్యర్థాలను తరలించాల్సిన రాంకీ సంస్థ మూడు నెలలుగా లిఫ్టింగ్ ప్రక్రియ నిలిపివేయడంతో భారీగా చెత్త పేరుకుపోయిందని చంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. చెత్త సేకరణ వాహనాలు వ్యర్థాలను స్థానికంగానే డంప్ చేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. వర్షాలు, ఎండల కారణంగా చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తోందని, దోమలు, ఈగలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని పేర్కొన్నారు. పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించి బ్లీచింగ్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఎంఎంసీ కార్యాలయం ఎదుట, ప్రధాన రహదారులపై ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడతామని చంద్రారెడ్డి హెచ్చరించారు.

# కారు ఢీకొని టిప్పర్ డ్రైవర్ మృతి

**శంషాబాద్, అక్టోబర్ 4 (జనంసాక్షి) :** శంషాబాద్ మండలం నార్కుడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ అమిత్ కుమార్ రామ్ (34) మృతి చెందాడు. ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. నార్కుడ సమీపంలో నిర్మాణ పనుల నిమిత్తం టిప్పర్‌తో వెళ్లిన అమిత్ కుమార్ రామ్ ఆదివారం అర్ధరాత్రి సమయంలో నార్కుడ హనుమాన్ ఆలయం సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, శంషాబాద్ నుంచి షాబాద్ వైపు వెళ్తున్న మారుతి స్విఫ్ట్ కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమిత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు జార్ఖండ్ రాష్ట్రానికి చెందినవాడని, నార్కుడలో నివాసం ఉంటూ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# యువతి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో స్టాఫ్ నర్స్ అరెస్ట్

- వేధింపులకు ఉపయోగించిన శాంసంగ్ మొబైల్ స్వాధీనం
- నిందితురాలిని కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

**కరీంనగర్, అక్టోబర్ 04 (జనంసాక్షి):** యువతి రజిత ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో స్టాఫ్ నర్స్ సిడం గీతాశ్రీ (26)ని కరీంనగర్-2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గతంలో ఒకే ఆసుపత్రిలో పనిచేసిన రజిత, గీతాశ్రీ స్నేహితులుగా ఉన్నారు. అయితే గీతాశ్రీ ప్రేమించిన గణపతి అనే వ్యక్తితో రజిత సన్నిహితంగా ఉంటోందనే అనుమానంతో ఆమె రజితపై కక్ష పెంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో వాట్సాప్ సందేశాలు, ఫోన్ కాల్స్ ద్వారా రజితను బెదిరిస్తూ, దూషిస్తూ వేధించినట్లు పేర్కొన్నారు. వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన రజిత ఈ నెల 1న ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో లభించిన ఆధారాల ఆధారంగా గీతాశ్రీని అదుపులోకి తీసుకుని, నేరానికి ఉపయోగించిన శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితురాలిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

# వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్

### మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం..నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు

**కరీంనగర్, క్రైమ్, అక్టోబర్ 04 (జనంసాక్షి):** కరీంనగర్ నగరంలో వరుస బైక్ చోరీలకు పాల్పడుతున్న దుర్గం సాయి కృష్ణ (24)ను కరీంనగర్-2 టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. విద్యానగర్, హరిహరనగర్, శ్రీహరినగర్ ప్రాంతాల్లో రాత్రివేళ ఇళ్ల ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు పేర్కొన్నారు. చోరీ చేసిన మూడు బైక్‌లను ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంటి వద్ద దాచినట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని పంచుల సమక్షంలో మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సాయి కృష్ణపై గతంలోనూ బైక్ చోరీలు, గంజాయికి సంబంధించిన కేసులు ఉన్నట్లు విచారణలో తేలిందని పోలీసులు వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

# ఓటర్ల హక్కుకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు

### మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, అక్టోబర్ 03 (జనంసాక్షి):** ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, ఓటర్ల హక్కుకు భంగం కలిగించేలా ఎన్నికల కమిషన్ నిర్ణయాలు ఉండకూడదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గం పద్మారావునగర్‌లోని బెల్వర్డి గార్డెన్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సందర్భంగా ఎన్నికల కమిషన్ బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని ఆయన ఆరోపించారు. కార్యక్రమంపై సరైన అవగాహన లేని వారిని బీఎల్ఓలుగా నియమించడం వల్ల అనేక ప్రాంతాల్లో గందరగోళం ఏర్పడి, లక్షలాది మంది ఓట్లు తొలగించబడ్డాయని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టడం ఎందుకని ప్రశ్నించిన ఆయన, ఇప్పటికే నమోదై ఉన్న ఓటర్లను మళ్లీ నమోదు చేయాల్సిన అవసరం లేకుండా కొత్తగా అర్హత పొందిన గ్రాడ్యుయేట్ల నమోదుకు మాత్రమే ఈ ప్రక్రియను పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

కాగా, ఈ నెల 6న తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు నేపథ్యంలో ఆయన జన్మదిన వేడుకలు రెండు రోజుల ముందుగానే ప్రారంభమయ్యాయి. బెల్వర్డి గార్డెన్ అపార్ట్‌మెంట్ వాసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను తలసాని కట్ చేశారు. అనంతరం కాలనీ వాసులు గులాబీ పూలు అందజేసి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళలు స్వయం ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: ఎమ్మెల్యే



**మల్కాజిగిరి సెప్టెంబర్ 4 (జనం సాక్షి) :** మహిళలు స్వయం ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు. గౌతమ్‌నగర్ డివిజన్ ఉత్తమ్‌నగర్‌లోని వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం ఆచార్య ఎంపవరింగ్ ఉమెన్ ఎన్జీవో ఆధ్వర్యంలో 'వి-శక్తి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ బిజినెస్ మేళా-2026' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మహిళలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళా పారిశ్రామికవేత్తలు వ్యాపారాలను విస్తరించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పథకాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, వ్యాపార నిర్వహణ, మార్కెటింగ్ తదితర అంశాలపై త్వరలోనే అవగాహన సదస్సులు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరయ్యేలా అధికారులతో సమన్వయం చేస్తానని పేర్కొన్నారు. మహిళల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్, ఆర్థిక సహకారం అందిస్తే మరింతమందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మేకల సునీత, నాయకులు రాముయాదవ్, రఘురామశర్మ, సూర్యకుమారి, శిరీష, హిమబిందు, పర్వతవర్ధిని, సుబ్రహ్మణ్యం, కావూరి శ్రీనివాసరావు, రమణచార్యులు, నందప్రసాద్ పాల్గొన్నారు.

# బీసీ సమావేశం సమాచారం అడిగినందుకు దాడి చేశారు

- బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు
- మనోహర్‌రెడ్డి వర్గీయులపై మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ ఆరోపణలు



**పెద్దపల్లి, అక్టోబర్ 04 (జనంసాక్షి):** బీఆర్ఎస్ బీసీ సెల్ సమావేశానికి సమాచారం ఇవ్వలేదని అడిగినందుకు తనపై దాడి చేశారని మాజీ జెడ్పీటీసీ గంట రాములు యాదవ్ ఆరోపించారు. పెద్దపల్లి పట్టణంలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీ నాయకులపైనే కుర్చీలు, బండరాళ్లతో దాడి చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఓదెల మండలం హరిపురం సర్పంచ్ విజయ నాగరాజు, గోపరపల్లి సర్పంచ్ రవి యాదవ్‌లకు బీసీ సమావేశ సమాచారం ఇవ్వలేదని అడిగామని తెలిపారు. ఈ విషయంపై మనోహర్‌రెడ్డి వర్గీయులు తనతో పాటు చిరుమల్ల రాకేష్, దాసరి ఉషపై దాడి చేశారని ఆరోపించారు. పెద్దపల్లిలో ఇలాంటి ఘటనలకు తావివ్వడం సరికాదని గంట రాములు యాదవ్ పేర్కొన్నారు.

# దసరా సమీపిస్తున్న వాస్తవ లాభాలు ప్రకటించకపోవడం ఆక్షేపనీయం

**గోదావరిఖని, జనంసాక్షి :** దసరా సమీపిస్తున్న ఇప్పటికి వాస్తవ లాభాలను ప్రకటించకపోవడం ఆక్షేపనియమని టీబీజీకేస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వ వైఖరిని ఖండించాలని ఆయన కోరారు. సింగరేణిలో 2025-26 సంవత్సరానికి సంబంధించిన సంస్థ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని, వాస్తవ లాభాలపై ప్రభుత్వం వెంటనే 36% వాటా ఉద్యోగులకు చెల్లించాలని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం సింగరేణిలోని అన్ని ఏరియాలో గనులు, డిపార్ట్మెంట్ల హెచ్వోడీలకు ఉదయం వినతి పత్రాల సమర్పించనున్నట్టు ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ నెల 6న (మంగళవారం) అన్ని ఏరియాలలో జీఎం ఆఫీసుల ఆవరణలో అన్ని ఏరియాల జీఎం లకు వినతి పత్రాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. ఇప్పటికైనా వెంటనే సంస్థ వాస్తవ లాభాలు ప్రకటించి కార్మికులకు వెంటనే 36% వాటా చెల్లించాలని లేనియెడల సింగరేణి భవన్ ప్రజా భవన్ ముట్టడి కార్యక్రమం చేపడతామని మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు.

# దాండియా నైట్స్‌కు మాజీ మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం

**జవహర్‌నగర్, అక్టోబర్ 4 (జనంసాక్షి):** బోయిన్‌పల్లిలో అక్టోబర్ 10న నిర్వహించనున్న దాండియా నైట్స్ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని జవహర్‌నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాషావోని కొండల్ ముదిరాజ్‌తో కలిసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దాండియా నైట్స్ కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను మల్లారెడ్డికి వివరించి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాషావోని కొండల్ ముదిరాజ్ కుమారుడు బాషావోని నితిన్ ముదిరాజ్, ఆయన స్నేహితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీతం, నృత్యాలతో సందడిగా సాగనున్న దాండియా నైట్స్ కార్యక్రమం యువతతో పాటు కుటుంబ సభ్యులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించేలా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అల్లూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, జిట్ట శ్రీనివాస్, రంగుల సతీష్, దేవయ్య, గున్నాల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యత పేరుతో విద్యను దూరం చేయొద్దు

- ప్రభుత్వ పాఠశాలలను కుదించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తాం
- ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండాలి
- పీఆర్సీ అమలులో జాప్యం జరిగితే మరో పోరాటం
- అక్టోబర్ 17న హైదరాబాద్‌లో సామూహిక నిరాహారదీక్ష




**కోరుట్ల, అక్టోబర్ 04 (జనంసాక్షి):** నాణ్యమైన విద్య పేరుతో ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు దూరం చేయడం సరికాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవేల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాలలు అందుబాటులో ఉండాలని, అందరికీ నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అవసర మైన ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేస్తే స్వాగతిస్తామని, ఆ పేరుతో ఉన్న పాఠశాలలను మూసివేస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.

ప్రాథమిక పాఠశాలలకు ఇబ్బందికరంగా మారిన జీఓ 25ను సవరించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను, 50 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులపై యాప్‌లు, బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని, అన్ని జిల్లాలు, మండలాల్లో విద్యాధికారుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. సర్వీసు నిబంధనల సమస్యలను పరిష్కరించి పదోన్నతులకు మార్గం సుగమం చేయాలని సూచించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించిన నేతలు, పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించి 1.7.2023 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్‌లోగా పీఆర్సీపై నిర్ణయం తీసుకోకపోతే మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వ వ్యాపారీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ఎస్టీఎఫ్ఐ పిలుపు మేరకు అక్టోబర్ 17న హైదరాబాద్‌లో సామూహిక నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఎంటీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయంలోని ఎంటీవో (మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంటీవో కార్యాలయ పరిసరాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యాలయ ఆవరణ, పోలీసు వాహనాల పార్కింగ్ ప్రాంతం, సిబ్బంది విశ్రాంతి బ్యారక్‌లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బంది క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రభుత్వ వాహనాల నిర్వహణ, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యాలయ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, పరిశుభ్రమైన, క్రమబద్ధమైన వాతావరణం పోలీసు సేవల నాణ్యత, సామర్థ్యాన్ని మరింత మెరుగు పరుస్తుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# సూరమ్మ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారు

## బిజెపి ఆధ్వర్యంలో రైతుల కోరిక పై సందర్శన



**కథలాపూర్ అక్టోబర్ 4 (జనం సాక్షి) :** మండలంలోని ఆదివారం న రోజు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడిపెల్లి గోపాల్ రెడ్డి రైతుల కోరిక మేరకు కలిగోట సూరమ్మ ప్రాజెక్టును సందర్శించడం జరిగింది . నిన్న రాత్రి హడావిడిగా ప్రాజెక్టులోని నీరును తీసివేయడానికి ప్రయత్నం చేసినారు అని తెలిసి ఈరోజు ప్రాజెక్టు సందర్శన చేయడం జరిగింది కానీ గత రెండున్నర సంవత్సరాలుగా పని మొదలైన ఇప్పటివరకు 30 40% కూడా పని పూర్తి కాలేదు గతంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ 18 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు కుడి ఎడమ కాలువ ద్వారా సాగునీరును అందిస్తామని ప్రగల్బాలు పలికి ఇప్పటివరకు ప్రాజెక్టు పని పూర్తి కాకపోగా కాంట్రాక్టర్లు నాణ్యమైన పని చేయక అధ్వాన పరిస్థితి ఉన్నది ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేను సూటిగా ప్రశ్నిస్తున్నాం కుడి ఎడమ కాలువకు భూమిని కోల్పోయిన రైతులకు ఎంత నష్టపరిహారం అందించినావు రైతులను మభ్యపెట్టి భయపెట్టి ఇచ్చిన తొమ్మిది పది లక్షలు ఎకరానికి ఏ విధంగా సరిపోతాయి నీకు దమ్ముంటే నష్టపోయిన భూమికి బదులు భూమి ఇవ్వాలని లేకపోతే అదే డబ్బులతో వారికి ఆ భూమిని కొనివ్వాలని డిమాండ్ చేస్తున్నాం రైతులకు ఎకరాకు 40 లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాను మరియు ప్రాజెక్టు పని ఎప్పటిలోగా పూర్తి చేస్తావు సరైన డేట్ ప్రకటించాలని మరియు ఉన్న నీరుతో కింద పంట పొలాలు మరియు అక్కడికి గ్రామ రైతులకు గ్రామాల ప్రజలకు సాగు తాగునీరు కొరకు ఉపయోగపడుతుంది ఇప్పటికే ఎలినోవా పరిస్థితులతో వర్షాలు పడక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు కాబట్టి నీరును తరలించకుండా తొందరగా పనులు పూర్తి చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోడిపెల్లి గోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు ఈ ప్రాజెక్టు సందర్శనలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మల్యాల మారుతి గ్రామ సర్పంచ్ గ్రామ ఉపసర్పంచ్ బీజేపీ నాయకులు కాసోజి ప్రతాప్ నారాయణ గౌడ్ ఆరే శివకుమార్ రాంసింగ్ వినయ్ గౌడ్ మాజీ ఎంపిటిసి రైతులు పాల్గొన్నారు.

# మాదిగ జాతిని అణగదొక్కే కుట్రలపై తిరుగుబాటు తప్పదు

- మాదిగ మహాశక్తి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్



**గోదావరిఖని, జనంసాక్షి:** ప్రభుత్వాల ఏర్పాటు లో కీలకపాత్ర పోషిస్తున్న మాదిగ జాతి ఎదుగుదలపై అణగదొక్కే కుట్రలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని.. ఆ కుట్రలను నిలదీస్తూ తిరుగుబాటు ఉద్యమం చేపడతామని తెలంగాణ మాదిగ మహాశక్తి రాష్ట్ర కోరు కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ (వాసు) హెచ్చరించారు. ఆదివారం పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని ప్రెస్ క్లబ్ ఆడిటోరియంలో మాదిగ మహాశక్తి జిల్లా ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాదిగ మహాశక్తి కోర్ కమిటీ సభ్యుడు ఆసంపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాదిగ జాతి ప్రతినిధులను ఉద్దేశించి సుదీర్ఘంగా మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలలో మాదిగలకు అన్యాయం జరుగుతుందని అసంపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. రాష్ట్రంలో మాదిగల జనాభా ప్రాతిపదికన ప్రకారం చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ల విషయంలో... రాజకీయ పార్టీల ఎదుగుదల విషయంలో మాదిగలను అవసరానికి వినియోగించుకుంటూ ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే విషయంలో పెద్దపెల్లి ఎంపీ విఫలమవుతున్నాడని విమర్శించారు. రాజకీయంగా ఈ ప్రాంతం నుండి ఎదిగి, ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువతకు న్యాయం చేసే విషయంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం పట్ల ఇకపై సహించేది లేదని... అతి త్వరలోనే నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. మాదిగ జాతి ఎదుగుదల కోసం... మాదిగల రాజకీయ భవిష్యత్తు కోసం... మాదిగ మహా శక్తి ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధంగా పోతుందని అసంపల్లి శ్రీనివాస్ తెగేసి చెప్పారు. ఈ సమావేశంలో మాదిగ మహాశక్తి ప్రతినిధులు మడిపల్లి మల్లేష్, ఇంజపూరి పులేందర్, పెద్దల్లి ప్రకాష్, ఆసంపల్లి రవీందర్, ఇరుగు రాల భాగ్యలక్ష్మి, జనగామ స్వప్న, నాతరి ఆదిత్య, పల్లె ప్రశాంత్, సందీప్ తో పాటు అధిక సంఖ్యలో మాదిగ మహాశక్తి జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఐఎఫ్ఎంఎస్ లో విలీనం చేసి కనీస వేతనం నెలకు 26 వేలు ఇవ్వాలి

### ఉద్యోగ భద్రత కల్పించాలి రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య



**తాండూరు అక్టోబర్ 4(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరులోని 200 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుధ్య, రోగుల సంరక్షణ, భద్రతా, పర్యవేక్షక కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య హాజరై య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో పారిశుధ్య, రోగుల సంరక్షణ, భద్రతా, పర్యవేక్షక విభాగాలలో 20 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, చాలీచాలని జీతాలతో, మధ్యవర్తుల మోసాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమ కార్మికులందరినీ ఐఎఫ్ఎంఎస్ లో విలీనం చేయాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించి ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఒప్పంద విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, మహిళా కార్మికులకు జీతంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షులు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రిలో ఉన్న పలు సమస్యలపై రాష్ట్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ, మీ సమస్యలను త్వరలోనే హైదరాబాద్ లోని వైద్య విద్యా సంచాలకులు మరియు ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు మాతంగి అనిల్ కుమార్, పెద్దలు జి. గోపాల్, కె. మల్లప్ప, షేక్ జాంగిర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రి కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డి. రాజు, ఆసుపత్రి కమిటీ అధ్యక్షులుగా ఆర్. సంతోష్, ప్రధాన కార్యదర్శిగా బి. రాజు, కోశాధికారిగా హన్నమ్మ, ఉపాధ్యక్షులుగా అంజలయ్య, మున్ని, జయమ్మ, సహాయ కార్యదర్శులుగా కృష్ణ, మహేష్, వీరేష్, ప్రచార కార్యదర్శులుగా రియాజ్, భాను ప్రసాద్, సభ్యులుగా కె. శ్రీను, రవి, వెంకట్, వినోద్, శకుంతల, సంగమ్మ, పుష్పలత, నర్సింహులు, సిద్ధు, ఎం. శ్రీను ఎన్నికయ్యారు.

# సబ్బండవర్గాలు కేసీఆర్ కోసమే ఎదురు చూస్తుండ్లు

- యువకుల పాదయాత్ర అభినందనీయం : మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, అక్టోబర్ 04,( జనంసాక్షి) :** రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు ముఖ్యమంత్రిగా కేసీఆర్ రావాలనే కోరుకుంటున్నారని, ఆయన కోసమే ఎదురుచూస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ మంథనికి చెందిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్‌లు ఎరవెల్లి వరకు పాదయాత్ర చేసి మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి తిరిగి మంథనికి వచ్చిన సందర్భంగా మంథనిలోని రాజగృహాలో వారిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు యువకులు చేపట్టిన 200 కిలోమీటర్ల పాదయాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తీసుకునేందుకు ఎర్రవెల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు. పాదయాత్ర సందర్భంగా దారిపొడవునా యువకులను కలిసిన అనేకమంది సామాన్య ప్రజలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఆయన ఆశీర్వాదం పొందడం ఎంతో సంతోషకరమన్నారు. ఎర్రవెల్లిలో కేసీఆర్ స్వయంగా వారితో మాట్లాడి భోజనం పెట్టించి, తన వాహనంలోనే వారిని మంథనికి పంపించడం పట్ల ముగ్గురు యువకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటు న్నారన్నారు. తెలంగాణ మట్టిలో పుట్టిన ప్రతి ఒక్కరూ కేసీఆర్ తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నారని, అన్ని వర్గాల్లోనూ అదే భావన కనిపిస్తోందని అన్నారు. కేసీఆర్‌ను కలవడం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నంత ఆనందంగా భావిస్తున్నామని తెలిపారు. ముగ్గురు యువకులు 200 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఇచ్చిన సందేశం రాష్ట్ర ప్రజలకు స్ఫూర్తిదాయ కమన్నారు. వారి కోరిక నెరవేరాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న వారి ఆకాంక్ష ఫలించాలని కోరుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
5 అక్టోబర్ 2026

# పాదయాత్రగా ఎర్రవెల్లికి..

**మంథని నుంచి కేసీఆర్‌ను కలిసేందుకు వచ్చిన యువకులు**



గజ్వేల్ (జనంసాక్షి) : తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తమ అభిమాన నేత, బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు తిరిగి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష రోజు రోజుకూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో బలపడుతున్నది. ఈ మేరకు ఇప్పటికే పలు సందర్భాల్లో పాదయాత్రలు, తదితర దీక్షల ద్వారా కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటున్న విషయం తెలిసిందే.

ఇదే కోవలో మరో ముగ్గురు యువకులు మంథని నుండి పాదయాత్ర చేస్తూ ఆదివారం నాడు ఎర్రవెల్లి కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి సాధకుడు కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం ద్వారానే తెలంగాణ అభివృద్ధి గాడిలో పడుతుందని, ఉద్యోగ ఉపాధి రంగాల్లో తెలంగాణ యువతకు అవకాశాలు మెరుగవుతాయని పాదయాత్ర చేసిన ముగ్గురు యువకులు మంథని బెన్నిపాల్, బూర్ల వెంకటేశ్, కొండ వెంకటేశ్ తెలిపారు.

మంథని నుండి పాదయాత్ర చేస్తూ వచ్చిన బిఆర్ఎస్ యువ కార్యకర్తలను సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ వారితో కాసేపు ముచ్చటించారు. తనపట్ల వారు చూయించిన అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవ్వడమే గాక, పూర్తి విరుద్ధంగా పనిచేస్తున్నదనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, తమ పాదయాత్ర సందర్భంగా ప్రజలతో వారి అనుభవాలను కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు.

కేసీఆర్ పాలనలో తాము అనుభవించిన పాలనా ఫలితాలను రాష్ట్ర ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని, కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోయి తాము ఏమి కోల్పోయామో అర్థం చేసుకున్నారని వారు తెలిపారు. మంథనితోపాటు రాష్ట్ర ప్రజలందరూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ నే తిరిగి ముఖ్యమంత్రిగా నిలబెట్టుకోవడం ఖాయమని పాదయాత్ర చేసిన యువకులు స్పష్టం చేశారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే వేగవంతమైన అభివృద్ధి

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగానే రహదారుల నిర్మాణం
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారం అభినందనీయం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎక్తానగర్ (జనంసాక్షి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిని సాధించవచ్చని తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గుజరాత్ లోని ఎక్తానగర్‌లో నిర్వహిస్తున్న చింతన్ శివిర్-2026కు హాజరయ్యేందుకు వచ్చిన ఆయనకు గుజరాత్ రాష్ట్ర సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో రహదారుల అభివృద్ధికి కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ ప్రాజెక్టులు కీలకంగా మారుతున్నాయని చెప్పారు. గడ్కరీ నాయకత్వంలో పర్వతమాల, రోప్‌వేలు వంటి వినూత్న మౌలిక వసతుల కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని, వీటి ద్వారా దేశ రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతోం దని అన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల అభివృద్ధికి నితిన్ గడ్కరీ సహకరి స్తున్నారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశంసించారు. కాంగ్రెస్, బీజేపీ లేదా ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను సమానంగా పరిగణిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కోరిన పలు రహదారి ప్రాజెక్టులను కూడా కేంద్ర మంత్రి సానుకూలంగా పరిశీలించి మంజూరు చేస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంపొందించడమే చింతన్ శివిర్ ప్రధాన ఉద్దేశమని మంత్రి వివరించారు. రాష్ట్రాల అవసరాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విధానాలు, పథకాలను రాష్ట్రాల్లో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని తెలిపారు. తెలంగాణ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రహదారి మౌలిక వసతులను అభివృద్ధి చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారి ప్రాజెక్టులను సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు.

# తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- స్కూళ్ల ఆధునికీకరణ, బ్రిడ్జిల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- మెప్మా ద్వారా మధిర పట్టణంలో 10 వేల మంది మహిళలకు నైపుణ్య శిక్షణ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ఎర్రుపాలెం (జనంసాక్షి) : ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను హెచ్చరించారు. ఆదివారం ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, అధికారులు బాధ్యతగా, జవాబుదారీతనంతో ప్రజలకు సేవ చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సరఫరా విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మధిర నియోజకవర్గంలో 9 స్కూళ్లను ఆధునికీకరించి అన్ని సదుపాయాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దాలని 57 కోట్ల 69 లక్షల రూపాయలను మంజూరు చేశామని, ఆధునికీకరణ, సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బ్రిడ్జిల నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా పూర్తి చేసి రవాణా సౌకర్యాన్ని సులభతరం చేయాలన్నారు. బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యమైతే ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేపట్టిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో మధిర పట్టణంలోని 10,000 మంది మహిళలకు వివిధ రంగాల్లో ఉపాధి, స్వయం ఉపాధి కల్పించేలా నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న పనుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తే, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. రహదారుల విస్తరణ, వివిధ అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తరలింపు పనులు వేగంగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. స్తంభాల తొలగింపు పనులతో అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. భూ రీ-సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రజా ఫిర్యాదులకు తావులేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. రిసర్వే ప్రక్రియ తర్వాత రికార్డుల నమోదు జాగ్రత్తగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని డిప్యూటీ సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు టీ. మధుసూదన్, వీ. మోహన్ రావు, సి ఈ గౌతం రెడ్డి, ఎస్ ఈ శ్రీనివాసా చారి, పీఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, తహశీల్దార్ సునీత ఎలిజబెత్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 60 వేల మంది విద్యార్థులకు అల్పాహారం

- మునగాలలో రూ. 9.60 కోట్లతో కమ్యూనిటీ కిచెన్
- అక్టోబర్ 6న శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట, అక్టోబర్ 4 (జనంసాక్షి): సూర్యాపేట జిల్లాలోని 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించేందుకు మునగాల మండలంలో రూ. 9.60 కోట్లతో అత్యాధునిక కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు అక్టోబర్ 6న మధ్యాహ్నం 12 గంటలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మునగాల మండలంలో జాతీయ రహదారి పక్కన, మునగాల-మాధారం మధ్య ఎంపిక చేసిన స్థలంలో ఈ కేంద్రీకృత వంటశాలను నిర్మించనున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే కేంద్రం నుంచి ఆహారం తయారు చేసి, ప్యాకింగ్, రవాణా, పంపిణీ చేసే విధంగా ప్రాజెక్టును రూపొందిస్తున్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలతో ఈ వంటశాలను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కమ్యూనిటీ కిచెన్ నిర్మాణానికి సింగరేణి కంపెనీ రూ. 9.60 కోట్ల విరాళం అందించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి చేసిన విజ్ఞప్తుల మేరకు సింగరేణి ఈ నిధులను సమకూర్చినట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు నేరుగా ప్రయోజనం చేకూర్చే ఈ కార్యక్రమానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కంపెనీకి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కృతజ్ఞతలు తెలిపారు.

### 1,029 విద్యాసంస్థలకు ఆహార సరఫరా

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. జిల్లాలోని సుమారు 1,029 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తయారు చేసి సరఫరా చేయడం కమ్యూనిటీ కిచెన్ ప్రధాన ఉద్దేశం. అవసరాన్ని బట్టి ఎంపిక చేసిన కొన్ని జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించే అంశాన్ని కూడా ప్రణాళికలో చేర్చారు. వంటశాలలో ఆహార తయారీ, ప్యాకింగ్, రవాణా, పంపిణీ కోసం సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఆహార నాణ్యత, పోషక విలువలు, పరిశుభ్రత, సురక్షిత నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థులకు పాఠశాల వేళల్లో పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, సంక్షేమానికి తోడ్పడేలా ఈ కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

### పనులపై మంత్రి పర్యవేక్షణ

కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం, నిర్వహణ, ఆహార తయారీ, విద్యాసంస్థలకు సరఫరా వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించనున్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, సంబంధిత అధికారులు, అమలు భాగస్వాములతో సమన్వయం చేస్తూ ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ వంటశాల ద్వారా సూర్యాపేట జిల్లాలోని వేలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందనుంది.

# 'సిల్వర్ జూబ్లీ' కాలేజీ క్రమశిక్షణ, నైతికతకు నిలయం






హైదరాబాద్ (జనంసాక్షి) : సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల(కర్నూలు) క్రమశిక్షణ, నైతికతకు నిలయమని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అభివర్ణించారు. హైదరాబాద్ ఫిలింనగర్‌లోని కల్చరల్ సెంటర్‌లో ఆదివారం జరిగిన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఫ్రాటెర్నిటీ-2026 వార్షికోత్స వంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. ఈ కళాశాల ఎందరో మేధావులను దేశానికి అందించడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఫిలింనగర్‌లోని కల్చరల్ సెంటర్‌లో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ(కర్నూలు) ఫ్రాటర్నిటీ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. 1972 మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థులతో పాటు 2026-27 విద్యా సంవత్సరం చదువుకున్నవారు ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 'ఓర్పు, దీక్ష, నిరంతర కృషి లేకుండా ఏ రంగంలోనూ శాశ్వత విజయం సాధ్యం కాదు. డిగ్రీ అయిపోగానే కేవలం ఉద్యోగం కోసం ఎదురుచూసే "ఉద్యోగార్థులుగా" కాకుండా, పది మందికి ఉపాధి కల్పించే "ఉద్యోగ కల్పనదారులుగా" యువత మారాలి. బోధన కేవలం తరగతి గది నాలుగు గోడలకే పరిమితం కాకూడదు.

పరిశ్రమల అవసరాలకు, కళాశాలల సిలబస్‌కు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చాలి. ఉపాధ్యాయులు కేవలం పాఠం చెప్పి వెళ్లే బోధకులుగా కాకుండా, విద్యార్థులకు మంచి మార్గదర్శకులుగా నిలవాలి. సమాజంలో చదువుకున్న ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను గుర్తించాలి. కేవలం సంపాదన ఒక్కటే జీవితం కాదు; మనం నివసించే సమాజానికి, దేశానికి మనం ఏమి తిరిగి ఇస్తున్నాము అనే స్పృహ ప్రతి యువకుడిలోనూ కలగాలి' అని భారీగా తరలివచ్చిన సిల్వర్ జూబ్లీ పూర్వ విద్యార్థులకు వెంకయ్య సూచించారు. అనంతరం పలు కోర్సుల్లో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఆయన గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

### స్నేహితులతో సందడి

ఆద్యంతం కోలాహలంగా, పలకరింపుల పరిమళంలా సాగిన ఈ వార్షికోత్సవంలో విద్యార్థినుల సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకోగా.. కాలేజీ తొలితరం వాళ్లు డీజే పాటలకు వేదికపై హుషారుగా డాన్సులు చేశారు. అంతేనా.. మూడేళ్లు ఒక్కచోట చదివి.. ఆపై పలు రంగాల్లో రాణిస్తున్న, ఉన్నతోగ్యాలు సాధించిన పలువురు ఈ వార్షికోత్సవంలో తమ జూబ్లీ స్నేహితులను, రూమ్మేట్స్‌ను కలిసి మురిసిపోయారు. కాలేజీ, హాస్టల్ రోజులను తలచుకొని.. ఆ రోజులు మళ్లీ రావు అనుకుంటూ.. ఒకరినొకరు కుశల ప్రశ్నలు అడిగి జూబ్లీ బంధం విడదీయలేనిది అని, వచ్చే వార్షికోత్సవంలోనూ కలుద్దామని వీడ్కోలు తీసుకున్నారు.



# అక్టోబర్ 7 నుంచి 18 వరకు హైదరాబాద్‌లో సారస్ మేళా

- గ్రామీణ ఆడబిడ్డల చేతి ఉత్పత్తులకు నగర మార్కెట్
- సారస్‌ను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: సీతక్క

హైదరాబాద్ (జనంసాక్షి) : ఒకవైపు పోచంపల్లి, గద్వాల, నారాయణపేట చేనేతల అందం.. మరోవైపు గ్రామీణ మహిళల చేతుల్లో రూపుదిద్దుకున్న హస్తకళలు, పచ్చళ్లు, పిండి వంటలు, మిల్లెట్ ఉత్పత్తులు.. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రత్యేకతలు ఒకే వేదికపై కనిపించనున్నాయి. గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు పట్టణ మార్కెట్‌ను కల్పించే సారస్ (సేల్స్ ఆఫ్ అర్టికల్స్ ఆఫ్ రూరల్ అర్టిసన్ సొసైటీ) మేళా అక్టోబర్ 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనుంది. హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించే ఈ మేళాలో తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు వందల స్టాళ్లు ఏర్పాటు చేసి తమ ఉత్పత్తులను ప్రదర్శించి నేరుగా వినియోగదారులకు విక్రయించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్‌ను కల్పించడం సారస్ మేళా ప్రత్యేకత. తయారీదారులు నేరుగా వినియోగదారులను కలుసుకోవడం ద్వారా తమ ఉత్పత్తులకు ఆదరణను అంచనా వేసుకోవడంతో పాటు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యత, ప్యాకేజింగ్, ఉత్పత్తుల్లో మార్పులు చేసుకునే అవకాశం పొందుతారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- ఢిల్లీలో ఆప్ ఆందోళన.. ఉద్రిక్తత



న్యూఢిల్లీ (జనంసాక్షి) : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ మూడు రోజులుగా ఆందోళన చేస్తూనే ఉంది. అక్టోబర్ 2, గాంధీ జయంతి నుంచి ఆప్ ఆందోళన కొనసాగిస్తోంది. ఆదివారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తంగా మారింది. ఆప్ నేతలు బ్యారికేడ్లు ఎక్కి మరీ జంతర్ మంతర్ వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఘర్షణ తలెత్తింది. దీంతో అక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆప్ కార్యకర్తలతోపాటు ఆ పార్టీ విద్యార్థి విభాగం ఏఎఎస్ఏపీ కూడా ఆందోళనల్లో పాల్గొంటోంది.

ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద వీరు ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా చుట్టుపక్కల ప్రాంతాల్లోని రోడ్లను కార్యకర్తలు బ్లాక్ చేశారు. అలాగే, బస్సుల్ని కూడా కదలనివ్వలేదు. దీంతో ఆందోళనకారుల్ని అడ్డు తొలగించేందుకు పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలు, ఇతర విభాగాల భద్రతా బలగాలు ప్రయత్నించాయి. దీంతో నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ ఆందోళనల్లో ఢిల్లీ ఆప్ చీఫ్ సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే సంజీవ్ ఝా, నేహా బోరా వంటి కీలక నేతలు పాల్గొన్నారు. ఈ క్రమంలో కొందరు బారికేడ్లు దాటి జంతర్‌మంతర్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా వీరిని పోలీసులు లాక్కెళ్లి అరెస్టు చేశారు. సౌరభ్ భరద్వాజ్ సహా కీలక నేతల్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే, తనను ఒక ఫుట్‌బాల్‌లాగా విసిరేశారని సౌరభ్ ఆరోపించారు. ఉద్యమకారులతోపాటు అక్కడే ఉన్న కొందరు జర్నలిస్టులపై కూడా పోలీసులు దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు ఈ ఆందోళనల్ని అరికట్టేందుకు దాదాపు 5,000 మందికిపైగా పోలీసుల్ని మోహరించినట్లు తెలుస్తోంది.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370